# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - ఆదివారం 19 ఏప్రిల్ 2026 | సంపుటి: 10 | సంచిక: 103 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## వందేళ్లు జీవించు చిట్టితల్లీ..


రూ. 16 కోట్ల ఇంజెక్షన్ ఇప్పించి ఆశీర్వదించిన లోకేశ్





2

## భగభగ మండుతున్న సూర్యుడు



2

# రిజర్వేషన్లు, డీలిమిటేషన్ పేరుతో రాజ్యాంగం మార్చేందుకు బీజేపీ కుట్ర

## ప్రతిపక్షాలు ఓడించింది బీజేపీ దురుద్దేశాలనే



- మహిళా బిల్లుపై ప్రధాని మోడీకి చిత్తశుద్ధి లేదు
- మహిళా రిజర్వేషన్ల బిల్లు రేపు తెచ్చినా మద్దతిస్తాం
- ప్రొరేటా పద్ధతి డీలిమిటేషన్‌తో రాష్ట్రాల మధ్య అంతరం
- దేశంలో దక్షిణాది రాష్ట్రాలు కూడా భాగమేనని గుర్తుంచుకోవాలె
- దక్షిణాదికి జరిగే అన్యాయాన్ని లోక్‌సభ సాక్షిగా అడ్డుకున్నం
- బీజేపీతో పొత్తు పెట్టుకునే పార్టీల భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుంది
- ఢిల్లీలో మీడియా ప్రతినిధుల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 18, (మనం బ్యూరో): మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ ముసుగులో రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నిందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. పార్లమెంటు వేదికగా బీజేపీ ప్రభుత్వం చేసిన ఈ ప్రయత్నాన్ని కాంగ్రెస్, ఇతర విపక్ష పార్టీలు విజయవంతంగా అడ్డుకున్నాయని పేర్కొన్నారు. బిల్లులు వీగిపోవడం కేవలం కేంద్రంలోని అధికార పార్టీ ఓటమే కాదు, బీజేపీ చిత్తశుద్ధి కూడా అని వ్యాఖ్యానించారు. శనివారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. గత పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి 400 సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్నే మార్చే వారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదనీ,

...మిగతా 2లో

### బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయండి



కేంద్ర మంత్రి కుమారస్వామికి సీఎం విజ్ఞప్తి

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ విందుకు హాజరైన రేవంత్

2

# వెనక్కి తగ్గేదే లేదు

## మహిళలకు రిజర్వేషన్ కల్పించి తీరుతం

- ప్రతిపక్షాల వల్లే పార్లమెంటులో బిల్లు నెగ్గలేదు
- దేశంలోని తల్లులకు, సోదరీమణులకు క్షమాపణలు
- తమ కలలను చిదిమేసిన వారిని నారీశక్తి శిక్షిస్తుంది
- 131వ సవరణ బిల్లుపై శనివారం రాత్రి జాతినుద్దేశించి ప్రసంగించిన మోడీ

ఢిల్లీ, ఏప్రిల్ 18: మహిళా సాధికారతపై తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, మహిళా రిజర్వేషన్ల బిల్లు అమలుకు తాము కట్టుబడి ఉన్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. శనివారం రాత్రి జాతినుద్దేశించి ప్రసంగించిన ఆయన, పార్లమెంటులో ఈ బిల్లు ఆమోదం పొందకపోవడానికి విపక్షాల వైఖరే కారణమని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.



...వివరాలు 2లో

# 2023 చట్టాన్ని తక్షణమే అమలుచేయాలె

### మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలనుకుంటే పాత చట్టాన్నే కొనసాగించాలె

ప్రధానికి లేఖ రాయనున్న ఇండియా కూటమి

ఢిల్లీ, ఏప్రిల్ 18: చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రధాని భావిస్తే.. 2023 చట్టాన్ని తక్షణమే అమలుచేయాలని ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. తాము మహిళా

...మిగతా 2లో





## ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలతో సమానంగా ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు మినహాయింపులు ఇవ్వలేం

### తేల్చి చెప్పిన ఢిల్లీ హైకోర్టు

ఢిల్లీ, ఏప్రిల్ 18: కేంద్రప్రభుత్వ ఉద్యోగాల నియామకాలకు సంబంధించి ఆర్థికంగా బలహీన వర్గాల (ఈడబ్ల్యూఎస్)కు చెందిన అభ్యర్థులు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కేటగిరీల వారితో సమానంగా వయోపరిమితిలో మినహాయింపు, ఉద్యోగం కోసం మరిన్ని దఫాలు ప్రయత్నించే అవకాశాన్ని పొందలేరని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల ఆర్థిక పరిస్థితి, కుల ప్రాతిపదికన జరిగే వివక్షతో పోల్చదగింది కాదని జస్టిస్ అనిల్ క్షేత్రపాల్, జస్టిస్ అమిత్ మహాజన్ల ధర్మాసనం అభిప్రాయపడింది. వయోపరిమితిలో మినహాయింపు, ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాల సంఖ్యలో సడలింపు అమలు చేస్తూ ప్రభుత్వం రూపొందించిన విధానంలో దురుద్దేశాలు లేవని, అది ఏకపక్షంగా,

...మిగతా 2లో

### వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెం ఎయిర్‌పోర్టుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలి

ఎయిర్‌పోర్ట్ అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష



హైదరాబాద్, ఏప్రిల్ 18, (మనం బ్యూరో): రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకువెళ్లాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటున్నదని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ క్రమంలో వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేసిందని పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో ఎయిర్ పోర్ట్ అథారిటీ సదరన్ రీజియన్, ఈడీ రాజ్ కిషోర్, ఏవియేషన్ డైరెక్టర్ భరత్ రెడ్డి తదితరులతో కలిసి ప్రభుత్వం వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెంలో నిర్మించతలపెట్టిన ఎయిర్‌పోర్టుల నిర్మాణంపై

...మిగతా 2లో



### ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు సర్జరీ

హైదరాబాద్, ఏప్రిల్ 18: పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కొన్నాళ్లుగా ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా ఆయన ఎక్కువగా జ్వరం బారిన పడుతున్నట్లుగా వార్తలు వస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో ఆయన శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురవడంతో.. వ్యక్తిగత వైద్యుల సలహా మేరకు వైద్య పరీక్షలకు హాజరయ్యారు. ఈ పరీక్షల అనంతరం ఆయనకు సర్జరీ జరిగినట్లుగా.. జనసేన పార్టీ అధికారికంగా ఓ ప్రకటనను విడుదల చేసింది. 'ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ శనివారం సాయంత్రం

...మిగతా 2లో

### రేపు రెండో విడత రైతు భరోసా నిధులు

45,11,947 మంది రైతుల ఖాతాల్లో జమకానున్న రూ.5,653 కోట్లు

హైదరాబాద్, ఏప్రిల్ 18: తెలంగాణలో ఈ నెల 20వ తేదీన రెండో విడత రైతుభరోసా నిధులు విడుదల చేయనున్నారు. భూపాలపల్లి జిల్లా కాటారం

...మిగతా 2లో





### మహిళా రిజర్వేషన్ పేరుతో డీలిమిటేషన్ బిల్లు

- అందుకే.. పార్లమెంటులో ప్రజాస్వామ్యం గెలిచింది
- బీజేపీ ఒక్కసారైనా మహిళను జాతీయ అధ్యక్షురాలిని చేసిందా?
- కిషన్ రెడ్డి రాష్ట్రానికి ఏం చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలి
- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

2


### గంటల్లోనే హర్మూజ్‌ను మళ్లీ మూసేసిన ఇరాన్

అమెరికా వైఖరే కారణమని చెప్పిన ఐఆర్‌జీసీ

టెహ్రాన్, ఏప్రిల్ 18: అమెరికా, ఇరాన్ మధ్య మరో దఫా దౌత్య చర్చల కోసం ప్రయత్నాలు జరుగుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. హర్మూజ్ జలసంధిని తెరిచే ఉంచుతామని

...మిగతా 2లో





## హర్మూజ్ దాటుతున్న భారతీయ నౌకలపై కాల్పులు

### ఇరాన్ రాయబారికి భారత్ సమన్లు

ఢిల్లీ, ఏప్రిల్ 18: హర్మూజ్ జలసంధిని తెరిచే ఉంచుతామని ప్రకటించిన మరుసటి రోజే.. మళ్లీ దానిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో హర్మూజ్ జలసంధిని దాటేందుకు యత్నించిన రెండు నౌకలపై కాల్పులు జరిగినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ నౌకలు భారతీయ జెండాలతో ప్రయాణిస్తున్నట్లు తెలిసింది. హర్మూజ్ జలమార్గం ద్వారా ప్రయాణిస్తున్న రెండు నౌకలపై ఐఆర్జీసీకి సంబంధించిన గన్ బోట్లు కాల్పులు జరిపాయి. అయితే.. ట్యాంకర్లు, అందులోని సిబ్బంది సురక్షితంగా ఉన్నారని యునైటెడ్ కింగ్డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ వెల్లడించింది.

అమెరికాతో జరిగిన చర్చల సందర్భంగా ఇరాన్ హర్మూజ్ జలసంధిని కొద్ది సమయం పాటు తెరిచి ఉంచింది. ఇరాన్ ఓడరేవుల చుట్టూ అమెరికా తన దిగ్బంధనాన్ని కొనసాగించడంతో ఆ జలసంధిని తిరిగి మూసివేసింది. ఈ ప్రకటన జరిగాక కొన్ని గంటల తర్వాత ఈ ఉద్రిక్త పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం.

**ఇరాన్ రాయబారికి భారత్ సమను**

ఈ దాడులను కేంద్రం తీవ్రంగా పరిగణించింది. ఈ క్రమంలోనే భారత్ లోని ఇరాన్ రాయబారికి విదేశాంగశాఖ సమన్లు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు ప్రకటించాయి.

## శత్రువులకు ఘోర పరాజయమే

### ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ



టెహ్రాన్, ఏప్రిల్ 18: ఇరాన్-అమెరికా మధ్య దౌత్య చర్చల కోసం ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ కీలక హెచ్చరికలు చేశారు. శత్రువులకు ఘోర పరాజయాన్ని రుచి చూపించడానికి తమ నౌకాదళం సిద్ధంగా ఉందన్నారు. మరోవైపు ఇరుపక్షాలు ఉమ్మడి నిర్ణయం తీసుకునే వరకూ అమెరికాతో ఎటువంటి చర్చలు జరగవని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి సయీద్ ఖతిబ్జా పేర్కొన్నారు. ఏదేమైనప్పటికీ ఎవరి కోసమూ హక్కులను వదులుకోబోమని స్పష్టం చేశారు. ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధించే ఎలాంటి దిగ్బంధనాన్ని టెహ్రాన్ అంగీకరించబోదని.. వాషింగ్టన్ నుంచి వచ్చే ఆదేశాలకు కట్టుబడి ఉండబోదని తెలియజేశారు. ఇతర దేశాలు ఎలా ఉండాలో చెప్పే హక్కు ఆ దేశానికి లేదని వ్యాఖ్యానించారు.

**పశ్చిమాసియా జలాల్లోకి తిరిగొచ్చిన జెరాల్డ్..**

ఇరుదేశాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో

...మిగతా 2లో

## ఒప్పందం కుదుర్చుకోకపోతే మళ్లీ బాంబులేస్తం

### ఇరాన్‌కు ట్రంప్ తాజా వార్నింగ్

వాషింగ్టన్, ఏప్రిల్ 18: ఇరాన్ తో ఒప్పందంపై కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారంలోగా ఇరాన్ తమతో ఒప్పందం కుదుర్చుకోవాలి. లేదంటే.. దానిపై మళ్లీ బాంబులేస్తామ'ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఆరిజోనాలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. ట్రంప్ ఈ

...మిగతా 2లో

2 బీబీని బ్లాక్ చేసి.. ఫోన్ ఆఫ్ చేయండి


స్కాలర్స్ జూనియర్ కళాశాల
NEET / JEE ACADEMY
నందిహిల్స్ & నాగవరం, వనపర్తి జిల్లా
Cell: 9949251256, 9491484296

IPE. March - 2026 ఇంటర్ ఫలితాలలో రాష్ట్ర స్థాయి మార్కులతో విజయ పరంపర కొనసాగించిన స్కాలర్స్

BiPC-II 993 B. MAHALAXMI /1000
MPC-II 992 K. NARMADA /1000
ALWAYS No.1
BiPC-I 437 D. PALLAVI / NIMRAH AFSHEEN /440
MPC-I 463 A. BUNNY /470

BiPC: 993 B. MAHALAXMI | 992 ALISHA SHAJI | 991 SUSMITHA | 990 BANDHAVI
MPC: 992 K. NARMADA | 991 K. SHIRISHA
BiPC: 437 D. PALLAVI | 437 NIMRAH AFSHEEN | 436 B. AKSHAYA LAXMI | 434 BHAVYASRI | 434 K. YAMINI | 434 SATHWIKA
434 K. RAJESH | 432 R. INDU | 432 AKHILANDESHWARI | 432 GEYASRI | 432 AKHILA | 431 YUSRA FATHIMA
MPC: 463 A. BUNNY | 462 G. HARSHITHA | 462 SRI VARSHINI | 460 DIVYA SRI
CEC: 406 MUSKAN

990 పైగా మార్కులు సాధించిన మా విద్యార్థులు 6 | 900 పైగా మార్కులు సాధించిన మా విద్యార్థులు 98 | 400 పైగా మార్కులు సాధించిన మా విద్యార్థులు 96

హైదరాబాద్ కార్పొరేట్ కళాశాలలో సుదీర్ఘ అనుభవం పొందిన అధ్యాపకులచే NEET / JEE LONG TERM కోచింగ్ నిర్వహించబడును మరియు Regular Inter + NEET, Regular Inter + JEE Regular Inter + EAPCET కోచింగ్ ఇవ్వబడును.

మనం Manam



# శత్రువులకు ఘోర పరాజయమే

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా విమాన వాహక నౌక 'యూఎస్ఎస్ జెరాల్ ఆర్ ఫోర్డ్' మళ్లీ పశ్చిమాసియా జలాల్లోకి ప్రవేశించింది. ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన ఈ ఎయిర్క్రాఫ్ట్ క్యారియర్ మరమ్మతుల అనంతరం ఇతర విమాన వాహకనౌకలతో పాటు విధుల్లో చేరినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. నెలరోజుల పాటు తూర్పు మధ్యధరా సముద్రంలో ఉన్న ఈ నౌక సూయజ్ కాలువను దాటి.. ఎర్రసముద్రంలోకి ప్రవేశించినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. దీంతోపాటు యూఎస్ఎస్ మహాన్, యూఎస్ఎస్ విన్స్టన్ ఎస్.చర్చిల్ అనే రెండు డిస్ట్రాయర్లు కూడా ఉన్నట్లు తెలిపారు.

మరో అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ జార్జ్ హెచ్.డబ్ల్యూ.బుష్ సైతం పశ్చిమాసియా వైపు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అది దక్షిణాఫ్రికా తీరంలో ఉంది. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ ప్రస్తుతం అరేబియా సముద్రంలో మోహరించి ఉంది. అగ్రరాజ్యం మళ్లీ పశ్చిమాసియాలో నౌకా దళాన్ని మోహరిస్తుండడంతో ఏ సమయంలో ఏం జరుగుతుందోనని ప్రపంచ దేశాలు కలత చెందుతున్నాయి.

# మహిళా రిజర్వేషన్ పేరుతో డీలిమిటేషన్ బిల్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 18, (మనం బ్యూరో):** మహిళలకు రిజర్వేషన్ పేరుతో డీలిమిటేషన్ బిల్లు తెచ్చిన బీజేపీ అశాస్త్రీయంగా పాస్ చేయించుకోవాలని చూసిందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అందుకే విపక్ష పార్టీలన్నీ ఏకమై బిల్లును ఓడించి బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాయని పేర్కొన్నారు. శనివారం గాంధీభవన్లో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో, యూత్ కాంగ్రెస్ ఇందిరా పార్కు వద్ద మోడీజీకో హఠావో-కిసానోంకో బచావో అంటూ నిర్వహించిన మహా ధర్నాలో పీసీసీ చీఫ్ మాట్లాడారు. ఉత్తర భారత దేశానికి ఎక్కువ దక్షిణాదికి తక్కువ సీట్లు వచ్చే బిల్లును అడ్డుకోవడంలో ఖర్గే, రాహుల్, సోనియా, ప్రియాంక గాంధీ సక్సెస్ అయ్యారని పేర్కొన్నారు. బిల్లు వీగిపోవడం చూస్తే బీజేపీకి, ఎన్డీయేకు మహిళల పట్ల ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు. బిల్లు వీగిపోవాలనే డీలిమిటేషన్తో ముడి పెట్టారనీ, తొలి మహిళా ప్రధాని, స్పీకర్, రాష్ట్రపతిని చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని గుర్తు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని బీజేపీ ఒక్కసారైనా మహిళను జాతీయ అధ్యక్షురాలిని చేసిందా అని ప్రశ్నించారు. ఇలాంటి వారు మహిళల గురించి మాట్లాడుతున్నారనీ, అబద్ధాలతో ప్రజలను మోసం చేసి నిందను వేరే వాళ్ల మీద వేయాలని చూస్తున్నారని విమర్శించారు. కర్ణాటక ఎంపీ తెలంగాణ గురించి నీచంగా మాట్లాడుతుంటే అడ్డుకునే సోయి బీజేపీ ఎంపీలకు లేదా అని ప్రశ్నించారు. ఎంతో మంది బలిదానంతో తెలంగాణ వస్తే పాకిస్తాన్తో తెలంగాణను బుద్ధిలేని ఎంపీ పోల్చితే బుద్ధి ఉన్న తెలంగాణ ఎంపీలు ఎందుకు నోరు మెదపలేదని నిలదీశారు. 40 ఏళ్ల రాజకీయంలో కిషన్ రెడ్డి ఒక్క బీసీ లీడర్ను చేశారా ? బీజేపీ మోసకారి పార్టీ అని మహిళలే కాదు, యావత్తు బీసీలు గ్రహిస్తున్నారని పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు నిధుల విషయంలో అన్యాయం జరుగుతోందనీ, భవిష్యత్తులో ఇది ప్రమాదానికి దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పన్నులు కట్టడంలో దక్షిణాది రాష్ట్రాలు ముందు వరసలో ఉంటే నిధులు, సీట్ల విషయంలో కోత పెట్టడం సరికాదనీ, దీనిపై బీజేపీ సమీక్షించుకోవాలని సూచించారు. హరీష్ రావు వ్యాఖ్యలపై స్పందిస్తూ పులి కష్టం ఫాం హౌస్కు పరిమితమైందనీ, అదే 20న పులి తిన్న మేకలెన్నో బయటపెట్టబోతున్నామన్నారు. మంత్రివర్గ విస్తరణపై మాట్లాడుతూ సీఎం సరైన సమయంలో సరైన సమాధానం ఇస్తారని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# గంటల్లోనే హర్మూజ్‌ను మళ్లీ మూసేసిన ఇరాన్

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించిన మరుసటి రోజే.. మళ్లీ దానిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఇందుకు అమెరికాయే కారణమని చెప్పింది. ఇరాన్ ఓడరేవుల చుట్టూ అమెరికా తన దిగ్బంధనాన్ని కొనసాగించడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇరాన్ సంయుక్త మిలిటరీ కమాండ్ పేర్కొంది.హర్మూజ్ జలసంధిపై నియంత్రణ మునుపటి స్థితికి చేరుకుంది. ప్రస్తుతం మా సాయుధ దళాల నియంత్రణలో ఉంది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బంధనం అమల్లో ఉన్నంతకాలం.. జలసంధి మార్గంలో రాకపోకలను అడ్డుకుంటాం'' అని ఇరాన్ సంయుక్త మిలిటరీ కమాండ్ హెచ్చరించింది. అమెరికాతో ఒప్పందం కుదుర్చుకునే వరకు హర్మూజ్లో దిగ్బంధనం కొనసాగుతుందని డొనాల్ ట్రంప్ పేర్కొన్న నేపథ్యంలో ఇరాన్ నుంచి ఈ స్పందన రావడం గమనార్హం.

**గగనతలాన్ని పాక్షికంగా తెరుస్తున్నాం..**

మరోవైపు, దేశంలోని పలు ఎయిర్ పోర్టులను తిరిగి తెరవడంతో పాటు తమ గగనతలాన్ని పాక్షికంగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. తూర్పు మార్గంలో అంతర్జాతీయ విమానాలు ప్రయాణించేందుకు అనుమతిస్తున్నట్లు సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ వెల్లడించింది.

# ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలతో సమానంగా ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు మినహాయింపులు ఇవ్వలేం

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యాంగ వ్యతిరేకంగా తీసుకున్న చర్య కాదని ధర్మాసనం పేర్కొంది. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, ఇతర వెనుకబడిన తరగతులతో సమానంగా తమకూ వయోపరిమితిలో, ప్రయత్నాల సంఖ్యలో మినహాయింపు కల్పించాలంటూ కొందరు ఈడబ్ల్యూఎస్ తరగతికి చెందిన వ్యక్తులు దాఖలు చేసిన వ్యాజ్యంపై స్పందిస్తూ కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. సామాజికంగా వెనుకబడిన వర్గాలు, ఆర్థికంగా చితికిపోయిన వర్గాలు ఎదుర్కొనే పరిమితులు సమానమైనవి కావని స్పష్టతనిచ్చింది. వెనుకబడిన వర్గంలో జన్మించిన వ్యక్తి దాని పర్యవసానాలను జీవితాంతం అనుభవిస్తాడు, ఆర్థిక పరిస్థితులు జీవితాంతం ఒకేలా ఉండవు.. ఆర్థిక పరిస్థితి కొన్నేళ్లలో లేదా తరం మారితే మారిపోవచ్చు, కానీ కుల వివక్ష అలాంటిది కాదని ధర్మాసనం చెప్పింది.

# రేపు రెండో విడత రైతు భరోసా నిధులు

(మొదటి పేజీ తరువాయి)

బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి వీటిని విడుదల చేయనున్నారు. రెండో విడతలో 45,11,947 మంది రైతులకు రూ.5,653 కోట్ల నిధులు జమ కానున్నాయి. మార్చి 22న సిద్దిపేట జిల్లా నర్మెటలో జరిగిన బహిరంగ సభలో తొలి విడతగా 1.50 కోట్ల ఎకరాలకు రూ.3,590 కోట్లు జమ చేసిన సంగతి తెలిసిందే.



# ఒప్పందం కుదుర్చుకోకపోతే మళ్లీ బాంబులేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న కాల్పుల విరమణ ఒప్పందం ఈనెల 21తో ముగియనుంది. ఈలోపే ఒక ఒప్పందం చేసుకోవాలని ఇరుదేశాలు ప్రయత్నిస్తున్నాయి. అందులోభాగంగా ఇస్లామాబాద్ వేదికగా.. అమెరికా-ఇరాన్ మధ్య సోమవారం మరోసారి చర్చలు జరగనున్నట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ (ఐట్చు)కు ట్రంప్ అల్టిమేటం జారీ చేశారు. బుధవారంలోగా ఓ ఒప్పందం చేసుకోవాలన్నారు. ఒప్పందం కుదరకపోతే.. 21వ తేదీ తర్వాత కాల్పుల విరమణ ఒప్పందం పొడిగించకపోవచ్చని తెలిపారు. ఆ దేశంపై మళ్లీ బాంబులు వేస్తామని హెచ్చరించారు. అదే సమయంలో ఇరాన్ నౌకల రాకపోకలపై తమ దిగ్బంధనం కొనసాగుతోందన్నారు. చర్చలు విఫలమైతే పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని ట్రంప్ వ్యాఖ్యలతో స్పష్టమవు

**ఇరాన్ యురేనియంను అమెరికాకు తీసుకొస్తాం**

ఇరాన్తో కలిసి దాని అణుకేంద్రాల నుంచి శుద్ధి చేసిన యురేనియంను భౌతికంగా వెలికితీయనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. యురేనియం కోసం తవ్వకాలు చేపడతామని, అందుకు తమకు భారీగా సామగ్రి కావాల్సి ఉంటుందన్నారు. దాన్ని త్వరలోనే అమెరికా భూభాగంలోకి తరలిస్తామని వెల్లడించారు. ఈసందర్భంగా అణ్వాయుధాన్ని వదిలేస్తామని ఇరాన్ నుంచి తమకు స్పష్టమైన హామీ వచ్చిందన్నారు. శుద్ధి చేసిన యురేనియం నిల్వలను తమకు అప్పగించేందుకు ఇరాన్ అంగీకరించిందంటూ ట్రంప్ ఇంతకుముందు కూడా ప్రకటించారు. అయితే, టెహ్రాన్ వీటన్నింటిని కొట్టిపారేసింది.

# వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెం ఎయిర్‌పోర్టుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరంగల్ ఎయిర్పోర్టుకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే సుమారు 953 ఎకరాల భూమిని సేకరించి కేంద్రానికి అప్పగించిందనీ, అలాగే ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని డిఫెన్స్, సివిల్ ఏవియేషన్, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాయనీ, ఇందుకు సంబంధించి మాస్టర్ ప్లాన్ తక్షణమే సిద్ధం చేయాలని సూచించారు. ఈ ఎయిర్పోర్టుకు అవసరమైన భూ సేకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణలో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గతంలో ప్రతిపాదించిన స్థలం విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేదని కేంద్ర పౌర విమానయాన శాఖ తెలిపిన నేపథ్యంలో దీనిపై మరింత లోతైన అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలపై ఒక నివేదిక రూపొందించాలని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి విమానాశ్రయ అధికారులను కోరారు.

# బీబీని బ్లాక్ చేసి.. ఫోన్ ఆఫ్ చేయండి

## ట్రంప్ పై ఇరాన్ సెటైర్లు

**హరారే, ఏప్రిల్ 18:** హర్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ వరుసగా చేస్తున్న ప్రకటనలపై.. ఇరాన్ వ్యంగ్యాస్త్రాలు విసిరింది. ఫోన్ పక్కనపెట్టి.. బీబీ (ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ఉద్దేశిస్తూ)ని బ్లాక్ చేయాలంటూ సెటైర్లు వేసింది.

హర్మూజ్ ను శాశ్వతంగా తెరిచి ఉంచేందుకు టెహ్రాన్ అంగీకరించిందని ట్రంప్ పేర్కొన్నారు. ప్రపంచానికి ఇదో గొప్ప రోజుగా అభివర్ణించారు. దీనిపై జింబాబ్వేలోని ఇరాన్ రాయబార కార్యాలయం స్పందిస్తూ.. ట్రంప్ పై సెటైర్లు వేసింది. 'మీరు మరీ సంతోషంగా ఉన్నట్లు చూపించుకోకండి. హుందాగా ఉండండి' అంటూ ఎక్స్ పోస్టులో పేర్కొంది. హర్మూజ్ జలసంధి, ఇరాన్లో పాలన మార్పు అనే ఊహలను ఇకపై వదులుకోవాలని సూచించింది. తమ సమస్యలన్నింటినీ తామే పరిష్కరించుకుంటామని స్పష్టం చేసింది. ఫోన్ ఆఫ్ చేసి విశ్రాంతి తీసుకోవాలని, బీబీని వారం రోజులు బ్లాక్ చేయాలని పేర్కొంది. తేలికైన భోజనం తిని.. హాయిగా నిద్రపోవాలని సూచించింది. ఇక, అమెరికా- ఇరాన్ మధ్య ఏప్రిల్ 20న మరోసారి చర్చలు జరగనున్నట్లు తెలుస్తోంది. ఈ చర్చల్లో ఒప్పందం కుదరకపోతే ఇర్వా మళ్లీ బాంబులు పడతాయ్ అంటూ ట్రంప్ హెచ్చరికలు చేశారు. బుధవారంలోగా ఒప్పందం చేసుకోవాలని ఆదేశించారు.

# రిజర్వేషన్లు, డీలిమిటేషన్ పేరుతో రాజ్యాంగం మార్చేందుకు బీజేపీ కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం వరకు కొత్త చట్టాలను రూపొందించి పార్లమెంటు ముందుకు తీసుకొస్తే తాము మద్దతిస్తామని స్పష్టం చేశారు. సోమవారం బిల్ పాస్ చేసుకుని మంగళవారం నుంచే ఈ చట్టాలను అమలు చేయవచ్చని సూచించారు. నియోజకవర్గాల పునర్విభజనకు అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేయాలనీ, ప్రతి లోక్సభ నియోజకవర్గం పరిధిలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి జాతీయ ఏకాభిప్రాయ సాధనకు కృషి చేయాలని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామంటే దేశ ప్రజలు ఒప్పుకోరనీ, దీంతో మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని మేం యోచిస్తే కాంగ్రెస్ అడ్డుకుందని బద్నాం చేసే పనిలో మోడీ, బీజేపీ పడ్డాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రధాని మోడీ చిత్తశుద్ధిని చాటుకోవాలనీ, సరైన పద్ధతిలో బిల్లులు తయారు చేయాలని సూచించారు. పార్లమెంట్లో ఓడిపోయింది మోడీ అహంకారం తప్ప ఇంకొకటి కాదన్నారు. దేశంలో దక్షిణాది రాష్ట్రాలు కూడా భాగమేననీ, దేశంలోనే దక్షిణాది ప్రజలు బతుకుతున్నారనీ, దేశ సేవలో తాము ఎవరికన్నా తక్కువ కాదనీ, దేశాన్ని కాపాడుకోవడం తమ బాధ్యత అని స్పష్టం చేశారు. మహిళా బిల్లు వీగిపోవడం బీజేపీ విధానాల ఓటమిగా భావించాలి.

ఈ బిల్లుపై ప్రధాని మోడీకి నిజాయతీ లేదు. నిజాయతీగా మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకొస్తే పార్లమెంట్లో అందరూ మద్దతు తెలిపే వారు. మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకొచ్చి దక్షిణాదికి అన్యాయం చేయాలని చూశారు. ఇప్పటికైనా ప్రధాని మోడీ ఉత్తర, దక్షిణ భారత్ మధ్య అంతరాలు సృష్టించే విధానాన్ని విరమించుకోవాలని సూచించారు. మహిళా రిజర్వేషన్ల పట్ల బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 2023లో పాస్ అయిన బిల్లులో సవరణలు చేయాలనుకుంటే ఒక చిన్న మార్పుతో రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం ఉందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కానీ, బీజేపీ ఉద్దేశం రాజ్యాంగం మార్పు, రిజర్వేషన్లు ఎత్తి వేయడమేననీ, పార్లమెంట్ వేదికగా జరిగిన ఈ తీరును 140 కోట్ల మంది ప్రజలు చూశారని వ్యాఖ్యానించారు. దేశ భవిష్యత్తును, సమగ్రతను బలహీనపరిచేలా దేశ రాజకీయ చిత్రపటాన్నే మార్చే బిల్లుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందనీ, దీనిని ప్రతిపక్ష పార్టీలు ఓడించాయన్నారు. ప్రతిపక్షాలు అడ్డుకున్నది ప్రమాదకరమైన నియోజకవర్గాల పునర్విభజన బిల్లునే తప్ప మరొకటి కాదన్నారు. ప్రతిపక్షాలు నిలువరించింది, ఓడించింది కేంద్ర ప్రభుత్వ ఉద్దేశాన్నేనని సీఎం స్పష్టం చేశారు. 2/3 మెజార్టీ ఉన్నంత మాత్రాన అన్నింటినీ చట్టాలు చేయలేమనీ, కేంద్రంలో మెజార్టీ ఉందని ప్రధానిగా ఉన్న ఎవరైనా తనకు రాజుగా 2/3 మెజార్టీతో చట్టం చేసుకుంటే ఒప్పుకోరు కదా? అని ప్రశ్నించారు. ఏపీలో ప్రతిపక్షానికి కేవలం 11 సీట్లే ఉన్నాయనీ, అలాని ఆ రాష్ట్రానికి నేనే రాజునని చంద్రబాబు నాయుడు చట్టం తీసుకొస్తే ఒప్పుకుంటారా? అని వ్యాఖ్యానించారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీ మనుగడ భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారుతుందనీ, టీడీపీ, చంద్రబాబు నాయుడు పరిస్థితి కూడా అలాగే అవుతుందని వ్యాఖ్యానించారు. ఇందుకు నితీష్ కుమార్, ఏక్నాథ్ షిండే పేర్లను ఉదహరించారు. ప్రస్తుతం కేంద్రంలో బీజేపీకి సీట్లు తక్కువగా ఉన్నాయి కాబట్టి టీడీపీకి ప్రాధాన్యం ఇస్తున్నారనీ, భవిష్యత్తులో బీజేపీకి బలం పెరిగితే ఆ పార్టీని తీసి పక్కనపడేస్తారని పేర్కొన్నారు. లోక్సభ, రాజ్యసభ ఉన్నది చట్టాలు చేయడానికి మాత్రమే వాటిని అమలు చేసేది స్థానికంగా ఉండే రాష్ట్ర ప్రభుత్వాలు, అధికార యంత్రాంగమేనని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# వందేళ్లు జీవించు చిట్టితల్లీ..

## రూ. 16 కోట్ల ఇంజెక్షన్ ఇప్పించి ఆశీర్వదించిన లోకేశ్

**హైదరాబాద్, ఏప్రిల్ 18:** అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ(ఎస్ఎంఏ టైప్-1) వ్యాధితో బాధపడుతున్న కర్నూలుకు చెందిన పునర్విక అనే చిన్నారికి శనివారం వైద్యులు రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్ చేసినట్లు మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఈ మేరకు తాను ఇచ్చిన హామీ నెరవేరిందంటూ 'ఎక్స్'లో ఆయన పోస్టు పెట్టారు.

అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఈ చిన్నారికి ఇంజెక్షన్ కోసం రూ.16 కోట్లు అవసరమైన విషయం తెలిసిందే. దాతలు స్పందించి రూ.10 కోట్లు మేర సమకూర్చగా.. చిన్నారి తల్లిదండ్రులు 'ఎక్స్'లో చేసిన అభ్యర్థనకు స్పందించిన మంత్రి నారా లోకేశ్.. మిగతా రూ.6 కోట్లు సమకూర్చడం తన బాధ్యత అని ఆ కుటుంబానికి ఫిబ్రవరిలో హామీ ఇచ్చారు.

ఈ మేరకు విదేశాల నుంచి జోల్ జెన్ స్మా ఇంజెక్షన్ను లోకేశ్ తెప్పించగా.. ఆయన సమక్షంలోనే హైదరాబాద్లోని రెయిన్ బో ఆసుపత్రిలో వైద్యులు శనివారం పునర్వికకు ఇంజెక్షన్ చేశారు. ఈ నేపథ్యంలో 'నా హామీ నెరవేరింది.

పునర్వికకు ఈ రోజు ఇంజెక్షన్ చేశారు. నూరేళ్లు జీవించు చిట్టి తల్లీ' అని పేర్కొంటూ లోకేశ్ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

# బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయండి

- **కేంద్ర మంత్రి కుమారస్వామికి సీఎం విజ్ఞప్తి**
- **కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ విందుకు హాజరైన రేవంత్**

**హైదరాబాద్, ఏప్రిల్ 18 (మనం బ్యూరో):** బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో ఉక్కు కొరత తగ్గడంతో పాటు పర్యావరణానికి మేలు కలుగుతుందని తెలిపారు. ఈమేరకు సీఎం కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేశారు. తెలంగాణలో పాత వాహనాల స్క్రాప్తో ఉక్కును రీసైక్లింగ్ చేసే పరిశ్రమ ఏర్పాటు చేయాలనీ, అందుబాటులో ఉన్న సాంకేతికత, భారీ పరిశ్రమలు, పారిశ్రామిక ఉత్పత్తికి ఉన్న అనుకూలతల వల్ల దేశ పారిశ్రామిక ఉత్పత్తి లక్ష్యాలకు హైదరాబాద్ కేంద్రంగా నిలుస్తుందని కేంద్ర మంత్రికి వివరించారు. హైదరాబాద్లో హైడ్రోజన్ టెక్నాలజీస్తో గ్రీన్ స్టీల్ క్లస్టర్, ఆటో, రక్షణ రంగాలకు అవసరమైన ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు, ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ఈవీ బ్యాటరీల తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే, మెషీన్ టూల్స్, రోబోటిక్స్ వంటి ఆధునిక పరికరాల తయారీకి ప్రత్యేక పార్క్ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ను 2034 నాటికి కాలుష్యం లేని నగరంగా మార్చే లక్ష్యంతో వాహనాలను ఈవీలుగా మార్చేందుకు సహకరించాలని కోరారు. ఆధునిక పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు నేర్పే జాతీయ స్థాయి సంస్థలను హైదరాబాద్లో ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కుమారస్వామిని కోరారు.



**తెలుగు రాష్ట్రాల ఎంపీలకు కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ విందు**

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఢిల్లీలో తెలుగు రాష్ట్రాల ఎంపీలకు శనివారం అల్పాహార విందు ఇచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు బీజేపీ, టీడీపీ, కాంగ్రెస్ ఎంపీలు ఈ విందుకు హాజరయ్యారు. ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, కిషన్ రెడ్డి, కుమారస్వామి తదితరులు ఈ విందులో పాల్గొన్నారు. అయితే, ఈ విందు సాధారణంగా ఇచ్చేదేననీ, ఇందులో రాజకీయ కోణం ఏమీ లేదని కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ స్పష్టం చేశారు.

# భగభగ మండుతున్న సూర్యుడు

- **కుమురంభీం జిల్లాలో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత**
- **మరో పక్క.. 26 వరకు వర్షాలు కురుస్తయ్**



**హైదరాబాద్, ఏప్రిల్ 18:** ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఉదయం నుంచే భానుడు భగభగమంటున్నాడు. వివిధ పనుల కోసం బయటకు వెళ్లిన ప్రజలు ఎండవేడిమి తట్టుకోలేక ఆపసోపాలు పడుతున్నారు. శనివారం కుమురంభీం జిల్లా కెరమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిజామాబాద్ జిల్లా మెండోరాలో 44.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా ఎండపల్లిలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

రోజు రోజుకూ ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని వాతావరణ శాఖ సూచించింది.

**తెలంగాణలో ఈ నెల 26 వరకు వర్షాలు**

రాష్ట్రంలో ఓ వైపు ఎండల తీవ్రత ఉన్నప్పటికీ మరికొన్ని ప్రాంతాల్లో వర్షసూచన ఉన్నట్లు వాతావరణశాఖ వెల్లడించింది. ఉపరితల అవర్తనం, ద్రోణి, క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో ఈ నెల 26 వరకు పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందన్నారు.

ఇవాళ జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఆదివారం ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు వర్ష సూచన ఉందన్నారు. వర్షం కురిసే జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

# వెనక్కి తగ్గేదే లేదు

(మొదటి పేజీ తరువాయి)

మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం ద్వారా విపక్షాలు చారిత్రక తప్పిదం చేశాయని ప్రధాని అన్నారు. రాజకీయ స్వార్థం కోసమే వారు ఈ బిల్లును వ్యతిరేకించారని, వారి ద్వంద్వ ప్రమాణాలను దేశం మొత్తం గమనిస్తోందని దుయ్యబట్టారు. 'దేశంలోని తల్లులకు, సోదరీమణులకు నేను క్షమాపణలు చెబుతున్నాను. ప్రభుత్వం ఈ బిల్లును ఆమోదింపజేయడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నించింది, కానీ కొందరి రాజకీయ ప్రయోజనాల వల్ల అది సాధ్యపడలేదు' అని మోడీ ఉద్వేగంగా పేర్కొన్నారు. భారతదేశం 'వికసిత్ భారత్'గా మారాలంటే నిర్ణయాధికారంలో మహిళల భాగస్వామ్యం అత్యవసరమని, ఈ లక్ష్యం నెరవేరే వరకు తమ పోరాటం ఆగదని ఆయన చెప్పుకొచ్చారు.మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో వీగిపోవడంపై ప్రధాని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కోట్లాది మంది మహిళల దశాబ్దాల కలను విపక్షాలు తమ స్వార్థ రాజకీయాల కోసం బలిచేశాయని మండిపడ్డారు. 'భారతీయ మహిళల చిరకాల స్వప్నాన్ని సాకారం చేయలేకపోయాను. బిల్లు వీగిపోవడం నన్ను ఎంతో కలిచివేసింది. మహిళలంటే ప్రతిపక్షాలకు ఎంత చులకన భావం ఉందో నేడు దేశం మొత్తం చూసింది' అని మోదీ అన్నారు. బిల్లు ఓడిపోవడాన్ని చూసి విపక్షాలు సంబరాలు చేసుకోవడం అత్యంత దురదృష్టకరమని, ఇది దేశ మహిళలను అవమానించడమేనని ఆయన ధ్వజమెత్తారు.

వారికి దేశ ప్రయోజనాల కంటే రాజకీయ లబ్దే వారికి ముఖ్యమని విమర్శించారు. 'మహిళల కలలను చిదిమేసిన వారికి దేశంలోని నారీశక్తి తగిన శిక్ష వేస్తుంది. ఈ పాపానికి విపక్షాలు మూల్యం చెల్లించుకోక తప్పదు. మహిళలే వారికి బుద్ధి చెప్పాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు. విపక్షాలు స్వార్థ రాజకీయాలతో అడ్డుపడినా, తమ ప్రభుత్వం మాత్రం ఎప్పుడూ దేశ ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని ప్రధాని స్పష్టం చేశారు.

**విపక్షాలపై తీవ్ర విమర్శలు..**

మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న విపక్షాల తీరుపై ప్రధాని నరేంద్ర మోడీ నిప్పులు చెరిగారు. కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఎస్పీ వంటి పార్టీలు మహిళా రిజర్వేషన్ల విషయంలో 'భ్రూణహత్య'కు పాల్పడ్డాయని, అంటే ఆ ఆశయాలను మొగ్గలోనే తుంచేశాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలనే రాజ్యాంగ స్ఫూర్తిని విపక్షాలు అవమానించాయని మోదీ ధ్వజమెత్తారు. దేశ మహిళల హక్కులను కాలరాసేలా వారి ప్రవర్తన ఉందని మండిపడ్డారు.

ప్రతిసారీ మహిళా రిజర్వేషన్లను అడ్డుకోవడం కాంగ్రెస్కు అలవాటుగా మారిందని, మహిళల పట్ల ఆ పార్టీ తన బుద్ధిని మార్చుకోలేదని విమర్శించారు. 'మహిళలకు కొత్త దశ, దిశ చూపించాలన్నదే మా సంకల్పం. 2029 ఎన్నికల నుంచే ఈ రిజర్వేషన్లను అమలు చేయాలని మేము ప్రణాళిక సిద్ధం చేశాం. కానీ విపక్షాలు దాన్ని అడ్డుకున్నాయి' అని మోదీ స్పష్టం చేశారు. ఉత్తర, దక్షిణ, ఈశాన్య ప్రాంతాలనే భేదం లేకుండా దేశవ్యాప్తంగా మహిళలందరికీ మేలు చేయాలనే సంకల్పంతో ఈ బిల్లును తెచ్చినట్లు ఆయన వివరించారు.

# 2023 చట్టాన్ని తక్షణమే అమలుచేయాలె

(మొదటి పేజీ తరువాయి)

రిజర్వేషన్ కు మద్దతిస్తున్నామని.. కానీ దాని ముసుగులో ప్రభుత్వం భారత ఎన్నికల ముఖచిత్రాన్ని మార్చే కుట్రను వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఓబీసీలు, దళితులు, మైనారిటీలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించడం అధికారపక్షానికి ఇష్టం లేదని.. అందుకే కులగణనను పక్కన పెట్టేందుకు ఈ బిల్లుల ద్వారా కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ విషయాన్ని ప్రజల ముందుకు తీసుకువెళ్లడానికి దేశవ్యాప్తంగా మీడియా సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మరోవైపు మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రతిపక్షాలు ఓడించినందుకు నిరసనగా ఢిల్లీలోని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నివాసం వద్ద నిరసన చేపట్టనున్నట్లు బీజేపీ నేతలు పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాలలోని కాంగ్రెస్ నేతల ఇళ్ల ముందు నిరసన చేపట్టాలని దేశవ్యాప్తంగా పార్టీ వర్గాలకు పిలుపునిచ్చారు. విపక్షాలు రిజర్వేషన్లకు మాత్రమే వ్యతిరేకం కాదని.. లోక్సభ, రాష్ట్ర శాసనసభల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు స్థానాలు పెరగడం కూడా వాటికి ఇష్టం లేదని బీజేపీ నేతలు అన్నారు.

# పవన్ కళ్యాణ్‌కు సర్జరీ

(మొదటి పేజీ తరువాయి)

శస్త్రచికిత్స జరిగింది. శుక్రవారం ఉదయం తన అధికారులతో పాలనాపరమైన విషయాలపై చర్చిస్తున్న సందర్భంలో ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కొద్ది నెలలుగా ఆరోగ్యపరంగా ఇబ్బందిపడుతున్నారు. దీంతో ఆయన వ్యక్తిగత వైద్యుల సలహాతో శుక్రవారం నాటి అధికారిక కార్యక్రమాలను రద్దు చేసుకుని ఆసుపత్రికి వెళ్లగా.. అక్కడ వైద్య పరీక్షలతోపాటు ఎం.ఆర్.ఐ. టెస్టులు చేశారు. ఎం.ఆర్.ఐ. రిపోర్టును పరిశీలించిన వైద్యులు శస్త్ర చికిత్స చేయవలసి ఉంటుందని నిర్ణయించి, శస్త్రచికిత్స చేశారు. వారం నుంచి పది రోజులపాటు విశ్రాంతి తర్వాత ఆయన అధికారిక కార్యక్రమాలలో పాల్గొనవచ్చని డాక్టర్లు తెలిపారు. అయితే దీర్ఘకాలం తగిన జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుందని, పూర్తి స్వస్థత చేకూరడానికి ఎక్కువ కాలం పడుతుందని డాక్టర్లు తెలిపారు..' అని జనసేన పార్టీ రాజకీయ కార్యదర్శి పి. హరిప్రసాద్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# మీ కుటిల రాజకీయాలు ఆపండి

- బీజేపీ రాజకీయ స్వార్థానికి మహిళలు బలి..
- డీలిమిటేషన్ అంశాన్ని ముడిపెట్టడంతోనే వీగిపోయింది?
- తెలంగాణ విభజన చట్టం ప్రకారం.. అసెంబ్లీ సీట్ల పెంపు మా హక్కు : కేటీఆర్




హైదరాబాద్, మనం ప్రతినిధి : లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. బీజేపీ పన్నిన కుటిల రాజకీయాల వల్లే దేశంలోని మహిళా లోకానికి దక్కాల్సిన రిజర్వేషన్లు వెంటనే దక్కకుండా పోయాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ సహా దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు ఈ బిల్లుకు ఏకగ్రీవంగా మద్దతు పలికినప్పటికీ, బీజేపీ కావాలనే డీలిమిటేషన్ పేరుతో చిక్కుముళ్లు తెచ్చిపెట్టి బిల్లు విఫలమయ్యేలా చేసిందని ఆరోపించారు. మహిళా సాధికారతపై బీజేపీకి ఉన్న చిత్తశుద్ధి నేటి పరిణామాలతో తేలిపోయిందని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అనవసరంగా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంతో ముడిపెట్టడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ సీట్లతోనే మహిళా రిజర్వేషన్లను అమలు చేసి ఉంటే ఎటువంటి సమస్య వచ్చేది కాదని, కానీ మహిళల రిజర్వేషన్ల అంశాన్ని ముడిపెట్టి దేశ మహిళల భుజాల మీద నుంచి దక్షిణాది రాష్ట్రాల గొంతు కోయాలని బీజేపీ చూసిందని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను, డీలిమిటేషన్ పర్యవసానాలను పట్టించుకోకుండా మొండిగా ముందుకు పోవడంతో ఒక చారిత్రక అవకాశం జారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

### బీజేపీ రాజకీయ స్వార్థానికి మహిళలు బలి

మహిళా రిజర్వేషన్ల పేరుతో బీజేపీ ఆడిన నాటకాన్ని దేశ ప్రజలు కళ్లారా చూశారని కేటీఆర్ అన్నారు. కేవలం ఎన్నికల ప్రయోజనాల కోసం మహిళలను వాడుకుని, ఇప్పుడు వారిని వెన్నుపోటు పొడిచిన పార్టీగా బీజేపీ చరిత్రలో నిలిచిపోతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా బీజేపీ తన నిజాయతీని నిరూపించుకోవాలంటే, డీలిమిటేషన్ నిబంధన లేకుండా కేవలం మహిళా రిజర్వేషన్ల కోసమే ఒక కొత్త బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల నుంచే దాన్ని అమలు చేయాలని అన్నారు. దేశంలోని అనేక పార్టీలు డీలిమిటేషన్ అనే అంశం అత్యంత సంక్లిష్టమైనదని చెప్పాయని తెలిపారు. ప్రస్తుత విధానంలో దక్షిణ భారతదేశానికి పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గడం ప్రమాదకరమని స్పష్టంగా చెప్పిన విషయాన్ని బీజేపీ గుర్తించాలని అన్నారు. ఇప్పటికైనా దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని డీలిమిటేషన్ అంశంపై విస్తృతమైన చర్చ, సంప్రదింపులు చేపట్టాలని సూచించారు. డీలిమిటేషన్ అంశంపై మొండిగా ముందుకుపోవడమే జరిగిన పరిణామాలకు అసలు కారణమని బీజేపీ తెలుసుకోవాలన్నారు.

### పార్లమెంట్‌లో తగ్గిన దక్షిణ భారత ప్రాతినిధ్యం.. : కేటీఆర్

నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు పార్లమెంట్లో దక్షిణ భారతదేశ ప్రాధాన్యాన్ని తగ్గిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ఇప్పటికే 2023లో ఆమోదించిందని, ఆ బిల్లుకు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియతో ముడిపెట్టాల్సిన అవసరమే లేదని ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. నియోజకవర్గాల పునర్విభజనకు 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకున్నా, తాజా జనాభా గణనను ప్రాతిపదికగా తీసుకున్నా దక్షిణ భారతదేశం తీవ్రంగా నష్టపోతుందని కేటీఆర్ అన్నారు. ఈ విషయం కేంద్రంలోని పాలకులకు కూడా బాగా తెలుసని చెప్పారు. రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని తాజా బిల్లు పొందలేదని స్పష్టంగా తెలిసినప్పటికీ, మోదీ ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టిందని విమర్శించారు. మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయాలనుకుంటే ప్రస్తుతం ఉన్న 543 స్థానాలతోనే అమలు చేయవచ్చని చెప్పారు. పార్లమెంటులో దక్షిణ భారతదేశానికి ప్రస్తుతం 24% స్థానాలు ఉన్నాయని, ఆ 24 శాతం స్థానాలు యథాతథంగా కొనసాగేలా చూడాలని అన్నారు. ఒకవేళ దక్షిణ భారత ప్రాధాన్యాన్ని 24 శాతం కంటే తగ్గిస్తే ఈ దేశ నిర్మాణంలో విశేష కృషిచేసిన దక్షిణ భారత ప్రజల నుంచి తీవ్రమైన నిరసనలు, ఆగ్రహం వ్యక్తమవుతాయని కేటీఆర్ హెచ్చరించారు.

# భయంతో రేవంత్ మేడిగడ్డకు పరుగులు పెడ్తుండు?

## మీడియా సమావేశంలో కాంగ్రెస్, బీజేపీపై మండిపడ్డ కేటీఆర్, హరీశ్‌రావు



హైదరాబాద్, మనం ప్రతినిధి : ఇన్ని రోజులు చేసింది చాలు... నాటకాలు అపుండ్రి. ఇక మీ సిల్లీ పాలిటిక్స్ బంజేయుండ్రి. సింహం బయటకు వస్తుందంటే? గుంటనక్కల గుండెల్లో దడ పుడుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. అందుకే కేసీఆర్ జగిత్యాలలో బహిరంగ సభకు వస్తున్నారంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నో కుట్రలకు తెరలేపుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. జగిత్యాల నుంచి బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం.. మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత టి.జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరబోతున్న సందర్భంగా జిల్లాలో పండుగ వాతావరణం కనిపిస్తుందని కేటీఆర్ అన్నారు. ఈ మేరకు ఆ ఇద్దరు నేతలు కలిసి ఈ నెల 20న జగిత్యాలలో జరగనున్న కేసీఆర్' ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను పరిశీలించేందుకు శనివారం ఉదయం హరీశ్‌రావు నివాసం నుంచి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులతో కలిసి జగిత్యాల సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించాక... మాజీ మంత్రి జీవన్ రెడ్డిని కేటీఆర్, హరీశ్ రావులు కలిశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పార్టీ కీలక నాయకులతో సమావేశమై, సభ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు జగిత్యాలలో కేటీఆర్, హరీశ్‌రావులు ఇద్దరూ కలిసి ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ సభ పెడతానంటే అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి చాలా సిల్లీ పాలిటిక్స్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ జగిత్యాల సభకు వస్తున్నారంటే రేవంత్ రెడ్డి మేడిగడ్డకు వెళుతున్నారని అన్నారు. రెండున్నరేళ్లలో మేడిగడ్డ వెళ్లేందుకు ముఖ్యమంత్రికి సమయం లేదా అని ప్రశ్నించారు. ఇక్కడ కేసీఆర్ కీలక బహిరంగ సభ జరుగుతుంటే? కేసీఆర్‌తో పాటు మేడిగడ్డ పర్యటనను సైతం చూపించాలన్న కసి, కోపంతో రగిపోయిన రేవంత్.. కేసీఆర్‌తో పాటు ప్రక్కన తన వాని, అలాగే పత్రికల్లో పతాక శీర్షికన తన వార్త రావాలనే చిల్లర ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. రాష్ట్రంలో రాజకీయ పునారేకీకరణ జరుగుతుందని వెల్లడించారు. జగిత్యాల నుంచి బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం అవుతుందని, జగిత్యాల నుంచి బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని దీమాను వ్యక్తం చేశారు. ఇక, ఇప్పుడు ఉన్నట్టుండి కేసీఆర్ సభ అనగానే కోరుట్ల నుంచి ఎవరూ రాకుండా రోడ్లు తవ్విస్తున్నారని.. సర్కార్ ఎన్ని చిల్లర పనులు చేసిన, గత బహిరంగ సభల్లాగే విజయవంతమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇక, రేవంత్ హైట్ మాత్రమే చిన్నది కాదని మెదడు కూడా చిన్నదేనని ఎద్దేవా చేశారు. ఈనెల 20న కేసీఆర్ సాయంత్రం 5,30 నిముషాలకు చేరుకుంటారని వివరించారు. సుమరు గంట సేపు కేసీఆర్ సభ ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు.

### బీజేపీ..తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది.. ఎంపీ క్షమాపణ చెప్పాలి : హరీశ్‌రావు

బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ మాట్లాడుతూ...బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ ఎంపీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సపోర్టుగా నిలిచారని ఆరోపించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడితే? తెలంగాణలో 8 మంది బీజేపీ, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉన్నా ఏం లాభమని అన్నారు. బీజేపీ ఎంపీ బేషరతుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరాన్ని దెబ్బ తీసిన ఎంపీ విషయంలో బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని వెల్లడించారు. బడేబాయి, చోటే బాయి బంధం మరోసారి బయటపడిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో లేని లోటు స్పష్టంగా కన్పించిందని వెల్లడించారు. తెలంగాణ ఉద్యమం, ప్రజల మీద విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మహిళా బిల్లు విషయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు నాటకామాడుతున్నాయని విమర్శించారు. ఎంపీ తేజస్వి యాదవ్ వ్యాఖ్యలను సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఖండించలేదని,రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రాబోతుందని, దానికి నిదర్శనం బీఆర్ఎస్‌లో జీవన్ రెడ్డి చేరిక అని స్పష్టం చేశారు. రాజకీయల్లో విలువలతో కూడిన రాజకీయం చేసిన వ్యక్తి జీవన్ రెడ్డి అని కొనియాడారు.

# మా రిటైర్డ్ ఉద్యోగుల ఉసురు తగుల్తది?

- రాష్ట్రం విడిపోయిన.. ఉద్యోగుల్లో ఇంకా ఆంధ్రా పెత్తనమే : మాజీ చైర్మన్ దేవీ ప్రసాద్

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులను ఇబ్బందులపాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మా ఉసురు ఖచ్చితంగా తగులుతుందని ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ నేత, కార్పొరేషన్ మాజీ చైర్మన్ జి. దేవీ ప్రసాద్ విమర్శించారు. ఈ మేరకు శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మీడియా మాట్లాడుతూ... ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని దుయ్యబట్టారు. వారు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఉద్యోగులకు 5 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సీపీఎస్ రద్దుపై ఇప్పటి వరకు కమిటీ వేయలేదని విమర్శించారు. ఉద్యోగులకు డిజిటల్ హెల్త్ కార్డులు ఏమయ్యాయని ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులు 86 మంది చనిపోయారని,రిటైర్డ్ ఉద్యోగులకు చావు పరిష్కారం అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ. 14 వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుకు హైకోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చనిపోయిన రిటైర్డ్ ఉద్యోగులకు కోటి 20 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం విడిపోయిన కూడా ఉద్యోగుల్లో ఇంకా ఆంధ్రా పెత్తనం నడుస్తోందని, ఎక్సైజ్ శాఖలో కమీషనర్ వేధింపులు తట్టుకోలేక తెలంగాణ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం చేశారని వెల్లడించారు. ఇదిలాఉంటే, చంద్రబాబు, రేవంత్ రెడ్డి మధ్య సోదర బంధం ఉందని, బీజేపీ రాజకీయంతోనే మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లు ఆగిపోయింది డీలిమిటేషన్, మహిళా బిల్లును లింక్ చేశారని ఆరోపించారు. టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా మహిళా బిల్లును కాంగ్రెస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల అమలు కావడం బీజేపీకి ఇష్టం లేదని అన్నారు. ఉపాధ్యాయ సంఘం మాజీ నాయకులు భుజంగ రావు తదితరులు మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

# ఐపీఎస్‌ల బదిలీలు

హైదరాబాద్, ఏప్రిల్ 18 : పరిపాలనా సౌలభ్యం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 9 మంది ఐపీఎస్ అధికారులకు కొత్త పోస్టింగ్లు కల్పిస్తూ, పాలనాపరమైన అవసరాల దృష్ట్యా ఈ మార్పులు చేసినట్లుగా పేర్కొన్నారు. ప్రధానంగా ఏఎస్పీ స్థాయి అధికారులను వివిధ జిల్లాల్లో అదనపు ఎస్పీలుగా నియమించడం గమనార్హం.

ఈ బదిలీల్లో భాగంగా, అసిఫాబాద్ ఏఎస్పీగా ఉన్న ఎస్.చిత్తరంజన్ను అదే జిల్లాకు అదనపు ఎస్పీ (అడ్మిన్)గా నియమించారు. కామారెడ్డి ఏఎస్పీగా ఉన్న బొక్క చైతన్య రెడ్డిని సంగారెడ్డి అదనపు ఎస్పీగా, జనగామ ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న పందేరే చేతన్ నితిన్ను జగిత్యాల అదనపు ఎస్పీగా బదిలీ చేశారు. అలాగే భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ను మెదక్ అదనపు ఎస్పీగా, వరంగల్ ఏఎస్పీగా ఉన్న నగ్రాలె శుభమ్ ప్రకాష్ను నిజామాబాద్ అదనపు డీసీపీగా ప్రభుత్వం నియమించింది.

అదేవిధంగా భైంసా అదనపు ఎస్పీ రాజేష్ మీనాను వనపర్తి అదనపు ఎస్పీగా, ఆదిలాబాద్ అదనపు ఎస్పీగా ఉన్న పి.మౌనికను అదే జిల్లాకు అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బదిలీ చేశారు. నిర్మల్ ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న పాతిపాక సాయికిరణ్ను భైంసా ఎస్డీపీఓగా, వేములవాడ ఏఎస్పీగా ఉన్న రుత్విక్ సాయి కొట్టేను ఉట్నూరు ఎస్డీపీఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

బదిలీ అయిన అధికారులందరూ తక్షణమే తమ కొత్త బాధ్యతలను స్వీకరించాలని సీఎస్ ఆదేశించారు.

# మలిధశ ఉద్యమకారులను అదుకో(ండి)రా?

ఎన్నికలకు ముందు మీరిచ్చిన హామీలు, మేనిఫెస్టకు విలువ లేదా?

ఉద్యమంలో సర్వం కొల్పోయి త్యాగాలు చేసినవారిని అదుకోవాలని డిమాండ్

తెలంగాణ ఉద్యమకారుల సదస్సు విజయవంతం

హైదరాబాద్, మనం ప్రతినిధి : ఉవ్వేతున ఎగసిపడుతున్న మలిధశ ఉద్యమంలో అన్నింటిని వదిలి త్యాగాలు చేసిన తెలంగాణ ఉద్యమకారులు పోరాటం మరువలేనిదని పార్టీలకతీతంగా పలు పార్టీల నేతలు కోనియాడారు. ఈ మేరకు తెలంగాణ ఉద్యమకారులు ఫోరమ్ ఆధ్వర్యంలో శనివారంనాడు తార్నాక మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో మలిధశ తెలంగాణ ఉద్యమ కారుల సదస్సును ఘనంగా నిర్వహి ంచారు. ఈ సమావేశానికి హజరైన ఉద్యమకారులు.. తెలంగాణ ఉద్యమకారులకి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పూర్తీ విధి విధానాలతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. మెయిన్ రోడ్డు నుండి వందలాది ఉద్యమకారులంతా జై తెలంగాణ, అమరవీరులకు జోహర్లు, అమరవీరుల అశయాలను సాదిద్దాం, విభజన హామీలను సాదిద్దాం అంటూ బోనాలతో బయలుదేరి... సభ వేధిక వద్దకు ర్యాలీగా వెళ్లారు. మన నీళ్లు, నిధులు, నియామకాలు మనకే అంటూ నినాదాలో సభ ప్రాంగణం పెద్ద శబ్ధంతో మార్మోగింది. తెలంగాణ ఉద్యమం తరహలో పెద్ద ఎత్తున సాంస్కృతిక సంప్రాదాయాలతో కూడిన కార్యక్రమాన్ని నిర్వహి ంచడం ఎంతో అనందంగా ఉందని, కమిటి చైర్మన్ డా. చీమ శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో వేలాది ఉద్యమకారులతో సభ ప్రాంగణం దద్దరిల్లేలా భారీ ఏర్పాట్లతో ఈ కార్యక్రమాన్ని నిర్వహి ంచినట్లు కమిటి చైర్మన్ డా. చీమ శ్రీనివాస్ స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ చీమ శ్రీనివాస్‌తో పాటు పలువురు ఉద్యమకారులు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 2 సంవత్సరాలు పూర్తైనప్పటికి ఉద్యమ కారులకిచ్చిన హామీలు, అమలు కోసం కమిటి ఏర్పాటు చేయలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యమంలో అన్ని వదులుకొని నష్టపోయిన వందలాది ఉద్యమకారులు నేటికి తమ భవిష్యత్ దిగులుతో ఆందోళన చెందుతున్నారన్నారు. అయితే, గత నెలలోనే కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం అనేకసార్లు ప్రకటించినప్పటికి... నేటి వరకు ప్రకటన రాలేదు? ఆచరణకు నోచుకోలేదన్నారు. ఎన్నికలకు ముందు హామీలిచ్చిన ఈ రేవంత్ ప్రభుత్వం వెంటనే కమిటీ వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎ. దయానంద్, జగన్ యాదవ్, నాగజ్యోతి, మంజూష, దుగ్గని శ్యామల, శ్యామల, జోగు అంజయ్య, భాను ప్రకాష్, భూపాల్, శివకుమార్ నేత, కొండా స్వామి, చంద్ర శేఖర్, రాంబాబు,నరసింహ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# నిశ్శబ్ధంగా విస్తరిస్తున్న లివర్ వ్యాధులు

## ప్రతి ముగ్గురిలో ఒకరికి ప్రమాదం

### అప్రమత్తంగా ఉండాలంటూ వరల్డ్ లివర్ డే సందర్భంగా హెచ్చరించిన మెడికవర్ హాస్పిటల్స్ నిపుణులు




హైదరాబాద్, ఏప్రిల్ 18 : వరల్ లివర్ డే (ఏప్రిల్ 19) సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ దేశంలో వేగంగా పెరుగుతున్న లివర్ వ్యాధులపై ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రజలు వెంటనే అప్రమత్తంగా ఉండాలని సూచించింది. డా. పవన్ అడ్డాల, చీఫ్ కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ మరియు ప్రోగ్రామ్ హెడ్ - లివర్ ప్యాంక్రియాస్ ట్రాన్స్ప్లాంట్, మెడికవర్ హాస్పిటల్స్, సికింద్రాబాద్, మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశంలో ప్రతి 3 మందిలో ఒకరికి ఫ్యాటీ లివర్ సమస్య ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా యువతలో ఈ సమస్య పెరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది, అని తెలిపారు. ఆయన వివరించిన ప్రకారం, నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ ప్రస్తుతం అత్యంత సాధారణ లివర్ వ్యాధిగా మారింది. అధికంగా ప్రాసెస్డ్ ఫుడ్ తీసుకోవడం, వ్యాయామం లేకపోవడం, ఊబకాయం, మధుమేహం, మద్యం సేవించడం వంటి కారణాలు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. అధిక ప్రమాద గుంపుల్లో ఈ వ్యాధి ప్రబలత 50 శాతం వరకు నమోదవుతోంది.

లివర్ వ్యాధులు ప్రారంభ దశలో స్పష్టమైన లక్షణాలు కనిపించవు. చాలా సందర్భాల్లో వ్యాధి తీవ్రమైన దశకు చేరుకున్న తర్వాత మాత్రమే గుర్తించబడుతుంది. నిర్లక్ష్యం చేస్తే ఇది సిరోసిస్, లివర్ ఫెయిల్యూర్ లేదా లివర్ క్యాన్సర్కు దారితీసే ప్రమాదం ఉంది, అని ఆయన హెచ్చరించారు. అదేవిధంగా, 70 శాతం కంటే ఎక్కువ లివర్ వ్యాధులను నివారించడం సాధ్యమే అని పేర్కొంటూ, సమతుల్య ఆహారం తీసుకోవడం, రోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయడం, బరువు నియంత్రణలో ఉంచుకోవడం, మద్యం పూర్తిగా నివారించడం, అవసరం లేని మందులు వాడకపోవడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రమాదాన్ని ముందుగానే గుర్తించేందుకు క్రమం తప్పకుండా హెల్త్ చెకప్లు, లివర్ ఫంక్షన్ టెస్టులు చేయించుకోవడం అవసరమని ఆయన అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో లివర్ ట్రాన్స్ప్లాంట్ ప్రాణాలను రక్షించే మార్గంగా నిలుస్తుంది. అయితే, నివారణే ఉత్తమ చికిత్స, అని డా. పవన్ అడ్డాల పేర్కొన్నారు.

వరల్ లివర్ డే సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ లివర్ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని మెడికవర్ హాస్పిటల్స్ విజ్ఞప్తి చేసింది.

# మలిధశ ఉద్యమకారులను అదుకో(ండి)రా?

ఎన్నికలకు ముందు మీరిచ్చిన హామీలు, మేనిఫెస్టకు విలువ లేదా?

ఉద్యమంలో సర్వం కొల్పోయి త్యాగాలు చేసినవారిని అదుకోవాలని డిమాండ్

తెలంగాణ ఉద్యమకారుల సదస్సు విజయవంతం

హైదరాబాద్, మనం ప్రతినిధి : ఉవ్వేతున ఎగసిపడుతున్న మలిధశ ఉద్యమంలో అన్నింటిని వదిలి త్యాగాలు చేసిన తెలంగాణ ఉద్యమకారులు పోరాటం మరువలేనిదని పార్టీలకతీతంగా పలు పార్టీల నేతలు కోనియాడారు. ఈ మేరకు తెలంగాణ ఉద్యమకారులు ఫోరమ్ ఆధ్వర్యంలో శనివారంనాడు తార్నాక మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో మలిధశ తెలంగాణ ఉద్యమ కారుల సదస్సును ఘనంగా నిర్వహి ంచారు. ఈ సమావేశానికి హజరైన ఉద్యమకారులు.. తెలంగాణ ఉద్యమకారులకి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పూర్తీ విధి విధానాలతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. మెయిన్ రోడ్డు నుండి వందలాది ఉద్యమకారులంతా జై తెలంగాణ, అమరవీరులకు జోహర్లు, అమరవీరుల అశయాలను సాదిద్దాం, విభజన హామీలను సాదిద్దాం అంటూ బోనాలతో బయలుదేరి... సభ వేధిక వద్దకు ర్యాలీగా వెళ్లారు. మన నీళ్లు, నిధులు, నియామకాలు మనకే అంటూ నినాదాలో సభ ప్రాంగణం పెద్ద శబ్ధంతో మార్మోగింది. తెలంగాణ ఉద్యమం తరహలో పెద్ద ఎత్తున సాంస్కృతిక సంప్రాదాయాలతో కూడిన కార్యక్రమాన్ని నిర్వహి ంచడం ఎంతో అనందంగా ఉందని, కమిటి చైర్మన్ డా. చీమ శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో వేలాది ఉద్యమకారులతో సభ ప్రాంగణం దద్దరిల్లేలా భారీ ఏర్పాట్లతో ఈ కార్యక్రమాన్ని నిర్వహి ంచినట్లు కమిటి చైర్మన్ డా. చీమ శ్రీనివాస్ స్పష్టం చేశారు.





ఈ సందర్భంగా డాక్టర్ చీమ శ్రీనివాస్‌తో పాటు పలువురు ఉద్యమకారులు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 2 సంవత్సరాలు పూర్తైనప్పటికి ఉద్యమ కారులకిచ్చిన హామీలు, అమలు కోసం కమిటి ఏర్పాటు చేయలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యమంలో అన్ని వదులుకొని నష్టపోయిన వందలాది ఉద్యమకారులు నేటికి తమ భవిష్యత్ దిగులుతో ఆందోళన చెందుతున్నారన్నారు. అయితే, గత నెలలోనే కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం అనేకసార్లు ప్రకటించినప్పటికి... నేటి వరకు ప్రకటన రాలేదు? ఆచరణకు నోచుకోలేదన్నారు. ఎన్నికలకు ముందు హామీలిచ్చిన ఈ రేవంత్ ప్రభుత్వం వెంటనే కమిటీ వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎ. దయానంద్, జగన్ యాదవ్, నాగజ్యోతి, మంజూష, దుగ్గని శ్యామల, శ్యామల, జోగు అంజయ్య, భాను ప్రకాష్, భూపాల్, శివకుమార్ నేత, కొండా స్వామి, చంద్ర శేఖర్, రాంబాబు,నరసింహ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.




# పాత పెన్షన్ కావాలే.. పీఆర్‌సీ అమలు చేయాలి?

- అంబేద్కర్ వర్శిటీలో ఉద్యోగుల నిరసన

హైదరాబాద్, మనం ప్రతినిధి : పీఆర్‌సీ పాత పెన్షన్ విధానాన్ని తక్షనమే అమలు చేయాలని, ఉద్యోగుల హెల్త్ కార్డులు, అట్లాగే పెండింగ్‌లో ఉన్న 5 డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ విశ్వవిద్యాలయ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలంటూ కోరతూ తెలంగాణ విశ్వవిద్యాలయాల బోధనేతర ఉద్యోగుల సంఘం (తుంటీయ), తెలంగాణ ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాల సభ్యులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో పరిపాలన భవనం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి పీఆర్‌సీ వెంటనే అమలు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని (ఓపిఎస్.) ప్రవేశ పెట్టాలని, ఉద్యోగులు వారి కుటుంభ సభ్యులకు క్యాష్ లెస్ హెల్త్ కార్డు జారీ చేయాలని, పెండింగ్లో ఉన్న ఐదు డీఏలు వెంటనే విడుదల చేయాలంటూ ఉద్యోగులు నినాదాలు చేశారు. ఈ సమావేశంలో విశ్వవిద్యాలయ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు కాంతం ప్రేమ్ కుమార్, సభ్యులు విశ్వనాథ్, మియాజాని, పాండు, అశోక్, భరత్ రెడ్డి, డా.యకేష్ దైడా, సుహాసిని, భూ లక్ష్మి, నాగ లతా, తిరుపతమ్మ, జ్యోతిశ్రీ, అన్ని ఉద్యోగుల సంఘాల నాయకులు ఉద్యోగులు నిరసనలో పాల్గొన్నారు.

## నెత్తుటి సాక్షం(ఇంద్రవెల్లి)

స్తూపమంటే
సిమెంటు ఇటుకలు కలిపి పేర్చిన
ఎర్రటి ఎత్తు కాదు
ఏడాది కొకసారి చేసే
పూల దండ తంతు కాదు.

అక్కడొక సారి నిల్చొని అడవికేసి చూడు
నేల పొరల్లో ఉద్యమ తల్లివేర్లు
నీ కాళ్ళకు చుట్టుకుంటయి
అప్పటి నెత్తుటి ఆనవాళ్ళు
అరికాల్లకు ఉత్తేజాన్నిస్తయి
రాలి పడ్డ తలకాయలు
మట్టిని పెకిలిస్తున్నట్లనిపిస్తది

అక్కడ కొంచెం సేపు కండ్లు మూసుకొని
మూగబోయిన నిశబ్దంలా నిలబడి చూడు
మెదడు పొరల్లోంచి
రాలిపడ్డ మొండెముల మూల్గులు వినిపిస్తయి

అడవిని నమ్ముకున్నోల్ల
అడవై బతుకు తున్నోల్ల
నోటికాడి అన్నం ముద్దను
చేతిలోని నీళ్ళ చెంబును
ఇసిరి కొట్టిన హుకుంజోలి కుప్పబోయనీకి
ఒక్కొక్కరు బారులు బారులుగా
రేలపూత గుత్తులుగా
మోదుగు మొగ్గలుగా
దారులన్నీ ఈనినట్టు
ఒకటై గుమిగూడిన నేల అది

ఉక్కు పాదాలు ఎక్కుపెట్టిన
దోపిడి ఫిరంగులు ఇకనుంచి
కనబడవని వినబడవని
దొరల దారులు మూత పడతాయని
హెచ్చరించిన సాక్షమది.
అడవి బిడ్డలను నేల కూల్చిన
దౌర్జన్యాౌ ఇక సాగదని
తుడుం మోగించిన సమయమది

తోడేళ్ళ తేనె చూపులు నమ్మి
ప్రాణాలు చేతిలో పెట్టిన
ఆదిమ తల్లుల మసిబారని త్యాగమది

ఇక్కడ ఏ చెట్టు నైనా ఊపి చూడు
కాయలు పండ్లకు బదులు
అప్పటిరాగోలగాయాలపాటలేవినబడతయి
ఇక్కడి సెలయెల్లని
నీ ముని వేళ్ళతో ముచ్చటించి చూడు
రాలిపోయిన ఎర్రని చిరునవ్వు లే
పలుకరిస్తాయి

ఇక్కడొక సారి
అప్పటి వేడి గాలిని యాది చేసుకో
ఇంద్రవెల్లి పీడకల మనసును కల్లోలంచేస్తది
మనిషిగా మళ్ళీ ఒక సారి ఆలోచించి చూడు
తప్పొప్పుల తరజులో
నీ మనస్సాక్షి ఎక్స్ రే
ఏమి చూపుతుందో

- డా. ఉదారి నారాయణ
9441413666

# లాలించే చేతులు పాలించలేవా..?!



1990 లోనే తెరపైకి వచ్చిన మహిళా బిల్లుకు చిక్కులన్నీ విడిపోయి కదలిక వచ్చింది అనుకున్నారంతా. చట్టం తెస్తూ పీట ముడులు వేసి, కర్ర విరగకూడదు, పాము చావకూడదు అన్న చందంగా వ్యవహరించి పాలకుల నైజం బయట పెట్టుకున్నారు.

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కోసం దశాబ్దాలుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. 2008లో 108వ సవరణ బిల్లు ఆమోదం పొందినా లోకసభలో వీగిపోయింది. చివరకు 2023లో చట్టంగా మారినప్పటికీ, అమలు నిబంధనలపై రాజకీయ చర్చ జరుగుతూనే ఉంది. 2026 ఏప్రిల్ 17న లోకసభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ (సవరణ 131) బిల్లు-2026 ఓటింగ్‌లో వీగిపోయింది. బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, ప్రతికూలంగా 230 ఓట్లు వచ్చాయి. అంటే, అంతా.. షరా మామూలే .. ఎప్పటిలానే .. అప్పటి నుండి ఇప్పటి వరకూ అన్నీ అడ్డంకులే .. అవరోధాలే .. దాదాపు అన్ని పార్టీలు పార్లమెంటు లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ను కేటాయిస్తామని గొంతు చించుకు అరుస్తున్నా మహిళా రిజర్వేషన్ చట్టం, 2023 నారీ శక్తి వందన్ పేరుతో ఆమోదం పొందినప్పటికీ అమలుకు నోచు కోవడం లేదు. ఓటర్లలో సగంగా ఉన్న మహిళ మరి ఆ ఓట్లు ఎందుకు పొందడం లేదు? మహిళా ఓట్లతో అందలం ఎక్కే పెద్ద మనుషులు, రాజకీయ పార్టీలు మహిళలను ఎందుకు విస్మరి స్తున్నారు? ఎన్నికల్లో మహిళా పార్లమెంటు సభ్యుల సంఖ్య పెరగడం లేదు ఎందుకని?

ఒకప్పుడు వంద రోజుల్లో మహిళా బిల్లును సాధిస్తామని చెప్పిన రాష్ట్రపతి వ్యాఖ్యలను ఖండించిన శరద్ యాదవ్, ఆ బిల్లును గనుక ఆమోదిస్తే తాను అక్కడే విషం తాగుతానని బెదిరించాడు. విషం వెళ్ళగక్కాడు. అందరినీ నివ్వెర పరిచాడు. మహిళా బిల్లు గాని ఆమోదం పొందితే దేశంలో అంతర్యుద్ధం చెలరేగుతుందని ఆర్జేడి అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్, సమాజ్ వాది పార్టీ అధినేత ములాయం సింగ్ హెచ్చరించారు. మహిళలు రాజకీయాల్లోకి రావడం పట్ల పురుషులు ఎంత వ్యతిరేకతతో ఉన్నారో అర్థం అవుతోంది.

మహాభారత కాలంలోకి వెళ్తే ఆనాటి రాజుల భార్యలకు యుద్ధ విద్యల గురించి, ధర్మా ధర్మాల గురించి అవగాహన ఉన్నట్లు తెలుస్తుంది. ఝాన్సీ రాణి, రుద్రమదేవి గురించీ మనం చదువుకున్నాం. వారి ధైర్య సాహసాల్ని, యుద్ధ నీతిని, పరిపాలనా దక్షతనీ ఇప్పటికీ కీర్తిస్తూనే ఉన్నాం. మరి ఇప్పుడు, మనముందున్న మహిళల శక్తిని గుర్తించలేని గుడ్డి వాళ్ళు ఎందుకయ్యారు? ఆ బిల్లు ఆమోదం పొందకుండా ఉండడానికి రకరకాల ప్రయ త్నాలు, కుయుక్తులు .. కుతంత్రాలు .. కాకమ్మ కథలూ ..

1994లో మొదటిసారిగా బీజేపీ మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని తీర్మానాన్ని చేసింది. 1996, 1998,1999లలో అప్పటి ప్రభుత్వాలు మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టడానికి అనేకసార్లు ప్రయత్నిం చినప్పటికీ యాదవ త్రయంతో పాటు, పాశ్వాన్ కలవడం వల్ల చట్టరూపం తీసుకోలేకపోయింది.

2000లో అప్పటి కేంద్ర మంత్రి శివరాజ్‌పాటిల్ నాయకత్వంలో మహిళా రిజర్వేషన్ల గురించి అధ్యయనం చేయడానికి కేబినెట్ కమిటీ ఏర్పాటయింది. ఈ కమిటీ లోక్‌సభ సభ్యుల సంఖ్యను 33 శాతం పెంచి, అందులో 33 శాతం స్థానాలను మహిళలకు రిజర్వేషన్ చేయవచ్చని సూచించింది. ఆ సూచన ఆమోదించినట్టయితే, లోక్‌సభ సభ్యుల సంఖ్య 830



వరకు పెరిగి,మహిళలకు 276 స్థానాలు దక్కేవి. రాజకీయాలలో మహిళలకు సమానత్వాన్ని సాధించడం కోసం యూపీఏ ప్రభుత్వం 2008లో 108వ రాజ్యాంగ సవరణ చేసి మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పటికీ, ప్రతిపక్ష పార్టీ బిజెపి సహకరిస్తున్నప్పటికీ పార్లమెంటు ఆమోదించక పోవడానికి అనేక రాజకీయ కోణాలు, కారణాలున్నాయి.

2010లోనే రాజ్యసభలో ఆమోదం పొందిన మహిళా బిల్లు లోక్‌సభలో ఎన్ని సార్లు ప్రవేశపెట్టినా ఆమోదం పొందలేక పోవడానికి కారణం ఎవరు? పితృస్వామిక భావజాలం నరనరాల్లో జీర్ణించుకుపోయిన కరడుకట్టిన దురహంకారులు కాదూ?! ఆకాశంలో సగం - అవనిలో సగం ఉన్న మహిళల ఓట్లు కావాలి. వాటితో గెలిచి అందలమెక్కాలి. కానీ ఆ మహిళలకే చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలంటే మాత్రం మనసు ఒప్పుకోదు. మహిళల ప్రాతినిధ్యం చట్టసభల్లో అలా ఎందుకు ఉండడం లేదు? రాజ్యసభలో 13%, లోక్‌సభలో 543కి గాను 74 మంది (13.6%), మంత్రుల స్థాయిలో 72 మందిలో 7గురు మాత్రమే మహిళా మంత్రులు 9.72 శాతం మాత్రమే ఉందంటే అందుకు కారణం ఎవరు? చట్టసభలలో మహిళలకు సమ భాగస్వామ్యం లేకపోవడం వల్లే కదా!?.

పంచాయతీరాజ్ వ్యవస్థలో 33 శాతం రిజర్వేషన్ వల్ల కింది స్థాయిలో మహిళల భాగస్వామ్యం పెరిగింది. ఆమె పేరుతో అతను అధికారం చెలాయించే సంఘటనలు ఉన్నప్పటికీ రాజకీయాల్లో పెరిగిన ఆమె చొరవ, అవగాహన, తన కర్తవ్యం తను సక్రమంగా నిర్వహించాలన్న తపన ఉన్న మహిళలకి కొదువలేదు. అసెంబ్లీ, పార్లమెంటుల్లో తన గొంతు గట్టిగా వినిపించి, సమస్యలను విశ్లేషించి, చట్టాల రూపకల్పనలో క్రియాశీల పాత్ర పోషించగల సత్తా ఉన్న మహిళలకు కొదువలేదు. అయినా చట్టసభలలో ఆశించిన స్థాయిలో మహిళల ప్రాతినిధ్యం పెరగడం లేదు. ప్రస్తుతం ఉన్న వారిలోనూ వారసత్వంతో వచ్చినవారే ఎక్కువ.

సమాజంలో, రాజకీయాల్లో ఉండే మహిళల పట్ల ఉన్న చులకన భావం, చిన్న చూపు కూడా మహిళలు రాజకీయాలకు దూరంగా ఉండడానికి ఒక కారణం. రాజకీయాల్లో ఉన్న మహిళ ఇంటి బయటి ప్రపంచంలోకి, జనంలోకి వెళ్ళాల్సి ఉంటుంది. పురుషుడిలో ఉండే అభద్రతా భావం, తను స్త్రీని చూసే దృష్టి కోణం వల్ల తన కుటుంబంలోని మహిళ నాలుగు గోడలు దాటి బయటికి రావడానికి ఇష్టపడడు.

నేడు అన్ని రంగాల్లోను డబ్బు చక్రం తిప్పుతున్నట్లే రాజకీ యాల్లోనూ డబ్బు పాత్ర ప్రధానమైంది. నేడు రాజకీయాల్లోకి రావాలంటే వారి ఆర్థిక పరిస్థితి ప్రధాన అర్హత అయింది. మరి ఆస్తిపాస్తులున్న మహిళలు ఎందరు? ఒకవేళ ఆమె పేరున ఆస్తి ఉన్నా దానిపై అధికారం ఆమెకు ఉందా? మహిళలు రాజకీయా ల్లోకి రావాలని పై పై మాటలు అంటారు. హృదయ లోతుల్లోంచి ఆ మాటలు రావు. కారణం ఆమె కోసం డబ్బు ఖర్చు చెయ్యాలి కదా..? మహిళలు ముఠాలు కట్టి రాజకీయాలు చేయరు ముక్కుసూటిగా పని చేసుకు పోతారు. గుండాయిజం చేయరు. అది కూడా ఆమెకు అనర్హతే.

ఆడవాళ్ళు రాజకీయాల్లోకి వస్తే తమ సీట్లు గల్లంతు అవుతాయన్న భయం. అమెది పై చేయి అవుతుందన్న భావన. తమపై ఆమె అధికారం చెలాయిండం భరించలేని తనం. అందుకే మహిళా బిల్లుతో పాటు నియోజకవర్గాల పునర్విభజన (జనాభా ప్రాతిపదికన ) కూడా 131 సవరణలో జతచేశారు. తద్వారా పురుషులకు సీట్లు పెంచుకోవాలనే ప్రయత్నం. అయితే, ఇక్కడ దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలు దెబ్బతీసే పునర్విభజనను ప్రతిపక్షాలు ఒప్పుకోలేదు. ఆ విషయం అధికార పక్షానికి ముందే తెలుసు. అయినా బిల్లు ప్రవేశపెట్టింది.

ఏ రాజకీయ పార్టీకి నిబద్ధత లేకపోవడం. తమ ఎన్నికల మేనిఫెస్టోలో మహిళలకు 33 శాతం రిజర్వ్ చేస్తామని చెప్పిన ప్పటికీ ఆ దిశగా అడుగు వేయకపోవడం. ప్రత్యక్ష, పరోక్ష ఎన్నిక ల్లోనే కాదు పార్టీ పదవుల్లోనూ మహిళలకు సరి అయిన ప్రాతి నిధ్యం ఇవ్వక పోవడం. పొలిట్ బ్యూరోలోనూ, కోర్ కమిటీ ల్లోనూ మహిళల స్థానం ఎంత? కీలక బాధ్యత వహించేది ఎంత మంది? సమన్యాయం, సామాజిక న్యాయం అన్న పదాలు చెప్పు కోవడానికే కానీ ఆచరణకు కాకపోవడం.

చరిత్రలోకి వెళ్తే ఎంతో మంది మహిళలు దేశ రాజకీయాల్లో తనదైన గుర్తింపు తెచ్చుకున్నారు. ముద్ర వేసుకున్నారు, రాణించారు. లాలించే చేతులు పాలించగలవని నిరుపించు కున్నారు. ఉదాహరణకి ఇందిరాగాంధీని తీసుకుందాం. బంగ్లాదేశ్ విమోచన యుద్ధ సమయంలో ఆమె వ్యవహరించిన తీరును, ధైర్య సాహసాలను ఆనాటి ప్రతిపక్ష నేత అటల్ బిహారీ వాజ్‌పేయి మెచ్చుకున్నారంటే అది పాలకురాలుగా ఆమె దక్షతకు నిదర్శనం.

ముఖ్యమంత్రులుగా జయలలిత, మమత బెనర్జీ, మాయా వతి, రబ్రీదేవి గుర్తింపు తెచ్చుకున్నారు. వారు ముఖ్యమంత్రులు కావడానికి కారణాలేమైనా ఇక్కడ మనం చూడాల్సింది వారి పాలన చాతుర్యం , దక్షత గురించి.

చారిత్రాత్మకంగా చూస్తే చట్టసభల్లో స్త్రీల ప్రాతినిధ్యం కల్పించడానికి రిజర్వేషన్లు అవసరమని రాజ్యాంగ నిర్మాణ సమయంలోనే ప్రస్తావనకు వచ్చింది. ఆ సందర్భంలో కొందరు మహిళా ప్రతినిధులు రిజర్వేషన్ పద్ధతిని వ్యతిరేకించారు. 1974లో కేంద్ర ప్రభుత్వం దేశంలో మహిళల స్థితిగతులను తెలుసుకోవడానికి నియమించిన కమిటీ (ది కమిటీ ఆన్ ది స్టేటస్ ఆఫ్ ఉమెన్ ఇన్ ఇండియా) తన రిపోర్టులో స్థానిక స్వపరిపాలనా సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని, అన్ని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా 15 శాతం మహిళలకు కేటాయించాలని సూచించింది. ఈ నేపథ్యంలో 1992లో పార్ల మెంట్ 73,74 రాజ్యాంగ సవరణలు ఆమోదించింది. స్థానిక స్వపరిపాలనా సంస్థల్లో మహిళలకు 33.3 శాతం రిజర్వేషన్లు కల్పించింది. రాజకీయాలు, ప్రజాస్వామ్యం మంచిగా ముందుకు సాగాలంటే రిజర్వేషన్ అవసరం. మహిళలను దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయడం అవసరం.

దేశంలోనే స్థానిక సంస్థల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ మొదట అందించిన ఘనత ఎన్‌టి రామారావుదే. ఈ రిజర్వేషన్ అమల్లోకి వచ్చిన తర్వాత రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం గణనీయంగా పెరిగింది. స్థానిక సంస్థల్లో మహిళకు 50 శాతం కేటాయించడాన్ని స్వాగతించాల్సిన విషయమని మన దేశంలో పర్యటించిన అమెరికా ప్రతినిధి రిట్టా లూయిస్ వాషింగ్టన్‌లో ఓ పత్రికా సమావేశంలో అన్నారు.

నిరంతరం సంఘర్షణలతో సతమతమయ్యే చిన్న దేశం, పేద దేశం రువాండా. అక్కడ చట్టసభల్లో 50 శాతం మహిళలకి కేటాయించారు. మన కంటే చాలా చిన్న దేశాలు వెనుకబడిన దేశాలైన అంగోలా, మొజాంబిక్, దక్షిణాఫ్రికా, టాంజానియా, నమీబియా, బంగ్లాదేశ్, అర్జంటినా, హైతి వంటి దేశాలలోనూ మహిళలు రాజకీయంగా విశేషంగా రాణిస్తున్నారు. దేశాధి నేతలుగా ఎదుగుతున్నారు. యూరోపియన్ దేశాలకు ఏ మాత్రం తీసిపోకుండా మహిళల్లో రాజకీయ చైతన్యం కనిపిస్తోందని ఐక్య రాజ్య సమితి మహిళా సంస్థ నిర్వహించిన ఓ సర్వేలో తెలిపింది.

యూఎన్‌డీపీ వారి మానవాభివృద్ధి సూచికలో మంచి స్థానాలలో ఉన్న దేశాలు కూడా పార్లమెంటులో మహిళలకు పెద్దపీట వేశాయి. ఉదాహరణకు నార్వే42%, ఆస్ట్రేలియా-46%, ఐస్‌ల్యాండ్ -46%, స్వీడన్-45%, నెదర్లాండ్స్ -43% పార్ల మెంటు స్థానాలలో మహిళలే ఉన్నారు.

రాజకీయాల్లో ఆసక్తి ఉన్న మహిళల కోసం కర్ణాటకలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఒక వినూత్న కార్యక్రమం నిర్వహిం చింది. ఈ కార్యక్రమం ద్వారా మహిళల్లో ఉన్న నాయకత్వ లక్షణాలను, నైపుణ్యాలను , శక్తి సామర్థ్యాలను పెంపొందించడం వారి లక్ష్యం. ఈ కార్యక్రమంలో విధానపరమైన విజ్ఞానం, రాజ కీయ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, జెండర్ వంటి విషయాలతో ఉన్న 10 వారాల కార్యక్రమం ఇది. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని రూపొందిస్తే మహిళలను రాజకీయ వేత్తలుగా వృత్తి నైపుణ్యం సంపాదిస్తారు. విలువలతో కూడిన దృష్టి కోణాన్ని పెంచుకుంటూ రాణిస్తారు. అగ్రభాగాన నిలిచే రాజకీయ వేత్తలుగా ఎదుగుతారు. చట్ట సభల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడంలో రిజర్వేషన్లు చాలా కీలక పాత్ర పోషిస్తాయి. పార్టీ స్థాయిలో రిజర్వేషన్ వల్ల మహిళల భాగస్వామ్యం పెరుగుతుంది. మహిళల భాగస్వామ్యం ఉన్నప్పుడు దేశం సామాజికంగా, ప్రజాస్వామికంగా కూడా అభివృద్ధి చెందుతుందన్నది కాదనలేని సత్యం . మరి అతి పెద్ద ప్రజాస్వామిక దేశంలో మహిళలంతా ఎదురు చూసే మహిళా బిల్లు ఎప్పుడు అమలు అవుతుందో మహిళల అస్తిత్వానికి గుర్తింపు ఎప్పుడు వస్తుందో ..చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం ఎప్పుడు మెరుగవుతుందో !!

ప్రభుత్వానికి నిజ్జంగా మహిళా రిజర్వేషన్ చట్టం అమలు పట్ల చిత్తశుద్ధి ఉంటే, లింకులు, గొళ్ళేలు పెట్టకుండా మహిళా బిల్లు అమలు చెయ్యాలి.

- వి. శాంతి ప్రబోధ
9866703223

# మహిళా బిల్లు... వ్యూహమా? పొరపాటా?

లోకసభలో మహిళా రిజర్వేషన్ల బిల్లు వీగిపోవడం దేశ రాజకీయాలలో మరో కీలక మలుపుగా నిలిచింది. రాజ్యాంగ సవరణ స్థాయి బిల్లులు సాధారణ చట్టాల కంటే విభిన్నమైన ప్రామాణికతను, విస్తృత రాజకీయ సమ్మతిని కోరుకుంటాయి. 131వ రాజ్యాంగ సవరణగా ప్రతిపాదించ బడిన ఈ బిల్లుతో పాటు నియోజకవర్గాల పునర్విభజన, కేంద్ర పాలిత ప్రాంతాల సీట్ల పెంపు వంటి కీలక ప్రతిపాదనలు ఒకేసారి లోకసభ ముందుకు రావడం రాజకీయంగా ఆసక్తికరమైనా, వ్యూహాత్మకంగా ప్రమాదకర నిర్ణయంగా మారింది. 528 మంది సభ్యులు పాల్గొన్న ఓటింగ్‌లో 298 అనుకూల ఓట్లు, 230 వ్యతిరేక ఓట్లు రావడం గణాంక పరంగా మెజార్టీలా కనిపించినా, రాజ్యాంగ సవ రణకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజార్టీ సాధించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఇదే ఈ పరిణామానికి మూల కారణం.ఈ పరిణామాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా మహిళా రిజర్వేషన్ల చరిత్రను పరిశీలించాల్సి ఉంటుంది. 1990ల నుంచే మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే ఆలోచన రాజకీయ చర్చల్లో నిలిచింది. 1996లో మొదటిసారి ఈ బిల్లు ప్రవేశపెట్ట బడినా, అప్పటి నుండి అనేకసార్లు అది పార్లమెంట్లో ప్రవేశించి నిలిచి పోయింది. 2010లో రాజ్యసభలో ఆమోదం పొందినా, లోకసభలో ఆమోదం పొందకపోవడం వల్ల చట్టరూపం దాల్చలేదు. అంటే, మహిళా రిజర్వేషన్లు భారత రాజకీయాల్లో ఒక 'అసంపూర్తి వాగ్దానం'గా మిగిలి పోయాయి.

ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును మళ్లీ తీసుకురావడం వెనుక రాజకీయ, సామాజిక రెండు కోణాలు ఉన్నాయి. ఒకవైపు మహిళా సాధికారతకు కట్టుబడి ఉన్నామని చెప్పుకోవడం, మరోవైపు ఎన్నికల ముందు మహిళా ఓటర్లను ఆకర్షించడమే లక్ష్యంగా కనిపించింది. అయితే, ఈ బిల్లును ఇతర రెండు కీలక బిల్లులతో కలిపి ఒకేసారి ప్రవేశపెట్టడం ప్రభుత్వ వ్యూహంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. నియోజకవర్గాల పునర్వి భజన అనేది అత్యంత సున్నితమైన అంశం. జనాభా ప్రాతిపదికన సీట్ల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందనే భయం చాలా కాలంగా ఉంది. ఇదే సమయంలో కేంద్ర పాలిత ప్రాంతాల సీట్ల పెంపు ప్రతిపాదన కూడా రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే అంశంగా నిలిచింది. ఈ రెండు అంశాలు ప్రాంతీయ అసమానతలు, రాజకీయ ప్రయో జనాల చుట్టూ తిరుగుతుండగా, మహిళా



రిజర్వేషన్ అనే సర్వసాధారణంగా అంగీకరించ దగిన అంశాన్ని కూడా వివాదంలోకి లాగినట్లైంది.

లోకసభలో జరిగిన ఓటింగ్ గణాంకాలను పరిశీలిస్తే, ప్రభుత్వం సాధారణ మెజార్టీని సాధిం చినప్పటికీ, రాజ్యాంగ సవరణకు అవసరమైన ప్రత్యేక మెజార్టీ లేదు. హాజరైన సభ్యులలో కనీసం మూడింట రెండు వంతుల ఓట్లు అవసరం. 528 మంది సభ్యులు ఉన్న సందర్భంలో కనీసం 352 ఓట్లు అవసరం కాగా, ప్రభుత్వం 298 ఓట్లకే పరిమితమైంది. అంటే సుమారు 54 ఓట్ల లోటుతో బిల్లు వీగిపోయింది.

ఇక్కడ ప్రధాన ప్రశ్న ఏమిటంటే-ఇది ప్రభుత్వ వ్యూహపరమైన పొరపాటా? లేక ఉద్దేశపూర్వక రాజకీయ ప్రణాళికా? విశ్లేషకుల అభిప్రాయాలు ఈ విషయంలో విభిన్నంగా ఉన్నాయి. ఒక వర్గం అభిప్రాయం ప్రకారం, ప్రభుత్వం మూడు బిల్లులను కలిపి ప్రవేశపెట్టడం ద్వారా ప్రతిపక్షాలను చిక్కులో పెట్టాలని భావించింది. మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా ఓటు వేస్తే మహిళా వ్యతిరేకులుగా ముద్ర పడుతుంది. మిగతా బిల్లులకు అనుకూలంగా ఓటు వేస్తే తమ రాజకీయ ప్రయోజనాలు దెబ్బ తింటాయి. ఈ పరిస్థితిలో ప్రతిపక్షాలు విభజిత మవుతాయని ప్రభుత్వం అంచనా వేసి ఉండ వచ్చు. అయితే ప్రతిపక్షాలు ఈ మూడు బిల్లులను వేర్వేరుగా పరిశీలించాలని డిమాండ్ చేశాయి. ముఖ్యంగా పునర్విభజన అంశంపై స్పష్టత లేకపోవడం, మహిళా రిజర్వేషన్ అమలు ఎప్పటి నుంచి అనేది తెలియక పోవడం, కొన్ని వర్గాలకు ఉప-రిజర్వేషన్ల అంశం స్పష్టంగా లేకపోవడం వంటి కారణాలు ప్రతిపక్షాలను ఒక్కటిగా నిలబెట్టాయి. ఇక్కడ మరో కీలక అంశం ప్రాం తీయ పార్టీల వైఖరి. కొన్ని ప్రాంతీయ పార్టీలు మహిళా రిజర్వేషన్‌కు మౌలికంగా అనుకూలంగా ఉన్నప్పటికీ, పునర్విభజనతో తమ రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గుతుందనే భయంతో బిల్లును వ్యతిరేకించాయి. కేంద్ర ప్రభుత్వానికి ఇది రాజకీ యంగా కూడా ఒక హెచ్చరికగా భావించవచ్చు. ప్రతిపక్షాలను సంప్రదించకుండా, విస్తృత చర్చలు లేకుండా, కీలక బిల్లులను ఒకేసారి ప్రవేశపెట్టడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. దీనిని వ్యూహాత్మక పొరపాటు అని చెప్పడం అతిశయోక్తి కాదు.

మరో కోణంలో చూస్తే, ఇది ఒక రాజకీయ ప్రయోగంగా కూడా భావించవచ్చు. ప్రభుత్వం ఈ బిల్లులను ప్రవేశపెట్టి, ప్రతిపక్షాల అసలు వైఖరిని ప్రజల ముందు ఉంచాలని భావించి ఉండవచ్చు. మహిళా రిజర్వేషన్‌కు మద్దతు ఇస్తున్నామని చెప్పుకునే పార్టీలే చివరకు వ్యతిరేకంగా ఓటు వేసిన పరిస్థితి ప్రజల్లో చర్చకు దారి తీస్తుంది. ఎన్నికల సమయంలో ఇది ఒక ప్రధాన ప్రచార అంశంగా మారే అవకాశం ఉంది. మొత్తానికి, లోకసభలో ఈ మూడు బిల్లులు వీగిపోవడం.. మహిళా రిజర్వేషన్ వంటి కీలక సామాజిక సంస్కరణ మరోసారి ఆలస్యమవడం బాధాకరం. అయితే ఈ సంఘటన భవిష్యత్తులో ఇలాంటి బిల్లులను ఎలా ప్రవేశపెట్టాలి, ఎలా సమ్మతి సాధించాలి అనే విషయంలో ఒక పాఠంగా నిలుస్తుంది.

దేశ రాజకీయాలలో సంఖ్యల గణితం మాత్రమే కాదు, సమన్వయం, సమ్మతి, సమగ్ర దృక్పథం కూడా అంతే ముఖ్యమని ఈ పరిణామం స్పష్టంగా తెలియ జేస్తోంది. మహిళా రిజర్వేషన్లు అమలు కావాలంటే, అది కేవలం బిల్లుగా కాకుండా, రాజకీయ సంకల్పంగా మారాలి. లేదంటే, అది ప్రతి సారి పార్లమెంట్ గడప దాటక ముందే నిలిచిపోతూనే ఉంటుంది.

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# విరమణతో ఉపశమనం

అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్, లెబనాన్ మధ్య ఎట్టకేలకు కాల్పుల విరమణ జరిగింది. అమెరికా, ఇరాన్ కాల్పుల విరమణ చేసినా ఇజ్రాయెల్ చేయక పోవడంతో, పై హెచ్చు లెబనాన్ పై విరుచుకు పడడంతో కలవరం కలిగింది. ఇజ్రాయెల్ దాడిలో లెబనాన్ తీవ్రంగా నష్టపోయింది. లెబనాన్ ప్రధానం గా వ్యవసాయక దేశం. అక్కడ మతాల మధ్య సంఘీభావం ఉంది. ఇజ్రాయెల్‌తో వచ్చిన యుద్ధం వల్ల పండ్లు, వ్యవసాయం దెబ్బతింది. యుద్ధం వల్ల దిగుమ తులు అంతగా లేవు. హార్ముజ్ జలసంధి మూసివేస్తే ఇజ్రాయెల్ దారికి వస్తుందని తెలిసి ఆ ప్రయత్నం ముమ్మురం చేసింది. ఇజ్రాయెల్ నౌకలు అక్కడ చిక్కుకుని ఇబ్బందులు పడ్డాయి. కేవలం ఇజ్రా యెల్ కాక అమెరికా నౌకలు సైతం తీవ్ర ఇబ్బం దులు పడ్డాయి. పశ్చిమ ఆసియా సంక్షోభంపై దౌత్యం నెరపెందుకు పారిస్‌లో యాభై దేశాధి నేతలు సమావేశం అయ్యారు. అయితే దౌత్యం విఫలమైంది. మళ్ళీ చర్చలు వుంటాయని ట్రంప్ ప్రకటించాడు. ట్రంప్‌ను మేము ఎప్పటికి నమ్మనే నమ్మం అని ఇరాన్ ప్రకటించడంలో ఆంతర్యం ఏమిటంటే యురేనియం నిల్వలు మేము



అప్పగించినట్లు ట్రంప్ అబద్ధం ఆడారని ఇరాన్ మండిపడింది. ఏతా వాత హార్ముజ్ జల సంధి ఇరాన్ కట్టడి చేయడంతో అమెరికా సైనికులు ఆకలి తో అలమటించారు. అందుకే ఇరాన్ వైపు ట్రంప్ మొగ్గినట్లు కనిపిస్తోంది.ఇరాన్ అండ పుష్కలంగా వున్న లెబనాన్ లోని హెజ్‌బుల్లా మిలిటెంట్ గ్రూప్ ను పూర్తిగా తుడిచి వేస్తామని ఇజ్రాయెల్ ప్రధాని నేతన్యాహూ స్పష్టం చేశాడు. ట్రంప్ హెచ్చరికతో ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ప్రకటించింది.

లెబనాన్‌పై కాల్పులు జరిగితే వైదొలుగు తామని ఇరాన్ చెప్పడంతో ఎట్టకేలకు ఇజ్రాయెల్ కాల్పుల విరమణ పాటించింది. మొత్తానికి అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు కాల్పుల విరమణతో ఉపశమనం కల్పించారు. ఇది శాశ్వతంగా ఉండాలని కోరుకుందాం.

- కనుమ ఎల్లారెడ్డి
9391523027

# నైతికత వర్సెస్ అధికారం



ఈ సమాజంలో తల ఎత్తుకుని బతకా లంటే మీకు ఉండాల్సింది నీతి కాదు,బలం. అది ధన బలమైనా, రాజకీయ అండ దండలైనా, లేదా తరతరా లుగా వస్తున్న కుల ప్రాబల్యమైనా కావచ్చు. చట్టం ముందు అందరూ సమానులే అనే మాట రాజ్యాంగం పేజీల్లో అక్షర సత్యం కావొచ్చు కానీ, వీధిలోకి వచ్చేసరికి అది అక్షరాలా అబద్ధం. బలహీనుడికి న్యాయం అడిగే హక్కు ఉంది, కానీ ఆ న్యాయం పొందే అదృష్టం మాత్రం అరుదు. ఈ ఒక్క మాట చాలు మన వ్యవస్థలోని లోతుపాతు లను చెప్పడానికి. మన చుట్టూ ఉన్న పల్లెలు, పట్టణాల్లో ప్రతిరోజూ మనం చూస్తున్న దృశ్యాలే దీనికి నిదర్శనం. ఒక సామాన్య రైతు పొలాన్ని ఒక రియల్ ఎస్టేట్ మాఫియా నాయకుడో లేదా రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తి ఆక్రమిస్తే, ఆ పేదవాడు తన భూమి కోసం కచేరీల చుట్టూ కాళ్ళు అరిగేలా తిరుగుతాడు. కానీ, అదే బలవం తుడు ఎవరి భూమిపై కన్నేసినా, అతనికి రక్షణగా యంత్రాంగం నిలబడుతుంది. ఇందులో అన్యా యం ఉందని అందరికీ తెలుసు, కానీ ప్రశ్నించే గొంతుకలేవి?.

న్యాయవ్యవస్థ నేడు పేదవాడికి అందని ద్రాక్ష మన ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయస్థానం దేవాలయం లాంటిది. కానీ ఆ దేవాలయంలోకి ప్రవేశించాలంటే ఫీజులు ఇచ్చుకోగల స్థోమత ఉండాలి. ఒక రోజువారీ కూలీ తన హక్కుల కోసం కోర్టుకు వెళ్లాలంటే, ఆ రోజు పని మానుకోవాలి. పని మానుకుంటే ఇంట్లో పొయ్యి వెలగదు. న్యాయం కోసం పోరాడటం అనేది ఒక పేదవాడికి విలాసవంతమైన అంశం. సమాజం అతనికి ప్రతిరోజూ ఒక మూగ సందేశాన్ని పంపిస్తోంది. నీకు న్యాయం దొరకదు, అడగడం మానుకో. చట్టం అమలు చేసే చోట పైనుంచి ఒత్తిడి అనే పదం ఒక మంత్రంలా పనిచేస్తుంది. ధనవంతులు బెయిల్ మీద రాజభోగాలు అనుభవిస్తుంటే, ఎంతో మంది అమాయకులు జైళ్లలో మగ్గి పోతున్నారు. మనస్తత్వపు లోపాలు నేటి సామా జిక స్థితిగతుల్లో గౌరవం అనేది నైతిక విలువలతో ముడిపడి లేదు. అది కేవలం విజయంతోనే ముడిపడి ఉంది. ఒక వ్యక్తి నిజాయితీగా బ్రతు కుతూ పేదవాడిగానే మిగిలిపోతే, అతన్ని అసమ ర్థుడు అని చులకనగా చూస్తారు. అదే వ్యక్తి వేల కోట్లు అక్రమంగా సంపాదించి విలాసవంతమైన మేడలో ఉంటే, అతన్ని సక్సెస్ ఫుల్ పర్సన్ అని కీర్తిస్తారు. మన తెలుగు సమాజంలో ఇది మరీ ఎక్కువ. శుభకార్యాల్లో అయినా, అంతిమ యాత్రల్లో అయినా కుర్చీ ఎక్కడ వేయాలి అనేది ఆ వ్యక్తి సంపాదనను బట్టి నిర్ణయమవుతుంది తప్ప, అతని గుణగణాలను బట్టి కాదు.ఈ విషపూరిత మనస్తత్వం యువతరంలోకి ఇంకిపోతోంది. ఒక అవినీతి అధికారిని పెద్ద మనిషి అని పిలుస్తూ, అప్పుల పాలైన రైతును తెలివి లేనివాడు అని హేళన చేసే ఈ తలకిందుల విలువల వ్యవస్థే మన సమాజానికి పట్టిన అసలు జబ్బు. సమాజంలో కులం అనేది ఒక సామాజిక వర్గీకరణ మాత్రమే కాదు, అది ఒక ఆయుధం. బలవంతులకు ఇది ఇంకా బలాన్ని ఇస్తుంది, బలహీనులను మరింత అణచివేస్తుంది. కులాంతర వివాహాల పట్ల సమా జపు వివక్ష, పరువు హత్యల రూపంలో మన ముందే కనిపిస్తోంది. మార్పు వస్తే నష్టపోయేది బలవంతులు కాబట్టి, వారు వ్యవస్థను మార్చ డానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండరు. మార్పు ఎక్కడ మొదలవ్వాలి? పరిస్థితులు ఇంత నిరాశగా ఉన్నాయని చేతులు కట్టుకుని కూర్చుంటే కాలం గడిచిపోదు. పరిష్కారం పోరాటంలోనే ఉంది. అపారమైన వివక్షను ఎదుర్కొన్న అంబేద్కర్ గారు ఒంటరిగా నిలబడి రాజ్యాంగాన్ని లిఖించారు. పెరియార్ వంటి వారు సమాజపు పోకడలను ప్రశ్నించారు. నేటి తరం చదువుకున్న యువత ఈ బలవంతుడిదే లోకం అనే సూత్రాన్ని తిరగ రాయా లి. మీడియా, సాహిత్యం, కళలు అన్నీ కేవలం గ్లామర్ కోసమే కాకుండా, సామాజిక స్పృహ కోసం పనిచేయాలి. గొప్పతనం నీతిలో ఉంది. ఒక సమా జం ఎప్పుడు నాగరికత పొందింది అని చెప్పు కోగలమంటే - అది తనలోని అత్యంత బలహీ నమైన వ్యక్తికి రక్షణ కల్పించినప్పుడు మాత్రమే. బలవంతులను ప్రశ్నించే దమ్ము, బలహీనులకు బాసటగా నిలిచే గుణం ఉన్నప్పుడే మనం అభి వృద్ధి చెందినట్లు. కానీ సమాజం న్యాయం చేయా లి అనేది మన రేపటి లక్ష్యం కావాలి. ఆ లక్ష్యం దిశగా వేసే ప్రతి అడుగు ఒక చిన్న విప్లవం. మీ నోరు, మీ కలం, మీ ఓటు ఈ మూడూ మేల్కొనాలి. ఆకలితో ఉన్నా నిజాయితీగా ఉన్నవాడికి అండగా నిలిచిన రోజు ఈ సమాజంలో మార్పు మొదలవుతుంది. అంత వరకు ఈ బలవంతుల ఆట సాగుతూనే ఉంటుంది. నిజమైన విజయం అధికారంలో లేదు, అది సామాన్యుడి కన్నీరు తుడవడంలో ఉంది. మన విలువలను మార్చు కుందాం, వ్యవస్థను ప్రశ్నిద్దాం. అప్పుడే మన ప్రజాస్వా మ్యానికి, మన సంస్కృతికి అర్థం పరమార్థం ఉంటుంది.

- డా. సూర్యదేవర రామకృష్ణ
9490754169

# రైతు భరోసా విడుదల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## ప్రతి కార్యకర్త సమన్వయంతో పని చేయాలి

## రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు




మంథని, ఏప్రిల్18 (మనం న్యూస్): రైతు భరోసా విడుదల కార్యక్రమాన్ని రైతులు, ప్రజలు,ప్రజాప్రతినిధులు,నాయకులు,విజయవంతం చేయాలని రాష్ట్రమంత్రి దుద్దిల్ల. శ్రీధర్ బాబు అన్నారు. శనివారం మంథని పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంథని,రామగిరి, కమాన్ పూర్, ముత్తారం, పాలకుర్తి, మండలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తల సమావేశానికి మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సోమవారం మంథని నియోజకవర్గంలోని కాటారంలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమం ఏర్పాట్లపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.ఈ సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనమల రేవంత్ రెడ్డి,ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తదితరులు హాజరవుతారని ఆయన తెలిపారు. రైతు భరోసా పథకం రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని ఆయన అన్నారు.ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులు హాజరయ్యేలా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి శ్రీధర్ బాబు పార్టీ నాయకులకు దిశనిర్దేశం చేశారు.ఈ కార్యక్రమం సజావుగా జరిగేలా బాధ్యతలు కేటాయించి ప్రతి ఒక్కరూ తమ తమ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో మంథని డివిజన్ లోని ఐదు మండలాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# జనగణన ప్రక్రియను ప్రకడ్బందీగా చేపట్టాలి

- నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



కరీంనగర్ ఏప్రిల్ 18(మనం బ్యూరో): జనగణన ప్రక్రియను పకడ్బందీగా పారదర్శకంగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం టౌన్ ప్లానింగ్ అధికారులు, జనగణన ఫీల్ ట్రైనర్లతో సమీక్షా సమావేశం జరిగింది. సమావేశంలో ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్ల శిక్షణ తరగతుల నిర్వహణ, జనగణన విధుల్లో పాటించాల్సిన నిబంధనలు, తీస్కోవల్సిన చర్యల పై కమీషనర్ దిశా నిర్ధేశం చేస్తూ పలు సూచనలు చేశారు. ఈ సంధర్బంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిదిలో త్వరలో చేపట్ట బోయే జన గణన ప్రక్రియను ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలని డాటా సేకరణలో ప్రతి ఇంటిని సందర్శించి... ఖచ్చితమైన సమాచారం సేకరించేలా చర్యలు తీస్కోవాలన్నారు. జనగణన ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి వారు స్వచ్ఛందంగా సమాచారం తెలిపేలా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. జనగణన ప్రక్రియ పై ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీస్కోవాలన్నారు. నగర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 666 హౌజ్ లిస్ట్ బ్లాక్ ల ప్రకారం గుర్తించిన ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లకు 3 విడుతలుగా శిక్షణ తరగతులు నిర్వహించాలని ట్రైనర్లకు సూచించారు. గుర్తించిన 855 మంది ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లకు బ్యాచ్ ల వారిగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి జనగణన చేపట్టాల్సిన విధివిధానాలు, నిబంధనల, జనగణన విధుల్లో తీస్కోవల్సిన జాగ్రత్త చర్యల పై క్లుప్తంగా వారికి వివరించాలని సూచించారు. డేటా సేకరణ లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జనగణన ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించేలా శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఖాధర్ మొహియుద్దీన్, టౌన్ ప్లానింగ్ అధికారులు బషీరొద్దీన్, వేణు, శ్రీధర్, ఎంహెచ్ఓ సుమన్, జనగణన ట్రైనర్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐ వినియోగంతో పనితీరులో వేగం, సామర్థ్యం పెరుగుతుంది

- ఏఐ సాంకేతికతను ప్రతి ఒక్కరూ అవలంబించాలి
- సాంకేతిక పరిజ్ఞానంతో సేవల నాణ్యతను మెరుగుపరచాలి
- ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందించాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి, ఏప్రిల్ 18 (మనం ప్రతినిధి): ఏఐ సాంకేతికత వినియోగం ద్వారా ప్రభుత్వ పనితీరులో వేగం, సామర్థ్యం పెరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. ప్రతి అధికారి, సిబ్బంది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించి తమ పనిని మరింత సమర్ధవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.శనివారం జిల్లాలో నిర్వహించిన ఏఐ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొని ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, నూతన సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించడం ద్వారా పనుల్లో వేగం పెరగడంతో పాటు సమయాన్ని ఆదా చేయవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఏఐ వంటి ఆధునిక సాంకేతికతను నేర్చుకుని, తమ దైనందిన విధుల్లో అమలు చేయాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాలను కేవలం హాజరు పరిమితంగా కాకుండా, అందులో నేర్చుకున్న విషయాలను పనిలో ప్రతిఫలింపజేయాలని అన్నారు. ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు త్వరితగతిన, నాణ్యమైన సేవలు అందించే దిశగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.శిక్షణ కార్యక్రమాలకు సమయపాలనతో హాజరై, పూర్తి స్థాయిలో పాల్గొనాలని, నేర్చుకునే మనస్తత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు , కలెక్టరేట్ పరిపాలన అధికారి బండి ప్రకాష్ ,సంబంధిత అధికారులు,అన్నీ శాఖల సిబ్బంది, పాల్గొన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలి

- సీఎం సభకు అధిక సంఖ్యలో హాజరు కావాలి
- ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

సుల్తానాబాద్, ఏప్రిల్ 18 (మనం న్యూస్): ఈనెల 20 వ తేదీ సోమవారం మంథని నియోజకవర్గంలోని కాటారం మండలం కేంద్రంగా జరగబోయే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని శనివారం సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలోని యశోద నరహరి ఫంక్షన్ హాల్, కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ లో, ఓదెల మండలం పోత్కపల్లి గ్రామంలో మండల, పట్టణ కౌన్సిలర్లు, సర్పంచ్ లు కాంగ్రెస్ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి సీఎం రేవంత్ రెడ్డి పర్యటనను సఫలం చేసే దిశగా కాంగ్రెస్ నాయకులు పని చేయాలని దిశా నిర్దేశం చేశారు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్, మున్సిపల్ చైర్మన్, పలు మండలలా పార్టీ అధ్యక్షులు, వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్లు,పలు గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి సభను గ్రాండ్ సక్సెస్ చేయాలి

## కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావాలి

### కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు



కరీంనగర్ ఏప్రిల్ 18(మనం బ్యూరో): ఈనెల 20న సోమవారం కాటారంలో జరగనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభకు కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ కార్పొరేటర్లు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు సీఎం సభను గ్రాండ్ సక్సెస్ చేయాలని కోరారు. శనివారం వెలిచాల రాజేందర్ రావు మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన సోమవారం రోజున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటీ పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి మేడిగడ్డ కాళేశ్వరం ప్రాజెక్టులను సందర్శిస్తారని తెలిపారు. వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి గత బీఆర్ఎస్ పాలకులు కాళేశ్వరం ప్రాజెక్టును కుప్ప కూల్చారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు వేలకోట్ల అవినీతికి పాల్పడ్డారనీ, బీఆర్ఎస్ అంటేనే అవినీతికి కేరాఫ్ అడ్రస్ గా మారిందని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలకుల తప్పులను సరిదిద్దుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధికి సమాన ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మత్తులు చేసేందుకు ప్రభుత్వం నడుం బిగించిందనీ, ఇందులో భాగంగానే మేడిగడ్డ కాళేశ్వరం ప్రాజెక్టును పరిశీలించేందుకు ముఖ్యమంత్రి వస్తున్నారని తెలిపారు. ఆ తర్వాత కాటారం మండలం నస్తురిపల్లి గ్రామంలో జరిగే బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి ముఖ్యమంత్రి రైతు సోదరుల కోసం రెండో విడత రైతు భరోసా నిధులను విడుదల చేస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు కరీంనగర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, సర్పంచులు ప్రజాప్రతినిధులు మాజీ కౌన్సిలర్లు కార్పొరేటర్లు కార్యకర్తలు అన్ని విభాగాల కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని రాజేందర్ రావు కోరారు. 200 వాహనాల ద్వారా కార్యకర్తలు నాయకులను తరలించేందుకు సమాయత్తమవుతున్నట్లు రాజేందర్ రావు పేర్కొన్నారు.

# మహనీయుల ఆశయాలను స్మరించుకోవాలి




- ఎమ్మెల్యే కాలె యాదయ్య
- పోస్టర్, ప్రచార రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే
- ఈ నెల 30న భారీ బహిరంగ సభ

చేవెళ్ల, ఏప్రిల్ 18 (మనం న్యూస్): మహనీయులు చూపిన బాటలో నడుస్తూ వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పిలుపునిచ్చారు. ఈ నెల 30న నిర్వహించ తలపెట్టిన 'మహనీయుల జాతర కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ను, ప్రచార రథాన్ని శనివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏప్రిల్ మాసం మహనీయుల మాసమని కొనియాడారు. బసవేశ్వరుడు, మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ వంటి మహనీయుల చరిత్రను, వారు చేసిన పోరాటాలను భావితరాలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ జాతర ద్వారా వారి సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందనీయమని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహనీయుల జాతర కమిటీ చైర్మన్ బురాన్ ప్రభాకర్, వైస్ చైర్మన్లు రామస్వామి, మొకరం రాజు, బండి బాలకృష్ణ, నల్లోళ్ల శ్రీకాంత్, శివరాజ్, జానీ, ప్రభాకర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో

# జ్యోతి లక్ష్మణ్ ప్రచారం



జగిత్యాల ఏప్రిల్ 18 (మనం న్యూస్): చెన్నై సౌత్ పరిధిలోని వెలచ్చేరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం మూడో రోజు మరింత వేగం పుంజుకుంది. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థి జె.ఎం.హెచ్. హసన్ మౌలానా తరపున అడువాల జ్యోతి లక్ష్మణ్ విస్తృత ప్రచారం నిర్వహించారు. స్థానిక కాలనీలు, ప్రధాన వీధుల్లో బైక్ ర్యాలీలు, ఇంటింటి ప్రచారంతో ప్రజలను నేరుగా కలుసుకుని మద్దతు కోరారు. ప్రచారం సందర్భంగా అభ్యర్థికి ప్రజలు బ్రహ్మారథం పట్టి ఉత్సాహంగా స్వాగతం పలికారు. మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జ్యోతి లక్ష్మణ్ ప్రచారంలో చురుకుగా పాల్గొని అభ్యర్థికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల్లో కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ప్రచారంలో అభ్యర్థి ఎక్కడికి వెళ్లినా మంచి స్పందన లభిస్తోందని, ఈ సానుకూల వాతావరణం విజయానికి సంకేతమని పేర్కొన్నారు. వెలచ్చేరి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మంత్రి వివేక్ను కలిసిన కొన్యాల

ములుగు, ఏప్రిల్ 18(మనంన్యూస్): మంత్రి వివేక్ వెంకటస్వామిని సిద్దిపేట జిల్లా ఫోరం అధ్యక్షుడు కొన్యాల బాల్రెడ్డి, మాజీ సర్పంచ్ మక్తాల వెంకటేష్గౌడ్,బి. సుదర్శన్లు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించారు. గ్రామ అభివృద్ధి కొరకు సీసీ రోడ్స్ అండర్ డ్రైనేజీ , ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించాలని కోరారు. గతంలో క్షీరసాగర్లో పర్యటించిన మంత్రి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి రూ. 50 లక్షల నిధులు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.కోటి, అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్టుగా మంత్రి వివేక్ వెంకట స్వామి ప్రకటించారు. గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం రేపటి నుంచి వస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. దానిలో భాగంగానే ఆయనను కలిసి వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన విషయాలతో పాటు గతంలో ఇచ్చిన మంజూరు విషయమై కలిసి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేస్తానని తెలిపినట్లు కొన్యాల బాల్రెడ్డి తెలిపారు.

# మధ్యాహ్న భోజనం తనిఖీ చేసిన సర్పంచ్



మహాదేవపూర్, ఏప్రిల్18 మనం న్యూస్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని ఎంపీపీ ఎస్ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం మధ్యాహ్న భోజన పథకాన్ని గ్రామ సర్పంచ్ హసీనా అక్బర్ ఖాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు, భోజనం తయారీ విధానం, నాణ్యత పరిశుభ్రత వంటి అంశాలను స్వయంగా పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పోషక ఆహారంతో కూడిన నాణ్యత మైన భోజనం అందించాలని మాట్లాడడం జరిగింది వంట ప్రక్రియలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె సూచించారు, ఆరోగ్యం విద్యార్థి కోసం తన వంతు కృషి చేస్తానని సర్పంచ్ హసీనా అక్బర్ ఖాన్ తెలిపారు.

## ఐదేళ్ల బాలుడి దారుణ హత్య




- వివాహేతర సంబంధం నేపథ్యంపై సంచలనం

కామారెడ్డి, ఏప్రిల్ 18 ( మనం న్యూస్ ): కామారెడ్డి పట్టణ కేంద్రంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో ఐదేళ్ల బాలుడు దారుణంగా హత్యకు గురైన ఘటన సంచలనం రేపింది. కాలనీకి చెందిన లక్ష్మీకి ఇద్దరు పిల్లలు ఉండగా, భర్తతో కలహాల కారణంగా గత ఆరు నెలలుగా లక్ష్మీ నరసింహులు అనే వ్యక్తితో కలిసి నివసిస్తోంది. శనివారం లక్ష్మీ పనిమీద బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఉన్న శ్రావణ్ (5)ను లక్ష్మీ నరసింహులు గొంతు పిసికి, నోరు, ముక్కు మూసి, నేలకేసి కొట్టి, కళ్లలో కారంపొడి పోసి హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై రాజంపేట గ్రామానికి చెందిన బాలుడి బాబాయ్ రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అజాగ్రత్తే అంతుచూస్తోంది

## రోడ్డు ప్రమాదాల నివారణకు సమష్టిగా కదలాలి

## కామారెడ్డి జిల్లా ఏఎస్పీ చైతన్య రెడ్డి పిలుపు

## బిక్కనూరులో ఘనంగా 'ఆరైవ్ అలైవ్' సదస్సు

బిక్కనూరు, ఏప్రిల్ 18 ( మనం న్యూస్ ): రాష్ట్ర రహదారులపై రోజురోజుకూ పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాల పట్ల కామారెడ్డి జిల్లా అదనపు పోలీసు సూపరిండెంట్ (ఏఎస్పీ) చైతన్య రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నేతృత్వంలోని 'ప్రజా పాలన' 99 రోజుల ప్రణాళికలో భాగంగా, బిక్కనూరు పోలీసు సర్కిల్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎస్వీ గార్డెన్లో 'ఆరైవ్ అలైవ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సుకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు, ప్రజా ప్రతినిధులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. సదస్సులో ప్రధాన ప్రసంగం చేసిన ఏఎస్పీ చైతన్య రెడ్డి, వాహనదారులకి తగు జాగ్రత్తలు సూచించారు. అధికారి మాట్లాడుతూ హెల్మెట్ మీ రక్షణకే 'హెల్మెట్ ధరించడం పోలీసుల చలాన్ల నుంచి తప్పించుకోవడానికి కాదు, ప్రమాదం జరిగినప్పుడు మీ తలను కాపాడుకోవడానికి అని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.' అని తెలియజేసారు. మద్యం తాగి వాహనం నడపడం అనేది కేవలం ఒక తప్పు మాత్రమే కాదు, అది ఉన్మాదం కంటే ప్రమాదకరమని ఆమె హెచ్చరించారు. అమాయకుల ప్రాణాలను బలితీసుకునే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. 2024లో జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల వల్ల 275 మరణాలు సంభవించగా, పోలీసుల నిరంతర నిఘా మరియు అవగాహన కార్యక్రమాల వల్ల 2025లో ఈ సంఖ్యను 225కు తగ్గించగలిగామని తెలిపారు. ప్రజలు సహకరిస్తే జిల్లాను ప్రమాద రహితంగా మార్చవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజల సంక్షేమంతో పాటు వారి భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన వినూత్న చర్యలను ఆయన వివరించారు. జాతీయ రహదారిపై ప్రతి 30 కిలోమీటర్లకు ఒక అధునాతన ట్రామా కేర్ సెంటర్ను ఏర్పాటు చేస్తున్నారు అని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు 'గోల్డెన్ అవర్'లో వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.



కదిలించిన కళాజాతా – ఎంఎస్ఎన్ ఫార్మా చేయూత

ఈ కార్యక్రమానికి ఎంఎస్ఎన్ ఫార్మా సంస్థ తమ సామాజిక బాధ్యత సి ఎస్ ఆర్ కింద ఆర్థిక సహకారాన్ని అందించింది. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, పరిశ్రమల లోపల పాటించే భద్రతను రహదారులపై కూడా పాటించాలని కోరారు. అనంతరం కళాజాతా బృందం తమ పాటలు, ప్రదర్శనల ద్వారా రోడ్డు ప్రమాదాల వల్ల చితికిపోతున్న కుటుంబాల గాథలను వివరించి, అక్కడ ఉన్న ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేశారు. ఇంటి వద్ద ఎదురుచూసే వారిని మరువకండి అనే సందేశం ఇచ్చారు. బిక్కనూరు సీఐ సంపత్ కుమార్ మరియు ఎస్ఐ ఆంజనేయులు మాట్లాడుతూ, పోలీసులు వేసే చలాన్లు ప్రభుత్వ ఆదాయం కోసం కాదని, అది మీలో బాధ్యతను పెంచడానికేనని హితవు పలికారు. 'మీరు క్షేమంగా తిరిగి వస్తారని ఇంట్లో ఎదురుచూసే తల్లిదండ్రులు, భార్యాపిల్లలను గుర్తుంచుకుని వాహనం నడపండి' అని ఎమోషనల్గా విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంఎస్ఎన్ సంస్థ సౌజన్యంతో ప్రజలకు, మీడియా ప్రతినిధులకు ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు.

# చెరువు పునరుద్ధరణతో పెనుమాదానికి నీటి భద్రత ఉపాధి పనులకు ఊతం

- పూడిక తీతతో చెరువు విస్తరణ
- త్రాగునీటి సమస్యకు పరిష్కారం
- కూలీల శ్రమతో గ్రామాభివృద్ధి
- పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం



పోడూరు, ఏప్రిల్ 18 మనం న్యూస్ః పోడూరు మండలం పెనుమాదం గ్రామపంచాయతీ పరిధిలోని అప్పు చెరువు మంచినీటి చెరువులో పూడిక తీత పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఒక ఎకరా 75 సెంట్ల విస్తీర్ణం కలిగిన ఈ చెరువుకు రూ.7 లక్షల 403 రూపాయల అంచనా వ్యయంతో పనులు చేపట్టారు.ఈ పనుల్లో 100 మంది కూలీలు పాల్గొంటుండగా, మొత్తం 2283 పని దినాలు సృష్టించబడుతున్నాయి. ఈ పనులు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవికా మిషన్) కింద నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చెరువు పనులనుశనివారం పరిశీలించి కూలీలతో మాట్లాడుతూ, గ్రామాల అవసరాలకు అనుగుణంగా చేపడుతున్న ఈ పనులు భవిష్యత్తులో నీటి కొరతను తగ్గిస్తాయని అన్నారు.పని చేస్తున్న ప్రతి రోజు గ్రామానికి నిలిచే ఆస్తి అవుతుంది తెలిపారు.అందరూ బాధ్యతతో, నిబద్ధతతో పనులు పూర్తి చేయాలి అని సూచించారు.కాగా పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఉపాధి హామీ కూలీలతో కలిసి పనిచేయడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది. ఇక అధికారులను ఉద్దేశించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. పనుల ప్రగతిని నిరంతరం పర్యవేక్షించాలని, కూలీలకు సమయానికి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, చెరువు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా పనులు ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని తెలిపారు.అదేవిధంగా స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.చెరువు పూడిక తీత పూర్తయితే స్థానిక ప్రజలకు త్రాగునీటి అందుబాటు మెరుగుపడటంతో పాటు భూగర్భ జలాల స్థాయి కూడా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.ఆర్డీఓ దాసి రాజు, మండల తాసిల్దార్ సయ్యద్ మౌలానా పాజిల్, ఎంపీడీవో బిఎస్ఎల్ మంగాకుమారి, నీటి సంఘం అధ్యక్షులు దేవరపు దొరబాబు, పంచాయతీ అభివృద్ధి అధికారి జి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన వలవల నాని




నరసాపురం, ఏప్రిల్ 18 (మనం న్యూస్)ః నరసాపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్గా నూతనంగా నియమితులైన వలవల రవికుమార్ (నాని) శనివారం స్థానిక నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ను మర్యాదపూర్వకంగా కలిసి అర్బన్ బ్యాంక్ చైర్మన్ గా తనను నియమించినందుకు తజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వలవల నానికి అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే నాయకర్ బాధ్యతాయుతంగా పనిచేసి ప్రభుత్వానికి, బ్యాంకుకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

## సమతుల ఆహారం పోషణ పక్వాడా లక్ష్యం

- కలెక్టర్ సిహెచ్ నాగరాణి



నరసాపురం, ఏప్రిల్ 18 (మనం న్యూస్)ః పోషకాహారం ప్రాముఖ్యత ప్రజలలో విస్తృత అవగాహన కల్పించడం అత్యంత అవసరమని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ సిహెచ్ నాగరాణి అన్నారు. శనివారం పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గోడపత్రికను జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఆవిష్కరించారు. ప్రభుత్వం చేపడుతున్న పోషణ అభియాన్ కార్యక్రమాల లక్ష్యం ప్రతి కుటుంబానికి సమతుల ఆహారం అందించడం, పోషకాహార లోపాలను తగ్గించడమని అంగన్వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహార సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి పోషకాహారం కీలకమని, తల్లిదండ్రులు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు సమన్వయంతో పనిచేసి ప్రతి బాలుడికి సరైన పోషణ అందేలా చూడాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, తహసిల్దార్ ఐతం సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకట రమణారెడ్డి, ఎంపీడీవో ఎం.నాసరు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ కొరకు వివరాలు సేకరణ

కాట్రేనికోన ఏప్రియల్ 18 మనం ప్రతినిధిః మత్స్యకారుల సేవలో పథకంలో భాగముగా శనివారం బలుసుతిప్ప మరియు కొత్తపాలెం ఎఫ్ ఎల్ సి లలో జరిగిన బోట్ల ఎన్యూమరేషన్ లో బలుసుతిప్ప ఎఫ్ ఎల్ సి నందు 684 బోట్ల కు గాను 4106 మరియు కొత్తపాలెం ఎఫ్ ఎల్ సి నందు 318 బోట్లకు గాను 1908 మంది మత్స్యకారులను మొత్తంగా 6014 మంది మత్స్యకారుల వివరాలు సేకరించడమైనదని ఎఫ్ డి ఓ చలపతి తెలిపారు. కార్యక్రమం లో మత్స్య శాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు

## గోదావరి తీరాన జలధార-జలహారతి

- పాల్గొన్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే బొమ్మిడి



నరసాపురం, ఏప్రిల్ 18 (మనం న్యూస్)ః పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని పర్యావరణ పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ప్రతినెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ సిహెచ్ నాగరాణి పేర్కొన్నారు. దీనిలో భాగంగా శనివారం నరసాపురం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక వశిష్ట గోదావరి తీరాన జలధార- జలహారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, నియోజవర్గ తెదేపా ఇంచార్జ్ పొత్తూరి రామరాజు ముఖ్య అతిథులుగా పాల్గొని గోదావరి నదిలో పేరుకుపోయిన చెత్తను స్వయం గా తొలగించి ఆ ప్రాంతంలో మొక్కలను నాటారు. అనంతరం గోదావరి మాతకు జలహారతి సమర్పించారు. విద్యార్థులు నిర్వహించిన స్వచ్ఛ మానవహారంలో కలెక్టర్ అందరితో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జలహారతి భారతీయ సంస్క ృతిలో వేల ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయమని నదులు, భూమి, గాలి అని ప్రకృతి సంపదలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్డీవో దాసిరాజు, తహసిల్దార్ ఐతం సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకట రమణారెడ్డి, ఎంపీడీవో ఎం.నాసరు రెడ్డి, ఏఎంసీ చైర్మన్ శ్రీమన్నారాయణ, మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

## డస్ట్ బిన్నులు విరాళంగా ఇచ్చిన ఆసుపత్రుల నిర్వాహకులు



ముమ్మిడివరం, ఏప్రిల్ 18, మనం న్యూస్ః డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నియోజకవర్గ కేంద్రమైన ముమ్మిడివరంలో నగర పంచాయతీ పరిధిలో కమిషనర్ పి రవివర్మ పర్యవేక్షణలో స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమం నిరాటంకంగా కొనసాగుతుంది. ముమ్మిడివరం నగర పంచాయతీ అధికారులు సిబ్బంది చిత్తశుద్ధిని చూసి, డస్ట్ బిన్నులను విరాళంగా ఇచ్చేందుకు ఆసుపత్రుల నిర్వాహకులు ముందుకు వచ్చారు. జనతా ఆసుపత్రికి చెందిన డాక్టర్ ఎన్ జగన్మోహన్ 26 డస్ట్ బిన్నులను అందజేయగా, మహిక ఆసుపత్రి డాక్టర్ కళ్యాణి మణికంఠ నాలుగు డస్ట్ బిన్నులు విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ పి రవివర్మ మాట్లాడుతూ నగర పంచాయతీలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ఇవి దోహదపడతాయన్నారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి, అవసరమైన సామాగ్రిని విరాళంగా ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లు ఆడుకోవడం హేయమైన చర్య

- డాక్టర్. ఏలూరి రామచంద్రారెడ్డి



మార్కాపురం,ఏప్రిల్, 18,మనం న్యూస్ః లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడం కాంగ్రెస్ పార్టీ నీచ రాజకీయానికి పరాకాష్ట అని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి వ్యాఖ్యానించారు.. ఈ బిల్లు అడ్డుకుని కాంగ్రెస్ పార్టీ, మరియు మరికొన్ని పార్టీలు హీనబుద్ధిని ప్రదర్శించాయని విమర్శించారు.. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం మహిళల పట్ల తీరని ద్రోహమని పేర్కొంటూ, మహిళలకు జరుగుతున్న మేలును చూసి ఓర్వలేకే కాంగ్రెస్ ఈ విధంగా వ్యవహరించిందని ఆయన అన్నారు. మహిళా సాధికారతకు దోహదపడే ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి అన్యాయం అని ఆయన అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్, ఇండి కూటమి తమ స్వార్థ రాజకీయాల కోసం గత 30 ఏళ్లుగా మహిళా రిజర్వేషన్ బిల్లును ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటూ దేశంలోని నారీ శక్తికి తీరని అన్యాయం చేశాయన్నారు.

మహిళల హక్కులు, అవకాశాల పెంపుకు సంబంధించిన అంశాలలో రాజకీయాలను పక్కన పెట్టి సమగ్రంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని, కానీ కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో బాధ్యతారహితంగా వ్యవహరించిందని డా. ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.

## చక్రవర్తి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



జగ్గంపేట ఏప్రిల్ 18:(మనం న్యూస్)ః జగ్గంపేట మండల తెలుగు యువత అధ్యక్షులు రాయి సాయి సోదరుడి కుమారుడు రాయి ప్రకాష్ చక్రవర్తి ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మరణించారు. జగ్గంపేట పద్మనాభ నగర్ లోని వారి స్వగృహంలో శనివారం దశదినకర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ పాల్గొని మృతుడు ప్రకాష్ చక్రవర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢసానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మండల టిడిపి అధ్యక్షులు జీనుమణి బాబు, తెలుగు యువత అధ్యక్షులు దేవరపల్లి మూర్తి, టౌన్ టిడిపి అధ్యక్షులు పాండ్రంగి రాంబాబు, బోదిరెడ్ల సుబ్బారావు, బొట్టేటి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యను పరిష్కరించాలంటే పీఎస్‌లో నిర్బంధిస్తారా?

- మాజీ ఎంపీ హర్ష కుమార్




జగ్గంపేట ఏప్రిల్ 18: (మనం న్యూస్)ః జగ్గంపేట గ్రామంలో శనివారం మధ్యాహ్నం మాజీ ఎంపీ హర్ష కుమార్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు మరియు జగ్గంపేట పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు పాస్టర్ జాన్ వెస్లీ నివాసం వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. ఈ మీడియా సమావేశంలో మాజీ ఎంపీ హర్ష కుమార్ మాట్లాడుతూ గత రోజు క్రితం ఆకివీడు క్రైస్తవుల పై జరుగుతున్న దాడులను నిరసిస్తూ జగ్గంపేట నియోజకవర్గం నుండి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు జాన్ వెస్లీ ఆధ్వర్యంలో 30 మంది పాస్టర్ లు ఆకివీడు నిరసనకు బయలుదేరడానికి సిద్ధమవుతున్న సందర్భంలో నిరసనకు వెళ్లకుండా పోలీసు వారుని నిర్బంధం చేయడం ఒక దారుణ చర్య అని, దీనిని నిరసిస్తూ జగ్గంపేట పాస్టర్లకు సంఘీభావం తెలపడం కోసం ఈరోజు జగ్గంపేట రావడం జరిగిందని, మరియు ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు ఇంటిని ముట్టడించడానికి ఈ పాస్టర్లు వెళ్తున్నారనే ఒక దురుద్దేశం మాటను తీసుకుని వీరిని నిర్బంధం చేయడం సరికాదని, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ ఇంటిని ముట్టడించడం వల్ల జరిగే లాభం ఏమీ లేదని, ఈ పాస్టర్ల ఉద్దేశం అక్కడ దళిత క్రైస్తవుల పై జరుగుతున్న దాడులను మరియు క్రైస్తవ చర్చిలను కూల్చడంపే నిరసనగా వెళ్లడం కోసం బయలుదేరారని, మరియు క్రైస్తవ చర్చలకు వెళితే ఎస్సీ హోదాను క్యాన్సిల్ చేయిస్తానని మీడియా సమావేశాలలో రఘురామ కృష్ణంరాజు మాట్లాడటం సరి కాదన్నారు.

## ఆపత్కాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండ

- ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్



నరసాపురం, ఏప్రిల్ 18 (మనం న్యూస్)ః అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాల వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం కష్ట కాలంలో ఎంతో ఉపశమనం కలిగిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పేర్కొన్నారు. శనివారం నరసాపురం, మొగల్తూరు మండలాలకు చెందిన 14 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ. 6,66,687 రూపాయలు విలువైన చెక్కులను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ స్వయంగా లబ్ధి దారుల నివాసాలకు వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తుంద ని అన్నారు. అనారోగ్యం పాలై ఆర్థిక ఇబ్బందులు కారణంగా సరైన వైద్య సదుపాయం అందనివారు తమ దృష్టికి తీసుకు వస్తే వారికి ప్రభుత్వపరంగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అవసరమైన ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యే నాయకర్ కు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట నియోజకవర్గ ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 20న జగ్గంపేటలో సీఎం జన్మదిన వేడుకలు



జగ్గంపేట ఏప్రిల్ 18:(మనం న్యూస్ )ః జగ్గంపేట స్థానిక రావులమ్మ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఈనెల 20వ తేదీన పుట్టినరోజు సందర్భంగా ఆయనకు ముందుగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని జగ్గంపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించి 500 మందితో మెగా రక్తదానం శిబిరం ఏర్పాటు చెయ్యడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడప భరత్, ఎస్వి ఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, దాపర్తి సీతారామయ్య, నకిరేడ్డి సూర్యవతి, కేసిరెడ్డి శ్రీను, ఆడప తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

## జనాభా స్వీయ గణన ఆన్లైన్లో పూర్తి చేసిన ప్రభుత్వ విప్



ముమ్మిడివరం, ఏప్రిల్ 18, మనం న్యూస్ః జనాభా సర్వే-2027 లో భాగంగా ప్రజలు స్వీయ గణన విధానాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా ఆన్లైన్లో గణన పూర్తి చేసి ప్రజలకు అవగాహన కల్పించారు.వివరాలు, పద్ధతులు తెలుసుకోవడానికి అధికారులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. గ్రామ, వార్డు స్థాయిలో సిబ్బంది సహకారంతో ప్రతి కుటుంబం ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. గణన ప్రక్రియ సులభంగా, పారదర్శకంగా జరుగుతుందని పేర్కొన్నారు. ఏప్రిల్ 16 నుండి 30వ తేదీ వరకు అందుబాటులో ఉండే వెబ్ పోర్టల్ ద్వారా ప్రజలు తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని చెప్పారు. అవసరమైతే గ్రామ/వార్డు సచివాలయాల్లో సహాయం అందిస్తారని తెలిపారు. డిజిటల్ విధానం ద్వారా సమయం ఆదా అవడంతో పాటు ఖచ్చితమైన డేటా సేకరణకు దోహదపడుతుందని శ్రీ దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని జనాభా గణనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.


## ఎమ్మెల్యేను సన్మానించిన తుమ్మలపల్లి

జగ్గంపేట ఏప్రిల్ 18:(మనం న్యూస్)ః ఇటీవల తెలుగుదేశం పార్టీ అత్యున్నత విభాగమైన పొలిట్ బ్యూరో సభ్యుడిగా జగ్గంపేట శాసనసభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూను అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించిన జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ మా తండ్రి సమానులైన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ రాజకీయ అనుభవం టిడిపి పార్టీకి మరింత బలం చేకూరుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాదారపు వీరబాబు,అనుకుల శ్రీకాంత్, అడబాల వీరబాబు, జ్యోతుల రాజు, గోపి, శ్రీను స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని జ్యోతుల నెహ్రూ కు శుభాకాంక్షలు తెలిపారు.



# కొండపల్లి బొమ్మల పండగ..

- కొండపల్లి బొమ్మల పండగ..
- అద్భుతం.. ఆనంద అంబరం
- వైభవంగా ప్రారంభమైన సాంస్కృతిక వారసత్వ ఉత్సవం
- ఏటా ఏప్రిల్ 18 నుంచి మూడు రోజుల పాటు కార్యక్రమాలు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్
- కళా పరిరక్షణకు, కళాకారుల సమగ్రాభివృద్ధికి గొప్ప సంకల్పమని వ్యాఖ్య
- పి.మీరాహుస్సేన్ ఖాన్.



(విజయవాడ,మనం బ్యూరో) కొండపల్లి కొండల గాలి తాకి.. కళగా మారిన పొణికి ముక్క.. హస్తకళాకారుని చేతిలో జీవం పోసుకొని రంగుల పూదోటలో విహరించిన మన అందాల బొమ్మ దేశం దాటి ప్రపంచం చూసి పులకించాలనే లక్ష్యంతో మన గర్వం మరింత ఎత్తుకు చేరాలనే ఆకాంక్షతో రాష్ట్ర పర్యాటక శాఖ, జిల్లా పర్యాటక ప్రాధికార సంస్థ, ఎన్టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో శనివారం కొండపల్లి ఎక్స్పీరియన్స్ సెంటర్ వద్ద కొండపల్లి బొమ్మల పండగ వైభవంగా ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు. కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు.. స్థానిక నేతలు, అధికారులతో కలిసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఎక్కడాలేని విధంగా ఏర్పాటు చేసిన కొండపల్లి బొమ్మల ఎక్స్పీరియన్స్సెంటర్తో పాటు కొండపల్లి బొమ్మలు, తోలుబొమ్మలు, కీలుబొమ్మల స్టాళ్లను సందర్శించి.. కళాకారులతో మాట కలిపి ఉత్సాహం నింపారు.ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని మన ఘనమైన 400 ఏళ్ల చరిత్ర కలిగిన కొండపల్లి బొమ్మల వారసత్వ సంపదను కాపాడుకుంటూ భావితరాలకు వెలకట్టలేని బహుమతిగా అందించాలనే ఉద్దేశంతో ఇది మొదలు ఈ పండగను ఏటా నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో హస్తకళల అభివృద్ధికి, హస్తకళాకారుల సంక్షేమానికి కృషిచేస్తున్నామన్నారు. మార్కెటింగ్ అవకాశాలు మెరుగుపడి, కళను ప్రపంచ వ్యాప్తం చేయాలనే ఉద్దేశంతో, ఐక్యంగా కళాకారుల సంక్షేమానికి బాటలు వేయాలనే సంకల్పంతో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19న 200-300 మంది కళాకారులతో మెగా కార్నివాల్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రామ్మోహనరావు (గాంధీ), కొండపల్లి ఆరట్స్ అండ్ క్రాఫట్స్ సొసైటీ ఛైర్మన్ సూర్యప్రకాశ్, సొసైటీ ప్రతినిధులు, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, రీజనల్ డైరెక్టర్ వైపీ ప్రసన్న, డీఈవో ఎల్.చంద్రకళ, జిల్లా యువజన సంక్షేమ అధికారి డా. కొల్లేటి రమేష్, మెప్మా పీడీ మురళీకృష్ణ, డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు పాల్గొన్నారు.



## దమ్మపేట ముత్యాలమ్మ తల్లి జాతర ప్రారంభం

దమ్మపేట, ఏప్రిల్ 18:(మనం న్యూస్): దమ్మపేటలో వేంచేసి ఉన్న ముత్యాలమ్మ తల్లి జాతర శనివారం ఊరు పెద్దలు అందరూ కలిసి గుడి చుట్టూ మామిడి తోరణాలతో రంగుల హరివిల్లుగా బాజా భజంత్రీలతో ముత్యాలమ్మ తల్లి జాతర కలశం పూజతో శనివారం ఉదయం ప్రారంభించినారు.పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేసినారు. కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నాయకులు.గ్రామ పెద్దలు, భక్తులు ఆలయ కమిటీ సభ్యులు. తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల కృషి ఫలితంగానే ఆరోగ్య సమాజం ఏర్పాటు

## మాతాశిశు మరణాల అదుపులో సేవలు అమోఘం

## చిరుదాన్యాలతో పోషకాహారలోపం అదిగమించవచ్చు

## స్మార్ట్ ఫోన్లను సద్వినియోగపరుచుకోండి

## భద్రాచలం ఎంఎల్ఏ డాక్టర్ వెంకట్రావు



చర్ల, ఏప్రిల్ 18 (మనం న్యూస్) : అంగన్వాడీల శ్రమ, కృషి ఫలితంగానే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోషణ్ పహాడ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కలివేరు గ్రామంలోని రైతు వేదిక వద్ద చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి కనపర్తి ఈదయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే అంగనవాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్ లను అందజేశారు. ఆడపిల్లల తల్లులకు బేటి జన్మోత్సవ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్ వాడి టీచర్లు, ఆయాల సేవలు అమోఘమని ప్రశంసించారు. దేశంలో ఎన్నికల నిర్వహణ, జనాభా లెక్కలు, ఇతర ముఖ్య కార్యక్రమాల్లో అంగన్వాడీ లు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అంగన్వాడీ లు చేస్తున్న పనులను ఎప్పటికప్పుడు స్మార్ట్ ఫోన్ ల ద్వారా ఆన్లైన్ చేసి మండలాన్ని జిల్లా స్థాయిలో ప్రధమ స్థానంలో నిలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. మాతా, శిశు మరణాలను తగ్గించడంలో అంగన్వాడీలు కీలక పాత్ర పోషిస్తున్నారని వెల్లడించారు. గతంలో 1000 మందికి 60 మాతృ మరణాలు సంభవించేవని ప్రస్తుతం వాటిని 27కు తగ్గించగలిగామని దీనిని సున్నాకు తగ్గించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. వైద్యారోగ్యశాఖను సమన్వయం చేసుకొని దానిని సాదించాలని సూచించారు. రక్తహీనత వలన అనేక దుష్ఫలితాలు ఉన్నాయని దీనిని అధిగమించాలంటే సరైన పోషకాహారం గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందించి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలన్నారు. ప్రజలు ఆరోగ్యకరంగా ఉన్నప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు. చిరు ధాన్యాలను ఆహార పదార్థాల్లో ఉపయోగించడం ద్వారా గర్భిణీలు, బాలింతలు చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందుతుందని పేర్కొన్నారు. అందుకే ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. అందుబాటులో ఉన్న అన్ని రకాల పదార్థాలతో పోషక విలువలతో కూడిన పౌష్టికాహారాన్ని తయారు చేసిన అంగన్వాడీ టీచర్లను ఆయన అభినందించారు. గర్భిణీ స్త్రీలకు ధనుర్వాతం, రక్తహీనత, గుర్రపువాతం వ్యాధులను పారద్రోలేందుకు ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. పౌష్టికాహార లోపం కారణంగా పిల్లలలో ఎదుగుదల, జ్ఞాపకశక్తి లోపం, మెదడు పెరుగుదల తగ్గటం వంటి అనేక రుగ్మతలు ఉన్నాయన్నారు. చిన్నారులకు గుండెల్లో చిల్లు పడటం వంటి వ్యాధులు సైతం పౌష్టికాహార లోపం కారణంగానే వస్తుందని, దీనిని అధిగమించాలంటే మంచి ఆహారంతో పాటు ఫోలిక్ యాసిడ్ మాత్రలను అందజేయాలని విజ్ఞప్తి చేశారు. మహిళ గర్భం దాల్చినప్పుడు తల్లికి మంచి ఆహారం అందిస్తే కడుపులో ఉన్న బిడ్డ కూడా ఆరోగ్యంవంతంగా ఉంటాడని వెల్లడించారు. ఆరోగ్యం ఉంటే దేశంలో పేదరిక నిర్మూలన జరుగుతుందని పేర్కొన్నారు. ఒక కుటుంబం అనారోగ్యం పాలైతే ఆ కుటుంబ ఆర్థికంగా వెనుక పడుతుందని, దీనిని నివారించాలంటే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలని, ఇందులో అంగన్వాడీ టీచర్లు కీలక భూమిక పోషించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిని లెనినా మాట్లాడుతూ పోషకాహార లోపంతో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనికి దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం పోషణ్ పహాడ్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమాలను అమలు చేసేందుకు ప్రస్తుతం ఇరవై ఒక్క రిజిస్టర్ లను టీచర్లు నిర్వహణ చేయాల్సి వస్తోందని వెల్లడించారు. ఇకపై రిజిస్టర్లు లేకుండానే ఈ సమాచారం మొత్తం స్మార్ట్ ఫోన్ లో నిక్షిప్తం చేసి జిల్లా, రాష్ట్రస్థాయిలకు పంపనున్నట్లు వెల్లడించారు. స్మార్ట్ ఫోన్లను అంగన్ వాడి టీచర్లు తమ వ్యక్తిగత, కుటుంభ అవసరాలకు వినియోగించవద్దని, ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేవలం దీనిని అంగన్వాడి సేవలకే ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, సిడిపిఓ చైతన్య, ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు, తేగడ సర్పంచ్ జమ్ముల మురళీకృష్ణ, కలివేరు సర్పంచ్ తెల్లం లక్ష్మణ్ రావు, అంగన్వాడీ సూపర్వైజర్లు స్వరూపరాణి, ఆదిలక్ష్మి, తేగడ పంచాయతీ కార్యదర్శి హర్షిణి, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాదరావు, నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బేజారై రోడ్డెక్కిన రైతన్న

## గోనె సంచుల కొరతతో గగ్గోలు

## కొనుగోలు కేంద్రాల వద్ద గందరగోళం

## పైరవీలు, అదనపు చెల్లింపుల ఆరోపణలు



కొణిజర్ల, ఏప్రిల్ 18(మనం న్యూస్): మండలంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద గోనె సంచుల కొరత, తేమ శాతం చూసే విషయంలో ఆలస్యం, లారీ లోడింగ్ కోసం ఎదురుచూపులు, టిక్కీలకు అదనపు చెల్లింపులు, రాజకీయ పైరవీలు వంటి సమస్యలు ఒకేసారి తలెత్తడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలతో విసిగిపోయిన రైతులు శనివారం మండల కేంద్రంలో రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. రైతులు చెబుతున్న వివరాల ప్రకారం, తేమ శాతం పరీక్ష కోసం కూడా రాజకీయ అండదండలు అవసరమవుతున్నాయని, ఎప్పుడు తమ పంట తేమ చూస్తారో అని ,గోనె సంచుల కోసం రోజులు తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, సంచులు అందకపోవడంతో బయట మార్కెట్లో అధిక ధరలకు కొనాల్సిన పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు.ఇక లోడింగ్ విషయంలో లారీలు ఎప్పుడు వస్తాయో తెలియక రైతులు నిరీక్షణలో ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.లారీ లోడింగ్ కోసం టిక్కీకి రూ.10 నుంచి 12 వరకు అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి ఉందని ఆరోపిస్తున్నారు. ఈ సమస్యలన్నింటితో రైతులు విసిగి బేజారైపోయిన పరిస్థితి నెలకొంది.

కొనుగోలు గణాంకాల ప్రకారం ఇప్పటి వరకు సుమారు 92,300 బ్యాగుల లోడింగ్ జరిగినప్పటికీ, అందులో సొసైటీ ద్వారా వచ్చిన సంచులు కేవలం 49,500 మాత్రమేనని, మిగిలినవి 42,500 రైతులే బయట కొనుగోలు చేసినట్లు సమాచారం. దీనిని బట్టి గోని సంచుల కొరత మనం అంచనా వేయవచ్చు.గోనె సంచుల పంపిణీ, లోడింగ్ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని రైతులు ఆరోపిస్తున్నారు.ముందుగా వచ్చిన రైతులను పక్కన పెట్టి, పైరవీలు ఉన్న వారికి ముందుగా లోడింగ్ చేయడం, గోనె సంచులు కూడా వారికే కేటాయించడం జరుగుతోందని అంటున్నారు. వరుస క్రమం పాటించకుండా రాజకీయ నాయకుల ప్రభావంతో అధికారులు పనిచేస్తూ, అందరికీ ఒకే విధానాన్ని అమలు చేయకుండా పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు.

ఇదిలా ఉంటే, గోనె సంచుల పంపిణీపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య కూడా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక గ్రామానికి ఎక్కువగా, మరొక గ్రామానికి తక్కువగా సంచులు ఇచ్చారని ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. గోనె సంచుల కేటాయింపులో గ్రామాల వారీగా తేడాలు ఉన్నాయన్న ఆరోపణలపై అధికారులను సంప్రదించగా, గ్రామాల వారీగా విడిగా డేటా నమోదు చేయలేదని, అన్ని గ్రామాల రైతులు తీసుకున్న సంచులను సమగ్రంగా మాత్రమే నమోదు చేశామని వారు వివరణ ఇచ్చారు. మరోవైపు, ఎకరాకు 45-50 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తున్నప్పటికీ, కొనుగోలు పరిమితులు రైతులకు భారంగా మారుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఎకరాకు 26 క్వింటాళ్ల పరిమితి మాత్రమే అమలు చేయడం రైతు తన పంటను అమ్మాలంటే ఒకొక్క రైతుకు రెండు ఎకరాలు ఉండాల్సిందే అని దీని మూలంగా రైతు మొత్తం పంట అమ్ముకో లేని పరిస్థితి అని వాపోతున్నారు.కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ, గోనె సంచులు, టోకెన్ విధానం, లోడింగ్ వ్యవస్థలో గందరగోళంగా ఉంది అని రైతులు సమస్యలతో నలుగుతుండగా అధికారులు మాత్రం స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ప్రారంభంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులకు ఉపశమనం కలుగుతుందని భావించినప్పటికీ, ప్రస్తుతం ఎదురవుతున్న సమస్యలతో ఆ ఆశలు ఆవిరైపోయాయని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి గోనె సంచుల సరఫరాను మెరుగుపరచడంతో పాటు పారదర్శక కొనుగోలు విధానం అమలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే రైతుల ఆందోళనలు మరింత తీవ్రమయ్యే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.

# మహిళా బిల్లుకు ఆమోదం




- డీలిమిటేషన్ బిల్లును సవరించాలి
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్

ఖమ్మం, ఏప్రిల్ 17(మనం న్యూస్): డీలిమిటేషన్ సవరించి అన్ని పార్టీల ఆమోదంతో బిల్లును ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్లమెంట్‌లో జరిగిన సంఘటనలో భాగంగా మహిళా రిజర్వేషన్ బిల్లును, డిలిమిటేషన్ బిల్లు రెండింటిని బిజెపి మోడీ ప్రభుత్వం హడావుడిగా దొడ్డిదారిన నెగ్గించేందుకు, మోసపూరిత ఆలోచన చేసి బిల్లును పాస్ చేయించుకునేందుకు కుట్ర పన్నిందని వారు ఆరోపించారు.

ఈ బిల్లును కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ నేతృత్వంలో అన్ని విపక్ష పార్టీలను కలుపుకొని జరిగే నష్టాన్ని వ్యతిరేకిస్తూ, విపక్ష పార్టీలను దేశంలో అన్ని రాష్ట్రాల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని దక్షిణాది రాష్ట్రాలకి, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా అందరి అభిప్రాయాలను సేకరించి, వారి సలహాలు తీసుకొని బిల్లు పెడితే ఎవరికి నష్టం జరుగకుండా చూడాలని వారన్నారు. గతంలోనే 2023లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు రాష్ట్రపతి ఆమోదముద్ర పొందిందని, వారు సంతకం చేశారని, ఆ ఆమోదముద్ర పొందిన బిల్లును మళ్లీ తీసుకొచ్చి విపక్ష పార్టీలను, దేశ ప్రజలను మోసం చేసే విధంగా ఎన్డిఏ వారు కుట్ర పన్నారని వారు దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కల్వకుంట్ల గోపాలరావు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తూములూరి లక్ష్మీ నరసింహారావు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కిలారు అనిల్ కుమార్, నగర కాంగ్రెస్ అధికార ప్రతినిధులు బూర్లె లక్ష్మీనారాయణ, ఏలూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులను అడ్డుకోవడం సిగ్గుచేటు

- కెవి కృష్ణారావు



ఖమ్మం, ఏప్రిల్ 18(మనం న్యూస్): ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని హైదరాబాద్ సెక్రెటరీ భవనం ముట్టడికి ఖమ్మం నుండి ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె వి కృష్ణారావు ఆధ్వర్యంలో బయలుదేరి వెళ్లారు. ఈ నెల 23వ తారీకు రెండు నెలల గడువు ముగుస్తున్నది ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతి పత్రం ఇవ్వడానికి వెళ్లిన తెలంగాణ ఉద్యమకారులను అరెస్టు చేయండని తీవ్రంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (రిజిస్టర్డ్) రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె వి కృష్ణారావు ఖండించారు. అరెస్టు చేసి వివిధ స్టేషన్లో పెట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి ఐడెంటి కార్డు ఇవ్వాలి, ఉద్యమకారులకు ప్రతి నెల స్వతంత్ర సమరయోధులకు ఇస్తున్నట్లు 25 వేల పెన్షన్ ఇవ్వాలి, తెలంగాణ ఉద్యమకారులకు నివాసయోగ్యమైన 250 గజాల స్థలం, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి, ప్రభుత్వము చట్టబద్ధత కలిగిన కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు బచ్చల పద్మాచారి, పగడాల నరేందర్, లింగానబోయిన సతీష్, బత్తిన మధు గౌడ్, నెలవెల్లి వెంకటేశ్వరావు, భుక్య శ్రీనివాస్ నాయక్, కొండ్రు రజనీకాంత్, అజ్మీరా వీరన్న, బానోతు రాంబాబు, గొట్టిపర్తి శ్రీనివాస్, గాలి రాము, ఇనుప శీను, కొట్టే ఉపేందర్, ఇనుప సుందర్రావు, పసుపులేటి శ్రీనివాస్, రాజు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## మంగ్లీపై ఆరోపణల్ని ఖండిస్తున్నాం..

### ప్రధాన నిందితుల్ని విచారించి బాధితులకు న్యాయం చేయాలి

### బంజారా అడ్వకేట్స్ అసోసియేషన్ నాయకులు భూక్యా హరినాయక్




ఖమ్మం, ఏప్రిల్ 18(మనం న్యూస్): బంజారా బిడ్డ, ప్రముఖ సింగర్ మంగ్లీపై కొంతమంది కావాలనే ఆరోపణలు చేస్తున్నారని, వాటిని ఖండిస్తున్నామని బంజారా అడ్వకేట్స్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాది భూక్యా హరినాయక్ పేర్కొన్నారు. ఖమ్మంలోని ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగ్లీపై ఘోరాతిఘోరమైన ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తప్పు జరిగిందని తెలిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలి, సాక్ష్యాలను చూపాలి. కోర్టు శిక్షిస్తుంది. అలాగాకుండా మీడియా సమావేశం పెట్టి చెప్పడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. మంగ్లీ భవిష్యత్‌ను దెబ్బతీసేందుకు జరుగుతున్న కుట్రలో భాగమే ఇదంతా అని ఆరోపించారు. ప్రధాన నిందితుడిని విచారించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. కంపెనీలో మంగ్లీ వాటా ఉందా, బోర్డు డైరెక్టర్‌గా ఉందా అనే విషయాలు తేలకుండా ఆమెపై ఎలా ఆరోపణలు చేస్తారని ప్రశ్నించారు. నిన్ను వదలనంటూ ఏకవచనంతో మాట్లాడడం సరికాదని, న్యాయవాద వృత్తికే సుబ్బారావు కళంకం తెస్తున్నాడని ఆరోపించారు. సాక్ష్యాలు ఉంటే పోలీసులకు అప్పగిస్తే వారే విచారణ జరుపుతారని అన్నారు. అలాగాకుండా బంజారా బిడ్డపై అవాస్తవమైన, అసత్యమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. ధరావత్ వీరన్న మాట్లాడుతూ మంగ్లీ ప్రతిష్టను దిగజార్చేందుకు కొంతమంది కుట్ర చేస్తున్నారని అన్నారు. తానే బాధితుల తరుపున ఉంటానని మంగ్లీ చెప్పిందనే విషయం గుర్తు చేసుకోవాలన్నారు. న్యాయవాది బాణోత్ మణిమాల మాట్లాడుతూ మంగ్లీపై ఆరోపణలు బంజారా జాతికి ఘోరమైన అవమానమన్నారు. బెట్టింగ్ యాప్స్‌లో ఉన్న వారిపై చర్యలు తీసుకోవడం చేతకాదని, ట్యాక్స్‌లకు కట్టకుండా తప్పించుకు తిరుగుతున్న వారిని ఏం చేయలేకపోతున్నారని, దేశంలో నెంబర్‌వన్ సింగర్‌గా ఎదుగుతున్న బంజారా బిడ్డపై మాత్రం అవాస్తవమైన ఆరోపణలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. లంబాడీలపై ఎందుకు కక్ష్య కట్టారని ప్రశ్నించారు. వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో ప్రచారం చేయవద్దని సూచించారు. మంగ్లీపై లేనిపోని ఆరోపణలు చేస్తే బంజారా జాతి చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ సమావేశంలో న్యాయవాదులు తేజావత్ నర్సింహ, ధరావత్ ప్రసాద్, సునావత్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



## నేడు బిఆర్ఎస్ మినీ ప్లీనరీని విజయవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు

దమ్మపేట, ఏప్రిల్ 18 (మనం న్యూస్): ఖమ్మం నగరంలో మమతా కాలేజ్ గ్రౌండ్స్ నందు నేడు 19.04.2026. సాయంత్రం ఐదు గంటలకు బిఆర్ఎస్ పార్టీ మినీ ప్లీనరీని నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. ఈ మినీ ప్లీనరీకి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట శాసనసభ్యులు శాసనసభ ప్రతిపక్ష నేత తన్నీరు హరీష్ రావు, ముఖ్య అతిథిగా హాజరవుతారు. అశ్వారావుపేట నియోజకవర్గం లోని అని మండలాల అధ్యక్షులు, టౌన్,గ్రామ పార్టీ అధ్యక్షులు,మాజీ ఎంపీపీ, మాజీ జడ్పిటిసిలు, సీనియర్ నాయకులు,మాజీ ఎంపీటీసీలు, మాజీ. పిఏసిఎస్ అధ్యక్షులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, విద్యార్థి,యువజన నాయకులు, వార్డ్ సభ్యులు, మాజీ వార్డు సభ్యులు, మహిళా నాయకులు, ఎస్సి, ఎస్టీ, బిసి, మైనారిటీ ముఖ్య నాయకులు, సోషల్ మీడియా నాయకులు, ఉద్యమకారులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ పాల్గొని ఈ మినీ ప్లీనరీని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రివర్యులు పువ్వాడ అజయ్‌కి ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బైటి రాజేష్, వాడే నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## యాసంగి వరి కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ వేణుగోపాల్



భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 18 (మనం ప్రతినిధి): యాసంగి 2025-26 ధాన్యం కొనుగోలు పై అదనపు కలెక్టర్ వేణుగోపాల్ కార్యాలయంలో శనివారం రైస్ మిల్లర్లు, ఎఫ్సీఐ అధికారులు సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, అప్రమత్తతతో నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో సుమారు 83 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు నాణ్యత ప్రమాణాల ప్రకారం పరిశీలించి, అర్హమైన ధాన్యానికి మాత్రమే కొనుగోలు పత్రాలు, టోకెన్లు జారీ చేయాలని సూచించారు. నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్లు రైతులు తెస్తున్న పి ఆర్-126 వరి రకం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పులు ఉన్న నేపథ్యంలో రైతులు ఎండల సమయంలో కేంద్రాలకు రాకుండా, వాతావరణం చల్లబడిన తర్వాత ధాన్యాన్ని తీసుకురావాలని అవగాహన కల్పించాలన్నారు. సంబంధిత అధికారులు వరి కొనుగోలు సిబ్బందికి శిక్షణ అందించి, సమన్వయంతో పని చేస్తూ కొనుగోలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు . ఈ సమావేశంలో డీఆర్డీఏ పీడీ విద్య చందన, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎ.ప్రేమ్ కుమార్, జిల్లా మార్కెటింగ్ అధికారి త్రినాథ్ బాబు, జిల్లా సహకార అధికారి రాజశేఖర్, ఎఫ్సీఐ అధికారులు వెంకట రమణ, పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వానకాలం సాగుకు పూర్తి సన్నద్ధత

## నాణ్యమైన విత్తనాల సరఫరాపై తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ దృష్టి




- జిల్లాలో 3 లక్షల ఎకరాల్లో వరి సాగు లక్ష్యం
- 30 వేల క్వింటాళ్ల విత్తనాల సరఫరా ప్రణాళిక
- వరితో పాటు పెసర, మినుము, కంది విత్తనాల సరఫరా
- ఖమ్మంలో డీలర్లు, సహకార సంఘాలతో సమీక్షలో చైర్మన్ అన్వేష్ రెడ్డి

ఖమ్మం, ఏప్రిల్ 18(మనం బ్యూరో): రాబోయే వానకాలం సీజన్ను దృష్టిలో ఉంచుకొని రైతులకు సమయానికి నాణ్యమైన విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో శనివారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ సమావేశ మందిరంలో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని విత్తన డీలర్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, రైతుల నుంచే విత్తనోత్పత్తి చేపట్టి, ఆధునిక ప్రయోగశాలల్లో నాణ్యత పరీక్షలు పూర్తి చేసిన తర్వాతే ధృవీకరిత విత్తనాలుగా మార్కెట్లో విడుదల చేస్తున్నామని తెలిపారు. దీని ద్వారా నకిలీ విత్తనాల సమస్య తగ్గి, రైతులకు మెరుగైన దిగుబడులు లభిస్తాయని అన్నారు. వానకాలం సీజన్కు సంబంధించి జిల్లాలో వరి సాగుకు సమగ్ర ప్రణాళిక రూపొందించామని, మార్కెట్లో డిమాండ్ ఉన్న బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, కెఎన్ఎం 1638 వంటి సన్న రకాలతో పాటు కెఎన్ఎం 118, ఎమ్టియు 1010 వంటి దొడ్డు రకాల విత్తనాలు కూడా సమృద్ధిగా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రభుత్వం అనుమతించిన, ధృవీకరించిన విత్తనాలనే విక్రయించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వరితో పాటు జిల్లాలో సాగు చేసే పెసర, మినుము, కంది పంటల విత్తనాలను కూడా సమృద్ధిగా సరఫరా చేస్తామని తెలియజేశారు. సహకార సంఘాల పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రస్తుతం పచ్చిరొట్ట విత్తనాల విక్రయంపైనే అధికంగా దృష్టి పెట్టి, ఇతర పంటల విత్తనాల పంపిణీలో వెనుకబడి ఉన్నారని చెప్పారు. అన్ని రకాల విత్తనాలు రైతులకు సులభంగా అందేలా సేవాభావంతో పాటు వాణిజ్య దృక్పథంతో పనిచేయాలని సూచించారు. ఖమ్మం జిల్లాలో సుమారు 3 లక్షల ఎకరాల్లో వరి సాగు లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకు అనుగుణంగా కనీసం 30 వేల క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వ సంస్థ ద్వారా సరఫరా చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ వానకాలం సీజన్‌కి కావలసిన పచ్చిరొట్ట విత్తనాలను (జీలుగ, జనుము, పిల్లిపెసర) సకాలంలో కావలసినంత పరిమాణంలో సరఫరా చేస్తామని తెలియజేశారు. అలాగే త్వరలో అమలులోకి రానున్న నూతన విత్తన చట్టం రైతులతో పాటు నిజాయితీ గల డీలర్ల ప్రయోజనాలను కాపాడుతుందని పేర్కొన్నారు. కల్తీ విత్తనాల నియంత్రణ ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ చట్టం లక్ష్యమని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి, సహాయ వ్యవసాయ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు, విత్తన డీలర్ల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# అమర రాజా విద్యాలయంలో ఘనంగా దశాబ్ది ఉత్సవాలు





తవణంపల్లి, ఏప్రిల్ 18, మనం న్యూస్ : నిరుపేద గ్రామీణ విద్యార్థిని విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో విద్యాభ్యాసాన్ని అందిస్తున్న తవణంపల్లి మండలం దిగువ మాఘం గ్రామంలోని అమరరాజా విద్యాలయం తన విద్యా ప్రస్థానంలో ఒక విశిష్ట మైలురాయిని చేరుకుంటూ, స్థాపనకు పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ, గల్లా రామచంద్ర నాయుడు అమర రాజా సంస్థలను స్థాపించి జిల్లాలో అనేకరకాల సేవల అందిస్తున్నారు, ఇందులో భాగంగా విద్యాసంస్థలు స్థాపించి నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విలువలతో కూడిన విద్యను అందిస్తున్నారు, విద్య అనేది వ్యక్తిత్వ వికాసానికి మూలస్తంభం, విద్యార్థులు క్రమశిక్షణ, నిబద్ధతతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని కావున విద్యార్థులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

అమర రాజా ఫౌండర్ చైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యను విస్తరించడం ద్వారా సమాజ అభివృద్ధికి దోహదపడటం మా కట్టుబాటు అని తెలిపారు.

అమర రాజా అడ్వాన్స్డ్ సెల్ టెక్నాలజీస్ మాజీ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి విజయానంద్ మాట్లాడుతూ, అమర రాజా విద్యాలయం కేవలం విద్య బోధనకే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించే సమగ్ర విద్యను అందిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో అంతర్జాతీయ ప్రమాణాల విద్యను అందించడం మా లక్ష్యం అని తెలిపారు.

అమర ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డా. గౌరీనేని రమాదేవి మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అకాడమిక్ విద్యతో పాటు సాంస్కృతిక, నైతిక విలువల పెంపకం అత్యంత అవసరం. అమరరాజా విద్యాలయం ఆ దిశగా ఆదర్శంగా నిలుస్తోంది అని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆలోచించాయి. పాటలు, నృత్యాలు, నాటికలు భారతీయ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తూ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి.

ఈ కార్యక్రమంలో రాజన్న ఫౌండేషన్ హెడ్ రాళ్లపల్లి సతీష్, పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. జయశ్రీ, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, స్థానిక ప్రజలు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పాత, కొత్త చట్టాల మధ్య తేడాలను గ్రహించి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి







- ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నినాల జయసూర్య

చిత్తూరు, ఏప్రిల్ 18, మనం న్యూస్ : వర్క్షాప్లను సద్వినియోగం చేసుకుని పాత చట్టాలు మరియు కొత్త చట్టాల మధ్య తేడాలను గ్రహించి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి మరియు చిత్తూరు జిల్లా పరిపాలన న్యాయమూర్తి శ్రీ.జస్టిస్ నినాల జయసూర్య ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయాధికారులకు సూచించారు.

శనివారం ఉదయం స్థానిక చిత్తూర్ జిల్లా కోర్ట్ సముదాయం లో జస్టిస్ ఎన్ .జయసూర్య, న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి మరియు చిత్తూరు జిల్లా పరిపాలనా న్యాయమూర్తి అధ్యక్షతన, అరుణ సారిక ఉమ్మడి చిత్తూర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి అద్వర్యం లోఉమ్మడి చిత్తూర్ జిల్లా న్యాయమూర్తుల వర్క్షాప్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథి జస్టిస్ నినాల జయసూర్య గారు మాట్లాడుతూ, నూతన క్రిమినల్ చట్టాల అమలు నేపథ్యంలో న్యాయాధికారులు ఎదుర్కొనే సందిగ్ధతలను తొలగించేందుకు ఈ వర్క్షాప్ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. పాత చట్టాలు మరియు కొత్త చట్టాల మధ్య తేడాలను లోతుగా అధ్యయనం చేసి, వాటిని నిత్య న్యాయ కార్యక్రమాల్లో సరైన విధంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవ్యవస్థలో నిర్ణయాలు తీసుకునేటప్పుడు చట్టాలపై స్పష్టమైన అవగాహనతో పాటు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు ఇవ్వాలని, భయపడకుండా ఆలోచనాత్మకంగా తీర్పులు ఇవ్వాలని ఆయన సూచించారు. తుదినిర్ణయం ఉన్నత న్యాయస్థానాలదే అయినప్పటికీ, ప్రతి న్యాయాధికారి తన స్థాయిలో న్యాయబద్ధమైన నిర్ణయాలు ఇవ్వడం ముఖ్యమన్నారు.

వర్క్షాప్లు న్యాయాధికారుల నైపుణ్యాభివృద్ధికి ముఖ్య వేదికలని పేర్కొంటూ, ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

చిత్తూరు ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ..నూతన క్రిమినల్ చట్టాల అమలుకు సంబంధించి న్యాయాధికారులకు స్పష్టమైన మరియు నూతన చట్టాల పై అవగాహన కల్పించడం ఈ వర్క్షాప్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రస్తుత క్రిమినల్ చట్ట వ్యవస్థ నుండి నూతనంగా అమలులోకి వచ్చిన చట్టాలకు మార్పు నేపథ్యంలో పలు కీలక అంశాలపై చర్చలు జరగనున్నట్లు పేర్కొన్నారు.క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ మరియు భారతీయ నాగరిక సురక్షా సంహిత మధ్య సంబంధం, భారతీయ సాక్ష్యాధినియమం మరియు ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ మధ్య తేడాలు వంటి అంశాలు చర్చకు తీసుకోబడినట్లు వివరించారు.

# తిరుమలేశుని భక్తులకు తిరునామధారణ



## ''తిరునామ''సేవలో తరిస్తున్న శ్రీవారి సేవకులు

తిరుమల, ఏప్రిల్ 18,మనం న్యూస్ : తిరు అంటే 'శ్రీ', నామం అంటే 'తిలకం'. తిరునామాన్ని శ్రీనామం అని కూడా అంటారు. హైందవ సనాతన ధర్మంలో తిరునామాన్ని శుభసూచికంగా భావిస్తారు. తిరునామం సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరస్వామి వారికి ప్రతీక.

తిరునామాన్ని ధరించిన భక్తులకు భగవంతుడు మనకు తోడుగా, అండగా ఉన్నాడన్న భావన కలుగుతుంది. సత్ప్రవర్తనతో, భక్తిభావంతో మెలగుతారు. ప్రపంచ ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన తిరుమలలో ఇలాంటి భక్తిసంప్రదాయాన్ని పెంచేందుకు టిటిడి భక్తులకు తిరునామధారణ చేయిస్తోంది.తిరునామంలో ఎర్రటికాంతిలా కనిపించే ఆకారం ఆత్మను సూచిస్తుంది. కొంత మంది భక్తులు భుజాలు, ఛాతిపైన, వీపుపై కింది భాగాన తిరునామం ధరిస్తారు. భక్తులు కనుబొమల మధ్య నుంచి నుదుటిపై వరకు ధరిస్తారు. తిరునామం ధరించినవారు శ్రీవేంకటేశ్వరుని సేవకులని సులువుగా గుర్తించవచ్చు. నుదుటన గల ఆగ్నేయచక్రంలో తిలకధారణ చేసుకుంటే చెడుదృష్టి పడకుండా ఉంటుందని భక్తుల నమ్మకం. తిరునామం కోసం నామకోపు, ఎర్రసింధూరం వినియోగిస్తున్నారు. తిరునామం పెట్టుకుంటే చలువ చేస్తుందని కూడా కొందరు భక్తుల అభిప్రాయం. తిరునామధారణ కోసం ప్రత్యేకంగా రాగితో తయారుచేసిన కప్పు, మూడు నామాల ముద్రను ఉపయోగిస్తారు.

### శ్రీవారి ''తిరుమణికాప్పు''

శ్రీవారి మూలమూర్తికి శుక్రవారం అభిషేకం తరువాత వారానికి ఒకసారి మాత్రమే చందనం పొడి, కర్పూరం, మధ్యలో కస్తూరితో తిరునామం దిద్దుతారు. గురువారం సడలింపు(ఆభరణాలు తొలగించే) సమయంలో నేత్రాలు భక్తులకు కనిపించేలా తిరునామాన్ని కొంతమేర తగ్గిస్తారు. పవిత్రతకు ప్రతీకగా కనిపించే ఈ తిరునామం శ్రీవారి ముఖారవిందాన్ని మరింత తేజస్సుతో ఆవిష్కరిస్తూంటుంది. ఈ నామాన్ని 'తిరుమణికాప్పు' అని అంటారు. ఇందుకుగాను 16 తులాల పచ్చ కర్పూరం, ఒకటిన్నర తులం కస్తూరిని ఉపయోగిస్తారు.

### ₹తిరునామ సేవ :

తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1లో రూ.300/- ప్రత్యేక ప్రవేశ దర్శన ప్రవేశ మార్గం, శ్రీవాణి దర్శన ప్రవేశ మార్గం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2లో సర్వ దర్శనం భక్తులకు, అదేవిధంగా గొల్ల మండపం, రామ్ భగీచా- 3, బేడి ఆంజనేయస్వామి ఆలయం, కల్యాణకట్ట, సుపథం, వరాహస్వామివారి ఆలయం, నాలుగు మాడ వీధులు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రం, సప్తగిరి విశ్రాంతి గృహం, జీఎన్సీ, నందకం విశ్రాంతి గృహం, లేపాక్షి సర్కిల్, ఏటీజీహెచ్, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రం పరిసర ప్రాంతాల్లో భక్తులకు తిరునామధారణ జరుగుతోంది. ఇందుకోసం రోజుకు రెండు షిఫ్టుల్లో దాదాపు 168 మంది శ్రీవారి సేవకులు సేవలందిస్తున్నారు.

తిరునామం ధరించేందుకు భక్తులు ఎలాంటి పైకం చెల్లించాల్సిన అవసరం లేదు. శ్రీవారి సేవకుల ద్వారా పూర్తిగా ఉచితంగా అందిస్తున్న తిరునామాన్ని ధరించి స్వామివారి కృపా, కటాక్షాలకు పాత్రులు కావాలని టీటీడీ భక్తులకు విజ్ఞప్తి చేయడమైనది.

# 100 రోజుల యాక్షన్ ప్లాన్‌తో పనులు

- జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్
- నీటి సంరక్షణకు సాగునీటి సంఘాల ద్వారా పటిష్ట పరిచి భూగర్భ జలాలను పెంచే విధంగా చర్యలు
- ఎమ్మెల్యే పులివర్తి నాని



తిరుపతిటౌన్,ఏప్రిల్ 18,మనం న్యూస్ : భూగర్భ జలాలను పెంపొందించడం మరియు నీటి భద్రతను బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం 'జలధార-జలహారతి'. 100 రోజుల యాక్షన్ ప్లాన్తో పనులు చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం స్థానిక చంద్రగిరి నియోజకవర్గం పేరూరు చెరువు వద్ద స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జలధార జలహారతిలో ఎం ఎల్ ఎ పులివర్తి నాని తో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్..

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. భూగర్భ జలాలను పెంపొందించడం మరియు నీటి భద్రతను బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం 'జలధార-జలహారతి'. 100 రోజుల యాక్షన్ ప్లాన్తో పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేసి జిల్లా వ్యాప్తంగా చెరువుల పునరుద్ధరణ, చెక్డ్యామ్ల నిర్మాణంపై ఈ కార్యక్రమం దృష్టి పెడుతుందనీ అన్నారు. ప్రభుత్వం జల వనరుల శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా నీటి నిల్వలు పెరిగి... వ్యవసాయానికి, త్రాగునీరుకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు..

ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్నది ఎండాకాలం... వేసవి తాపానికి ప్రజలు, రైతులు ఇబ్బంది పడకూడదన్న ముందస్తు జాగ్రత్తలు భాగంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందన్నారు.. 100 రోజులు నిర్వహించే ఈ కార్యక్రమంలో చెరువులను, నీటి కుంటలను కాపాడుకుంటూ నీటి వనరులను పెంచుకోవడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు.

చెరువు కట్ట సంరక్షణకు జల వనరుల శాఖ అధికారులకు కొన్ని సూచనలు సలహాలు కలెక్టర్, ఎమ్మెల్యే ఇవ్వడం జరిగింది.

స్వయంగా ఎమ్మెల్యే ద్విచక్ర వాహనంలో కలెక్టర్ గారిని ఎక్కించుకొని చెరువుగట్టు పరిసర ప్రాంతాలను పరిశీలించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, జల వనరుల శాఖ ఈ ఈ వెంకటేశ్వర ప్రసాద్, సాగునీటి సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనలో ప్రతి పౌరుడి పాత్ర కీలకం

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



చిత్తూరు, ఏప్రిల్ 18,మనం న్యూస్ : రాష్ట్రాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పట్ల బాధ్యతతో ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్లో ఆవరణలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతీ నెల మూడో శనివారం ఒక థీమ్తో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని చేపడుతున్నాం. ఈ వారం జల హారతి- జలధార థీమ్తో కార్యక్రమాన్ని చేస్తున్నాం.

వంద రోజుల కార్యాచరణ ద్వారా భూగర్భజలాలు పెంచటంతో పాటు స్వచ్ఛమైన వాతావరణం సాధిద్దాం అని పేర్కొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడం, వ్యక్తిగతంగా మరియు సామూహికంగా శ్రమదానం చేయడం ద్వారా స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర సంకల్పాన్ని సాకారం చేయవచ్చని తెలిపారు. నేను, నా పరిసరాల పరిశుభ్రత కొరకు ప్రతి రోజు కొంత సమయం కేటాయిస్తూ, నా వంతు కృషిగా స్వచ్ఛత కార్యక్రమాలలో శ్రమదానం చేస్తాను. ఈ రోజు నేను వేసిన ముందడుగు ఆంధ్రప్రదేశ్ను పరిశుభ్రంగా ఉంచడంలో దోహదపడుతుందని నమ్ముతున్నాను. ఇకపై నా తోటి వారికి కూడా 'స్వచ్ఛత' పై అవగాహన కల్పిస్తూ, భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన, సుభిక్షమైన, ఆనందకరమైన ఆంధ్ర రాష్ట్రాన్ని అందించేందుకు కట్టుబడి ఉంటాను అని ప్రమాణం చేస్తున్నానన్నారు. జిల్లాలోని ప్రజలు, యువత, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖలు కలిసి పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వామ్యమవ్వాలని, ప్రతి గ్రామం, ప్రతి వీధి పరిశుభ్రంగా ఉండేలా సమిష్టి కృషి చేయాలని సూచించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞను అందరితో చేయించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ ఓ కె.మోహన్ కుమార్, జిల్లా అధికారులు, కలెక్టరేట్లోని అన్ని సెక్షన్ల సూపర్డెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# మెరిట్ విద్యార్థులను సన్మానించిన రమేష్, దొరబాబు

కాట్రేనికోన ఏప్రియల్ 18 మనం ప్రతినిధి : ప్రభుత్వ కళాశాలలో చదివి మంచి మార్కులు సాధించిన విద్యార్థినీ డేగల రత్నశ్రీ,విద్యార్థి ముళ్ళ సత్యనారాయణ ను ఉప్పూడి గ్రామ మాజీ సర్పంచ్ రంబాల రమేష్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులురంబాల దొరబాబు అభినందించి శాలువా లతో సన్మానించి వారికి సీల్ లను బహుకరించారు.శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమం లో రంబా ల రమేష్ మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబంలో జన్మించి ప్రభుత్వ కళాశాలలో చదువుకుని మంచి మార్కులను సాధించి గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకొచ్చారని కొనియాడారు. ఇంటర్మీడియట్ పరీక్షలో డేగల రత్నశ్రీ 976 మార్కులు ముళ్ళ సత్యనారాయణ 962 మార్కులను సాధించి వారి ప్రతిభను చాటుకున్నారన్నారు. ఇలాంటి మరెన్నో అద్భుతాలతో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆయన ఆశీర్వదించారు.భవిష్యత్ లో వారికీ అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. గ్రామస్తులు రమేష్, దొరబాబు సేవా కార్యక్రమాలని అభినందించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మాగాపు పట్టాభి,పోలిశెట్టి నాగబాబు,జొన్నాడ రాజారావు, ర్యాలీ బద్రి, సురేష్ తదితరు పాల్గొన్నారు.



# పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంపీడీఓ

## స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణ ఆంధ్ర లో పాల్గొన్న ఎంపీడీఓ, తహసీల్దార్

కాట్రేనికోన,ఏప్రిల్ 18 మనం ప్రతినిధి : మండల పరిధిలో ని కాట్రేనికోన, పల్లంకుర్రు గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలు శనివారం ఎంపీడీఓ బి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో భాగంగా ర్యాలీ, స్వచ్ఛ ప్రతిజ్ఞ మంచినీటి వనరుల క్లోరినేషన్ నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్యానికి అగ్ర పీఠం వేయాలని కార్యదర్శులు, సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పల్లంకుర్రు గ్రామ పంచాయతీ అంగన్వాడీ కేంద్రాన్ని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు.చిన్నారుల అభ్యసనా సామర్థ్యలను పరిశీలించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని,అభ్యసనా సామర్థ్యలను మెరుగు పరచాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు జె వి సత్యన్నారాయణ, రామారావు, స్వర్ణ గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. మండలం లోని అన్ని పంచాయతీ లలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు.కందికుప్ప గ్రామ ప్రత్యేక అధికారి మరియు తహసీల్దార్ ఆధ్వర్యంలో పంచాయతీ చెరువు వద్ద ' స్వర్ణాంధ్ర -స్వచ్ఛంద్ర ' కార్యక్రమం ద్వారా నీటి సంరక్షణ పై అవగాహన ర్యాలీ మరియు ప్రతిజ్ఞ చేయడం జరిగింది.కార్యక్రమం లో తహసీల్దార్ రవి కిరణ్, పంచాయతీ కార్యదర్శి వెంకన్న తదితరులు పాల్గొన్నారు. కాట్రేనికోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీడీఓ బి రాజేశ్వర్ రావు సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థినీ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.ప్రతీ విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచి విద్యార్థుల ఉన్నతికి బాటలు వేయాలని ప్రధానోపాధ్యాయులను సూచించారు.నాణ్యమైన విద్య అందించాలని హితవు పలికారు.కార్యక్రమం లో ఎం ఈ ఓ వెంకట రమణ, పాఠశాల హెచ్ ఎం ఆర్ అంబ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.కాట్రేనికోన గ్రామ పంచాయతీ, వేట్ల పాలెం, అడివి పేట గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తిన నేపథ్యంలో సదరు గ్రామాలను ఎంపీడీఓ బి రాజేశ్వర్ రావు క్షేత్ర స్థాయిలో పర్యటించి యుద్ధ ప్రాతిపదికన పైపులైను పనులను పరిశీలించి సత్వర చర్యలు తీసుకున్నారు కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జె వి సత్యన్నారాయణ, సురేష్ బాబు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆక్వా ట్రాన్ నిర్మాణ పనులు పరిశీలించిన కలెక్టర్ మహేష్ కుమార్



ముమ్మిడివరం, ఏప్రిల్ 18 : మనం ప్రతినిధిః కోనసీమ వంటి అధిక వర్షపాతం మరియు తేమ ఉన్న ప్రాంతాల్లో ఆక్వా ట్రాన్ పద్ధతి గురుకుల పాఠశాలలకు అత్యంత అనువైనదని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు శనివారం మండల పరిధిలోని తానే లంక సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్మిస్తున్న ఆక్వా ట్రాన్ విధానంలో నీటిని మలాన్ని విడదీసి నీటిని శుద్ధి చేసే ప్లాంట్ నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడు తూ కోనసీమ ప్రాంతంలోని విద్యార్థిని విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న గురుకుల పాఠశాలల్లో సెప్టిక్ ట్యాంకులు త్వరగా నిండిపోవడం అనేది ఒక ప్రధాన సమస్యగా మారిం దన్నారు దీనికి ప్రధాన కారణం మరుగుదొడ్ల నుండి వచ్చే వ్యర్థాలతో పాటు విపరీతమైన నీరు కూడా ట్యాంకులలోకి చేరడం కారణమన్నారు. సెప్టిక్ ట్యాంకులోకి వెళ్లే నీటిని మధ్యలోనే మళ్లించి, మలాన్ని విడదీసి నీటిని శుద్ధి చేసి మొక్కలకు పంపే ఈ ఆధునిక ఆక్వా ట్రాన్ విధానంలో 11 యూనిట్ల ను రూ కోటి 10 లక్షలతో నిర్మిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ మురికి నీటి విభజన చేసిన పిదప మలాన్నిసెపరేట్గా విడదీసి ట్యాంకులకు మళ్లించి సేంద్రియ ఎరువుగా మార్చ డం జరుగుతుందన్నారు. దీనిని నేరుగా మొక్కలకు వాడుకోవచ్చునన్నారు . అనంతరం ముమ్మిడివరం సి హెచ్ సి ని ఆయన సందర్శించి నాబార్డ్ నిధులు తో చేస్తున్న పనులను పూర్తి చేయాలని ఆదేశించారు పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరచాలని ఆదేశిం చారు ఆరోగ్య కేంద్రం నవీకరణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు ఈ కార్యక్ర మంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్సీ ఏవీఎస్ రాజన్, డి సి హెచ్ ఎస్ కార్తీక్, డి ఈ లు రాంప్రసాద్, రాజేంద్ర సుబ్బరాజు, జే ఈ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# తుపాకులతో వచ్చి.. 20 నిమిషాల్లో బ్యాంకు చోరీ



**భోపాల్, ఏప్రిల్ 18 :** మధ్యప్రదేశ్ లో భారీ చోరీ జరిగింది. ఓ బ్యాంకులోకి చొరబడిన నిందితులు.. నగలు, రూ.35 లక్షల నగదుతో పరారయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌లోని సింగ్రౌలిలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శాఖలోకి శుక్రవారం మధ్యాహ్నం ఐదుగురు సాయుధులు చొరబడ్డారు. బ్యాంకు సిబ్బంది, వినియోగదారులను తుపాకులతో బెదిరించి బంధించారు.
అనంతరం కేవలం 20 నిమిషాల్లోనే బంగారం, వెండి, నగదుతో ఉడాయించారు. మొదట ఇద్దరు వ్యక్తులు వినియోగదారులుగా నటిస్తూ.. బ్యాంకులోకి వచ్చినట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. వారు తుపాకులు తీసి, అక్కడి వారిని బెదిరిస్తుండగా.. మరో ముగ్గురు బ్యాంకులోకి చొరబడ్డారు. వారు పలు రౌండ్లు కాల్పులు జరుపుతూ.. లాకర్ల తాళాలు, నగదు నిల్వలు ఇవ్వమని బ్రాంచ్ మేనేజర్‌ను డిమాండ్ చేశారు. అందుకు అంగీకరించకపోవడంతో అతడిపై దాడి చేసి, తాళాలు లాక్కొని డబ్బు, నగదుతో పరారయ్యారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, సీసీటీవీ ఫుటేజీ సాయంతో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# మహిళా రిజర్వేషన్లను కాంగ్రెస్, డీఎంకేలు అడ్డుకున్నాయి: మోదీ



**కోయంబత్తూర్, ఏప్రిల్ 18 :** మహిళా రిజర్వేషన్ల కోసం ఎంతో కృషి చేసినప్పటికీ.. దురదృష్టవశాత్తూ ఫలితం లేకుండా పోయిందని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. డీఎంకే, కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు తమ నీచ రాజకీయాల కోసం దీనిని లక్ష్యంగా చేసుకుని అడ్డుకున్నాయని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తమిళనాడులోని కోయంబత్తూరులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ ఈ మేరకు ప్రసంగించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ ద్వారా తమిళనాడుకు మరిన్ని సీట్లు రావాల్సి ఉండగా డీఎంకే అలా జరగాలని కోరుకోలేదన్నారు. సాధారణ కుటుంబాల మహిళలు పార్లమెంటు, అసెంబ్లీలకు రావాలని తాను కోరుకున్నానని, మహిళా రిజర్వేషన్ల క్రెడిట్‌ను ప్రతిపక్షాలే తీసుకోవాలని కూడా చెప్పినట్లు గుర్తుచేశారు. సాధారణ మహిళలు ఎదగడాన్ని చూసి డీఎంకే, కాంగ్రెస్‌లు ఎందుకు ఓర్చుకోలేకపోతున్నాయని ప్రశ్నించారు. ఈ పార్టీలూ అధికారం తమ కుటుంబానికే పరిమితం కావాలని కోరుకుంటున్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లపై తమ పోరాటం ముగిసిపోలేదని, ఇది ఆరంభం మాత్రమేనన్నారు. మహిళా హక్కుల కోసం బీజేపీ, ఎన్డీయేల పోరాటం కొనసాగుతుందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు.

# అమెరికా యుద్ధ విమానాన్ని నడిపిన ఐఏఎఫ్ చీఫ్





**వాషింగ్టన్, ఏప్రిల్ 18 :** అమెరికా పర్యటన సందర్భంగా భారత వైమానిక దళం చీఫ్ అమర్ ప్రీత్ సింగ్ ఎఫ్-15 ఈఎక్స్ ఈగల్-ఐఐ యుద్ధ విమానాన్ని నడిపారు. నెవడా వైమానిక స్థావరంలో యూఎస్ వైమానిక దళ మేజర్ మాథ్యూ బెన్సన్‌తో కలిసి అమర్ ప్రీత్ సింగ్ యుద్ధ విమానాన్ని నడుపుతున్న ఫొటోలు తాజాగా బయటకు వచ్చాయి. ఎఫ్-15ను నడపడం ద్వారా ఆ విమాన సామర్థ్యాలను, ఆధునిక యుద్ధాల్లో దాని పాత్రను అమర్ ప్రీత్ సింగ్ మరింత అర్థం చేసుకోగలిగారని అమెరికా సైనిక అధికారులు వెల్లడించారు. ఈ పర్యటనలో భాగంగా ఐఏఎఫ్ చీఫ్.. అమెరికా వైమానిక దళ యుద్ధ కేంద్రం కమాండర్ బ్రిగేడియర్ జనరల్ డేవిడ్ సి ఎప్పర్సన్‌తో సహా ఆ దేశ వైమానిక దళంలోని సీనియర్ అధికారులతో చర్చలు జరిపారు. ఏప్రిల్ 10న జరిగిన ఈ భేటీలో ఇరుదేశాల వైమానిక దళాల మధ్య సంయుక్త విన్యాసాలను విస్తరించడం, అధునాతన సాంకేతికతలు, యుద్ధ వ్యవస్థలపై పరస్పర అవగాహనను పెంచుకోవడం వంటి వాటిపై చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. భారత వైమానిక దళం మరిన్ని ఆధునిక ఆయుధాలను పొందే ప్రయత్నాలకు తమ వైమానిక దళం మద్దతుగా ఉంటుందని యూఎస్ జనరల్ విల్స్‌బాచ్ పేర్కొన్నారు. అమెరికా వద్ద ఉన్న అత్యాధునిక యుద్ధ విమానాల్లో ఎఫ్-15 ఈఎక్స్ ఈగల్-ఐఐ ఒకటి. దీనిని బోయింగ్ సంస్థ తయారుచేసింది. ఇర్రా దాడులు చేయడానికి అగ్రరాజ్యం ఈ విమానాలనే వినియోగించింది. ఈ విమానం మాక్ 2.5 గరిష్ఠ వేగంతో ప్రయాణిస్తుంది. 13,381 కిలోగ్రాముల వరకు పేలోడ్‌ను మోయగలదు.

# ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌పై ట్రంప్ ప్రశంసలు



**వాషింగ్టన్, ఏప్రిల్ 18 :** ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరణ్‌జీత్ సింగ్ సంధూపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసలు కురిపించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ట్రూత్ వేదికగా పోస్టు చేశారు. 'ఢిల్లీ కొత్త లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమితులైన తరణ్‌జీత్ సింగ్ సంధూకి అభినందనలు. అమెరికా మాజీ రాయబారిగా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడేందుకు తరణ్‌జీత్ ఎంతో నిబద్ధత కనబరిచారు' అని రాసుకొచ్చారు. సంధు నేతృత్వంలో ఢిల్లీ మరింత అభివృద్ధి సాధించాలని ట్రంప్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనతో దిగిన ఫొటోను కూడా పంచుకున్నారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌గా తరణ్‌జీత్ మార్చి 11న బాధ్యతలు స్వీకరించిన విషయం విదితమే.

# ఏఐతో ఆందోళనలు వద్దు

## సీజేఐ జస్టిస్ సూర్యకాంత్



**ఢిల్లీ, ఏప్రిల్ 18:** కృత్రిమ మేధ అన్ని రంగాల్లోకి శరవేగంగా విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో న్యాయవ్యవస్థలో ఏఐ వినియోగంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్(ఇఒఐ) కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయవ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించాలంటే అంతర్గత పరిమితులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. కర్ణాటక స్టేట్ జ్యుడిషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఏఐ గురించి భయపడొద్దని న్యాయాధికారులకు సూచించారు. ''టెక్నాలజీ అనేది సలహాలు ఇవ్వడంలో ఉపయోగపడుతుంది. అది మనుషులకు ప్రత్యామ్నాయం కాదు. న్యాయవ్యవస్థలో కృత్రిమ మేధ(ఏఐ)ను అనుసంధానం చేయాలంటే సమతుల్యతను పాటించాలి. అంటే ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే, న్యాయ సంబంధిత విషయాల్లో మానవ మేధస్సు, అనుభవాన్ని ఉపయోగించాలి'' అని సీజేఐ అన్నారు. ''క్లిష్టమైన ప్రశ్నలతో ఉన్న ఓ కేసు మీ ముందుకు వస్తే మీరేం చేస్తారు?ఆ సమస్యను పరిష్కరించడానికి మరింత సమయం వెచ్చించి, ఆలోచిస్తారు. ఓపిగ్గా పనిచేస్తారు. అలాంటి కేసును పరిష్కరించాక గొప్ప అనుభూతి పొందుతారు. ఇలాంటి విషయాల్లో ఏఐ సామర్థ్యం సరిపోకపోవచ్చు. అందువల్ల మీరు భయపడాల్సిన పనిలేదు. న్యాయాధికారులు ఉత్పాదకతను మెరుగుపరచడానికి తగిన శిక్షణ తీసుకుంటారు. ఎక్కువ సమయం కేటాయించి, శ్రద్ధతో, సమర్థవంతంగా పని చేయగలరు'' అని సీజేఐ పేర్కొన్నారు. ''ఏఐ డేటా ఆధారంగా పని చేస్తుంది. మనుషులకు ఉండే విచక్షణా శక్తి దానికి ఉండదు. అలాగే నిర్ణయాలు తీసుకునేటప్పుడు మనుషుల్లా ఆలోచించలేదు. నైతిక విలువలు, సామాజిక కోణాలతో మమేకమై నిర్ణయాలు తీసుకోలేదు. రాజ్యాంగ నియమాలు, విలువలకు కట్టుబడి కేసులను పరిష్కరించాలి. ఎలాంటి ఉద్వేగాలు లేని ఏఐ వల్ల ఇది సాధ్యం కాదు'' అని విశ్లేషించారు.

# కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వినయ్ కులకర్ణికి జీవితఖైదు

- హత్య కేసులో కోర్టు తీర్పు



**బెంగళూరు, ఏప్రిల్ 18 :** ఓ హత్య కేసులో కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వినయ్ కులకర్ణి, మరో 15 మందికి చట్టసభ ప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం జీవితఖైదు, ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున జరిమానా విధించింది. ఈ కేసులో సాక్ష్యాలను తారుమారు చేసిన సీఐ చెన్నకేశవ టింగరికర్‌కు ఏడేళ్ల కారాగార శిక్ష, రూ.30 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సంతోశ్ గజానన తీర్పు ఇచ్చారు. ధార్వాడలో 2016 జూన్ 15న సప్తాపురలోని 'ఉదయ్ జిమ్'లో ధార్వాడ జిల్లా పంచాయతీ సభ్యుడు యోగేశ్‌గౌడ హత్యకు గురయ్యారు. ఈ కేసులో సీబీఐ అధికారులు 2020 నవంబరు 5న ఏ15గా ఉన్న వినయ్ కులకర్ణిని అరెస్టు చేశారు. అనంతరం వినయ్ సుప్రీంకోర్టును ఆశ్రయించి బెయిలుపై బయటకొచ్చారు. ధార్వాడ జిల్లాలోకి అడుగు పెట్టరాదన్న బెయిలు షరతు ఉండటంతో గత శాసనసభ ఎన్నికల్లో ఆయన తన నియోజకవర్గంలో అడుగుపెట్టకుండానే భార్య, ఇద్దరు కుమార్తెల ప్రచారంతో గెలుపొందారు. నిందితుల నుంచి వచ్చే జరిమానా మొత్తాన్ని యోగేశ్‌గౌడ సంతానం, అతని సోదరుడు గురునాథగౌడకు అందించాలని న్యాయమూర్తి తన ఆదేశాల్లో పేర్కొన్నారు. తీర్పు వెలువడిన అనంతరం ధార్వాడ ఎమ్మెల్యే స్థానం నుంచి వినయ్ అనర్హుడయ్యారని విధానసభ కార్యదర్శి ప్రకటించారు. శిక్షపై స్టే వచ్చే పక్షంలో అనర్హత రద్దువుతుందని న్యాయనిపుణులు తెలిపారు. వినయ్ రాష్ట్రంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా పనిచేశారు.

# అందుకే పార్లమెంట్లో మేం వారిని ఓడించాం

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



**ఢిల్లీ, ఏప్రిల్ 18:** తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో పలు పార్టీలు జోరుగా ప్రచారం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తమిళనాడులో ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా రిజర్వేషన్ల బిల్లు వీగిపోవడంపై స్పందించారు.బీజేపీ కుట్రలను తాము అడ్డుకున్నామంటూ వ్యాఖ్యానించారు.

''నాకు కొన్నేళ్లుగా తమిళనాడుతో అనుబంధం ఉంది. ఈ ప్రాంతానికి, ఇక్కడి ప్రజలకు నా హృదయంలో ప్రత్యేకమైన స్థానం ఉంది. జమ్మూకశ్మీర్‌కు వెళ్తే.. ఎలా నా సొంత ఇల్లులా అనిపిస్తుందో.. తమిళనాడుకు వచ్చినప్పుడూ అదే భావన కలుగుతుంది. ఆర్ఎస్ఎస్, బీజేపీ కలిసి తమిళ భాష, సంస్కృతి- సంప్రదాయాలను దెబ్బతీయాలని గత కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నాయి. అది చూసినప్పుడల్లా వీరికెంత ధైర్యం అనిపిస్తుంటుంది'' అని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ బీజేపీపై విమర్శలు గుప్పించారు.''బీజేపీ ఏప్రిల్ 16న పార్లమెంట్లో మహిళల రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టింది. దాన్ని ఇప్పుడు పాస్ చేయాలనుకున్నారు. నిజానికి మహిళా రిజర్వేషన్ బిల్లుకు 2023లోనే ఆమోదం లభించింది.

అయితే ఈ మహిళల రిజర్వేషన్ల వెనక నియోజకవర్గాల పునర్విభజన అంశం దాగిఉంది. రిజర్వేషన్ల పేరుతో పునర్విభజన బిల్లును ఆమోదించుకోవాలని కేంద్రం ప్రయత్నించింది. ఈ డీలిమిటేషన్ బిల్లు వల్ల రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంది. తమిళనాడుతో పాటు దక్షిణాది రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాలను బలహీనపరిచేందుకే బీజేపీ ఈ బిల్లును ప్రవేశపెట్టింది. అందుకే పార్లమెంట్లో మేమంతా ఆ బిల్లును అడ్డుకున్నాం'' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

# ఎన్డీయేకు చీకటి రోజు.. వారికి తొలి ఓటమి

## కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ



**ఢిల్లీ, ఏప్రిల్ 18 :** లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ల కోసం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ స్పందించారు. ఇది డీలిమిటేషన్, మహిళల హక్కుల కోసం తీసుకొచ్చిన బిల్లు కాదన్నారు. విపక్షాలన్నీ ఏకతాటి పైకి వచ్చి ప్రభుత్వాన్ని ఓడించాయని తెలిపారు. ఇది ప్రజాస్వామ్యానికి అతిపెద్ద విజయమని పేర్కొన్నారు. ఎన్డీయేకు ఇది చీకటి రోజు అని, వారు తీసుకొచ్చిన బిల్లు తొలిసారిగా లోక్‌సభలో ఓడిపోయిందని విమర్శించారు. లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లుల విషయంలో ఫలితంతో సంబంధం లేకుండా తమకే ఘనత దక్కేలా అధికారపక్షం ఎత్తుగడ వేసిందని దుయ్యబట్టారు. ''బిల్లు ఆమోదం పొందినా.. పొందకపోయినా అది తమకు విజయమేనని వారు విశ్వసించారు. మహిళల హక్కుల కోసం పోరాడేది తామేనని నమ్మించాలనుకున్నారు. కానీ అది అంత సులభం కాదు'' అని ప్రియాంక అన్నారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లుతో ముడిపెట్టడాన్ని ఆమె ప్రశ్నించారు. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం పేరిట వ్యవస్థలపై ఏమాత్రం గౌరవం లేకుండా అధికారపక్షం వ్యవహరించిన తీరును ప్రతిపక్షాలు అడ్డుకున్నాయన్నారు. ''ఇది ప్రభుత్వానికి ఎదురుదెబ్బ. ఆ కూటమి కుదుపునకు లోనయింది'' అని వ్యాఖ్యానించారు.

ఈ సందర్భంగా కేంద్రానికి సవాలు విసిరారు. ''2023లో ఇప్పటికే ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ల బిల్లును తీసుకురండి. అందుకోసం సోమవారం పార్లమెంట్ సమావేశాలు నిర్వహించండి. దానికి మా పూర్తి మద్దతు తప్పకుండా ఉంటుంది. అప్పుడు తెలుస్తుంది.. మహిళా వ్యతిరేకులు ఎవరో'' అని ప్రియాంక పేర్కొన్నారు.

# అమెరికా సైనికులకు ఆహార కొరత..?

## ఖాళీ ప్లేట్లు.. పలచటి చపాతీలు: అంతర్జాతీయ కథనాలు



**వాషింగ్టన్, ఏప్రిల్ 18 :** ప్లేట్లో ఒక మూలన రెండు పలచటి చపాతీలు.. ఉడికించిన కొన్ని క్యారెట్ ముక్కలు.. ఓ పక్కన కొంచెం మాంసం.. ఈ దృశ్యాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అమెరికా సైనికులకు ఈ చాలీచాలని ఆహారమే అందుబాటులో ఉందట. కొన్ని వారాలుగా పశ్చిమాసియాలో విధుల్లో ఉన్నవారు ఆహార కొరతను ఎదుర్కొంటున్నారా..? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం..

ఇరాన్‌తో యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి వేలమంది సైనికులను అమెరికా పశ్చిమాసియాకు పంపింది. అలాగే యూఎస్ఎస్ ట్రిపోలి, యూఎస్ఎస్ అబ్రహాం లింకన్.. హర్మూజ్ దిగ్బంధనంలో పాల్గొంటున్నాయి. కొన్ని వారాలుగా యుద్ధ నౌకలు, విమాన వాహక నౌకల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. వారికి వడ్డిస్తోన్న ఆహారం ఫొటోలను తమ కుటుంబసభ్యులకు షేర్ చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చిందని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. అలాగే మిలిటరీ జిప్‌కోడ్స్ (విదేశాల్లోని సైనిక, దౌత్య కార్యాలయాలకు పంపే పోస్టులు)కు పోస్టల్ సేవలను నిలిపివేయడంతో పరిస్థితి మరింత తీవ్రరూపం దాల్చింది. దీంతో యూఎస్‌లోని కుటుంబాలు విధుల్లో తమ వారికి ఆహారం, ఇతర ఉత్పత్తులు పంపించేందుకు వీలు లేకుండా పోయింది.

ఇక, యూఎస్ఎస్ ట్రిపోలిలో ఉన్న ఆహారాన్ని రేషన్ పద్ధతిలో వాడుకోవాల్సి వస్తోందని తెలుస్తోంది. తాజా సరకులు అనేవే లేవని ఒక మెరైనర్ తన తండ్రికి వెల్లడించారు. తన బిడ్డ కోసం షాంపూ, టూత్‌పేస్ట్, కొన్ని స్నాక్స్ పంపానని చెప్పారు. అయితే అవి ఇంతవరకు చేరలేదు. ''వీలైనప్పుడు తింటున్నాం. ఎవరికైనా ఎక్కువ ఆహారం అందితే దానిని ఇతరులతో పంచుకుంటున్నాం. సరకులు చాలా తక్కువగా ఉన్నాయి'' అని ఒక సెయిలర్ తన తల్లితో చెప్పి వాపోయారు. అతడికి వారి కుటుంబం ఆహారాన్ని పంపినా అది గమ్యస్థానానికి చేరలేదు. యుద్ధం వల్ల గగనతల మూసివేతలు, రవాణా సమస్యల కారణంగా ఏప్రిల్ నుంచి డెలివరీలు నిలిచిపోయాయని యూఎస్ ఆర్మీ ప్రతినిధి మీడియాకు వెల్లడించారు.

మార్చి 27న ట్రిపోలి 3,500 మంది మెరైన్లతో ఇరాన్‌కు చేరువగా వెళ్లింది. ఈ ఆహార సమస్య దీనిలో ఉన్న సైనికులకు మాత్రమే పరిమితం కాలేదని ఆ కథనాలు పేర్కొన్నాయి. జనవరి 26నే పశ్చిమాసియా ప్రాంతంలో ఉన్న యూఎస్ఎస్ అబ్రహాం లింకన్‌లోనూ నాణ్యమైన ఆహారం లభించడం లేదని వెల్లడించాయి. నాణ్యత పక్కనపెడితే.. అందులోని వారు ఎప్పుడూ ఆకలితోనే ఉంటున్నారట.

ఇదిలా ఉంటే.. ఇరాన్ వార్‌లో భాగమైన విమాన వాహక నౌక జెరాల్ ఆర్ ఫోర్డ్ లోని ప్రధాన లాండ్రీ విభాగంలో అగ్ని ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. దీంతో పలు కంపార్ట్‌మెంట్లలోని అమెరికా సైనికులు, నావికులు విష వాయువులు పీల్చి అస్వస్థతకు గురయ్యారు. ఆ నౌకలో విధులు నిర్వర్తిస్తోన్న 4,500 మంది సిబ్బంది టాయిలెట్ కష్టాలను ఎదుర్కొన్నట్లు కథనాలు వెలువడ్డాయి. యుద్ధనౌక నిరంతరం కదులుతున్నందున, సరైన నిర్వహణ లేకపోవడంతో అందులో ఉన్న మరుగుదొడ్లు పనిచేయకపోవడంతో వారు తీవ్రంగా

# బాల్య వివాహాలను నిర్మూలిద్దాం బాలికల విద్యను ప్రోత్సహిద్దాం

- జిల్లా సంక్షేమ అధికారి కే నరసింహారావు




**సూర్యాపేట ఏప్రిల్ 18 (మనం న్యూస్):** బాల్య వివాహాలను నిర్మూలించి బాలికల విద్యను ప్రోత్సహించాలని సూర్యాపేట జిల్లా సంక్షేమ అధికారి కే. నరసింహ రావు అన్నారు శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో,జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సహకారంతో రూపొందించిన బాల్య వివాహాల నిర్మూలన గోడ పత్రికను జిల్లా సంక్షేమ అధికారి కే నరసింహారావు, సి డబ్ల్యూ సి చైర్ పర్సన్ రమణారావు, డీసీపీవో బి.రవికుమార్, సి డబ్ల్యూ సి మెంబర్స్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడుకోవాల్సిన వయసులో అత్తారింటి బాధ్యతలు మోపడం వల్ల బాలికలు తమ వ్యక్తిత్వాన్ని కోల్పోతున్నారని వారన్నారు ఏప్రిల్ 19న అక్షయ తృతీయ వంటి పర్వదినాల్లో ముహూర్తాల పేరుతో జరిగే దొంగ పెళ్లిళ్లను అరికట్టడానికి ప్రతి గ్రామస్థాయి అధికారి అప్రమత్తంగా ఉండాలి'అని ఆదేశించారు. జిల్లా సంక్షేమ అధికారి బాల్య వివాహాల వల్ల కలిగే శారీరక నష్టాలను శాస్త్రీయంగా వివరించారు. 18 ఏళ్లు నిండని బాలికల గర్భాశయం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందదు. ఈ స్థితిలో గర్భం దాల్చడం వల్ల ప్రసవ సమయంలో తల్లి లేదా బిడ్డప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. సరైన శారీరక పరిపక్వత లేని తల్లులకు పుట్టే పిల్లలు తక్కువ బరువుతో లేదా శారీరక లోపాలతో పుట్టే అవకాశం ఉంది.చిన్న వయసులో లైంగిక వేధింపులు, గృహహింస ఎదుర్కోవడం వల్ల వారు తీవ్రమైన కుంగుబాటుకు లోనవుతారు. కేవలం పెళ్లిళ్లను అపడమే కాకుండా, ఆడపిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఆడపిల్లల పట్ల వివక్షను వీడాలని, వారిని చదివించి సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలబెట్టాలని ఈ పథకం నినదిస్తోంది. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, ఆడపిల్ల పుట్టడం ఒక గర్వకారణమని ప్రచారం చేయాలి. ఆడపిల్లల పెళ్లి కోసం అప్పులు చేసి బాల్య వివాహాలు చేయాల్సిన అవసరం లేదు. ఈ పథకం ద్వారా చిన్నప్పటి నుండే ప్రతి నెల కొద్ది మొత్తంలో పొదుపు చేస్తే, ఆమెకు 21 ఏళ్లు వచ్చేసరికి ఉన్నత చదువులకు మరియు పెళ్లికి సరిపడా లక్షలాది రూపాయల నిధి సమకూరుతుంది. బాల్య వివాహాల నిరోధక చట్టం -2006 ప్రకారం, బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం.పెళ్లి చేసే తల్లిదండ్రులు, పెళ్లి జరిపించే పురోహితులు, ఫంక్షన్ హాల్ యజమానులు అందరిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. దోషులకు 2 ఏళ్ల కఠిన కారాగార శిక్ష మరియు రూ.1లక్ష జరిమానా విధించబడుతుంది. ఎక్కడైనా చిన్నపిల్లలకు పెళ్లి చేస్తున్నట్లు మీకు సమాచారం తెలిస్తే, వెనుకాడకుండా వెంటనే చైల్ లైన్ 1098 కి లేదా పోలీస్ 100 కి సమాచారం అందించండి. మీరిచ్చే ఒక చిన్న సజీవితాన్ని మార్చేస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో సి డబ్ల్యూ సి సభ్యులు టీ నాగరాజు, రామ్ రెడ్డి, ధనమ్మ, డిసిపియు సభ్యుడు మీరా, ఎయిడ్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ , సోషల్ వర్కర్ శ్రీలక్ష్మి, వగ్గు సోమన్న, సఖి సెంటర్ సభ్యులు అశ్విని, ఎలిశమ్మ, తదితరులు పాల్గొన్నారు

# హౌస్ లిస్టింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి




**సూర్యాపేట, ఏప్రిల్ 18 (మనం ప్రతినిధి):** జిల్లాలో జన గణన 2027 కార్యక్రమంలో భాగంగా మొదటి విడత శిక్షణా కార్యక్రమము జడ్.పి.హెచ్.ఎస్, నూతనకల్ మండల కేంద్రంలో జరుగుతున్న నేపథ్యంలో శనివారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హాజరై జన గణన నిర్వహించే న్యూమరేటర్స్, సూపర్వైజర్స్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మొదట విడతగా హౌస్ లిస్టింగ్ చేయవలసి ఉన్నందున ఏ ఒక్క గృహము కూడా వదిలిపెట్టకుండా ప్రతి వీధిలో ఆ చివరి నుండి ఈ చివరి వరకు మధ్యలో గృహాలను వదిలేయకుండా హౌస్ లిస్టింగ్ పకడ్బందీగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సి ఎం ఎం ఎస్. పోర్టల్ నందు మొబైల్ అప్లికేషన్ ద్వారా పూర్తి చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఆశా వర్కర్లతో మాట్లాడి గ్రామములో ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసు కున్నారు. గ్రామములో అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి సూచించినారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత, సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



**సూర్యాపేట, ఏప్రిల్ 18 (మనం ప్రతినిధి):** పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులు ఆదేశించారు. శనివారం 99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా నూతనకల్ తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సాదా బైనమా దరఖాస్తులు క్రమబద్ధీకరణ ఫైల్స్ అన్నింటిని పారదర్శకంగా పూర్తి చేయుటకు ప్రతి లబ్ధిదారుని ఫైలు సమగ్రంగా విచారణ చేసి భూభారతి చట్టం- 2025 . అనంతరం వచ్చిన జీవోల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని పేర్కొన్నారు .సర్వే . సరిహద్దుల చట్టం, 1923 ప్రకారం రీ సర్వే మండలంలోని తొమ్మిది గ్రామాలలో నిర్వహిస్తున్నందున సీలింగ్ భూమిలో దీర్ఘకాలంగా అనుభవదారుగా ఉండి కొనుగోలు చేసిన రైతులందరికీ పట్టాలు మంజూరీ చేయుటకు ప్రభుత్వ ఆదేశముల ప్రకారం వెంటనే రీ సర్వే ప్రక్రియ పూర్తి చేయవలెనని కలెక్టర్ అన్నారు.శ్రీరామ ఎల్లమ్మ, భర్త నరసయ్య ఎర్ర పహాడ్ గ్రామ వాసి 2009 లో సర్వే నెంబరు 92 లో ఎకరం భూమిని కొనుగోలు చేసి సాదా బైనమా దస్తావేజు క్రమబద్ధీకరణ కొరకు 2020 లో దరఖాస్తు చేసుకున్నారు. క్రమబద్ధీకరణ ఫైలు పెండింగ్ లో ఉన్నందువలన తహసిల్దారు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ని కలవగా వెంటనే ఆమె ఫైలు ఆన్లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించినారు.కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆస్క్ పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్ సెంటర్‌లో మెటీరియల్ పంపిణీ




**కోదాడ, ఏప్రిల్ 18(మనం న్యూస్):** అంబేద్కర్ ఆశయ సాధన కేంద్రం(ఆస్క్ )ఆధ్వర్యంలో ఎమ్మెస్ కళాశాలలో నిర్వహిం చబడుతున్న ఉచిత పాలిటెక్నిక్, టిజి ఆర్జెసి కోచింగ్ సెంటర్ లో స్టడీ మెటీరియల్ పంపిణీ పంపిణీ కార్యక్రమాన్ని ఆస్క్ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసినారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆస్క్ అధ్యక్షురాలు బల్గూరి స్నేహ దుర్గయ్య, సివిల్ కానిస్టేబుల్ కుర్రి నాగరాజు పాల్గొని విద్యార్థులకు వారి చేతుల మీదుగా అంద చేయడం జరిగింది.ఈ సందర్భంగా మాట్లాడుతూ డా, బిఆర్ అంబేద్కర్ చెప్పినట్లుగా పే బ్యాక్ టు సొసైటీ లో భాగంగా ఈ కోచింగ్ సెంటర్ ని అందరి సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా మంచి అనుభవం విద్యార్హతలు ఉన్న ఉపాధ్యాయులచే బోధన చేస్తున్నామని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఆస్క్ ప్రధాన కార్యదర్శి మాతంగి ప్రభాకర్ రావు, కోర్స్ డైరెక్టర్ యలమర్తి శౌరి, బొడ్డు హుస్సేన్, చేకూరి రమేష్, మేళ్లచెరువు వీరభద్రం,కోర్స్ కో-ఆర్డినేటర్ గంధం బుచ్చారావు, మాతంగి సురేష్,కనుకు శ్రీకాంత్, అన్నెపాక. మహేష్, ఎం భవ్యశ్రీ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# వెలిశాల జిపిఓ మృతి పట్ల సంతాపం



**తిరుమలగిరి, ఏప్రిల్ 18 (మనం న్యూస్):** తిరుమలగిరి మండలం వెలిశాల జిపిఓ ముస్తఫా మృతి పట్ల సూర్యాపేట ఆర్డిఓ వేణు మాధవరావు తిరుమలగిరి తహసిల్దార్ హరిప్రసాద్ శనివారం సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహంపై పూలమాలలు వేసి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధులు నిర్వర్తించుకొని కోదాడలోని తన వినివాసానికి వెళ్తుండగా దురాజ్పల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు అకాల మరణం చెందడం అత్యంత విషాదకరమన్నారు. ముస్తఫా మృతితో గ్రామం ఒక మంచివ్యక్తిని కోల్పోయరని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వెలిశాల గ్రామపంచాయతీ కార్యదర్శి బింజా, కాంగ్రెస్ నాయకులు కుంభం సతీష్ గౌడ్, మొరిగాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# టీ హబ్బు నందు మెరుగైన రక్త పరీక్షల నిర్వహణ




**సూర్యాపేట, ఏప్రిల్ 18 (మనం ప్రతినిధి):** టీ హబ్ సూర్యాపేట సేవల పై శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరం నందు కలెక్టర్ సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ.... టి హబ్ నందు మెరుగైన నాణ్యమైన రక్త పరీక్షల నిర్వహణ, ఖచ్చితమైన ఫలితాలు సమాయనుసారం రావటం, నివేదికలు అందజేయటం కోసం పర్యవేక్షించాలని సూచించారు. జి జి హెచ్. సూర్యాపేట, ఏ హెచ్. కోదాడ, పిహెచ్సి నేరేడుచెర్ల పిహెచ్సి గరిడేపల్లి ప్రాంతాల పరిధిలో సేకరించిన రక్త నమూనాలు ఎక్కువగా తిరస్కరణకు గురవుతున్నాయని, దీనికి గల కారణాల సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. టి హబ్ ప్రభావంతముగా నడిపించుటకు కావలసిన మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేయాలన్నారు. దీని ద్వారా ప్రతి రోజు 1500 మంది లబ్ధిదారులకు 5500 పైబడిన వివిధ రకాల రక్త పరీక్ష ఫలితాలు ఇవ్వటం జరుగుతుందని కలెక్టర్ అన్నారు.

ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ డా పెండెం వెంకట రమణ, డిసిహెచ్ఎస్ వెంకటేశ్వరరావు, ఇంచార్జ్ సూపరింటెండెంట్ డా శ్రీకాంత్ భట్, బయో కెమిస్ట్రీ, పెథోలోజీ, మైక్రో బయాలజీ విభాగాల అధిపతులు డా,, పావని కిరణ్మయి,పద్మావతి, తరుణ్, ప్రోగ్రాం అధికారి డా, జి ప్రసిద్ధ్, ఆసుపత్రి నిర్వాహకులు డా,, మనీషా, డి.పి.ఓ. ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినిలకు గర్భాశయ క్యాన్సర్ నిరోధక టీకాలు



**పాలకీడు ఏప్రిల్ 18 (మనం న్యూస్):** పాలకవీడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో శనివారం 14 సంవత్సరాల వయసు ఉన్న విద్యార్థినులకు గర్భాశయ క్యాన్సర్ నివారణ టికాలు వేయించడం జరిగిందని మండల వైద్యాధికారిని డా.సౌమ్య తెలిపారు. పాలకీడు మండల పిహెచ్సి లో పనిచేస్తున్న ఏఎన్ఎం లు.ఆశావర్కర్లు ఇతర సిబ్బంది సహాయంతో మండల విద్యాధికారి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇంజమూరి కాటయ్య సమక్షంలో 14 ఏండ్ల వయసున్న బాలికలకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. వ్యాక్సిన్ తీసుకున్న అనంతరం వారిని కొంత సమయం పాటు పాఠశాలలోనే పరిశీలనలో ఉంచి తదుపరి పంపించడం జరిగింది ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్ మాత్రమే కాకుండా ఇతర 16 రకాల క్యాన్సర్లను హెచ్పివి టీకాకి నిరోధించే సామర్థ్యాన్ని కలిగి ఉందని మండలవైద్యాధికారి తెలియపరచాలని, టీకాపై విద్యార్థులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించి వారికి అందించడం జరిగిందని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరు గర్భాశయ, ఇతర క్యాన్సర్ల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని భావిభారత పౌరులైన విద్యార్థినులు ఇటువంటి టీకాలు పట్ల అవగాహన కలిగి ఉండాలని , తమ చుట్టుపక్కల వారికి టీకాపై అవగాహన కలిగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉధ్యా యులు సైదులు, శ్రీనివాస్ రెడ్డి., స్వప్న ,సుభాషిని ,రెహమత్ ఉన్నీసా, నరేష్.. ,నాగేశ్వరరావు, ఉపేందర్ పాల్గొన్నారు.

# వేదమంత్రాల నడుమ కాలభైరవ స్వామి విగ్రహా ప్రతిష్ట



**పెన్ పహాడ్, ఏప్రిల్ 18(మనం న్యూస్):** మండల కేంద్రంలోని శ్రీ శంభులింగేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ కాలభైరవ స్వామి విగ్రహ ప్రతిష్టను ఆలయ అర్చకులు ఇరువంటి మురళీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఆయన తృతీయ కుమారుడు ఇరువంటి విజయకృష్ణ శర్మ ఇందిర దంపతులు విగ్రహ దాతలుగా నిర్వహిస్తున్న ప్రతిష్టా మహోత్సవం శనివారం వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలభైరవ స్వామి విగ్రహ ప్రతిష్టను శనివారం నుండి సోమవారం వరకు మూడు రోజులు కొనసాగుతాయని తెలిపారు ఇందులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు ఈ కార్యక్రమంలో అర్చకులు ఇరువంటి రమేష్ శర్మ, ఇళయరాజ శర్మ, శివరామ శర్మ, సురేష్ శర్మ, వంశీధర్ శర్మ, శరత్ సాయి, సిరి చందన, వెంకట నరసమ్మ, ఇందిర, శాంతమ్మ, దీప, రంగినేని లక్ష్మీకాంతరావు, రంగినేని మోహనరావు, పేరాల మురళి, జంజిరాల రాము, తదితర భక్తులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు త్వరితగతిన పూర్తి చేయాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్



**ఆత్మకూర్ ఎస్ ఏప్రిల్ 18 మనం న్యూస్:** జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా 340 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోళ్ళను వేగవంతం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. శనివారం ఆత్మకూరు (ఎస్) మండలం నెమ్మికల్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు సజావుగా నిర్వహించేందుకు వ్యవసాయ, సివిల్ సప్లయ్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారుల అంచనా ప్రకారం జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున 340 సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని మౌలిక వసతులతో పాటు తేమ కొలిచే యంత్రాలు, టార్పలిన్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సెంటర్ నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం ఒక్కరోజే 4 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, రానున్న రోజులలో ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి రోజుకు 5 వేల మెట్రిక్ టన్నుల నుండి 6 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో.పిఎసిఎస్ ఇంచార్జ్ ఎఆర్ఇందిరా డిసిఓ ప్రవీణ్ డి.ఎం. సివిల్ సప్లయస్ శ్రీధర్ రెడ్డి, డిఎస్ఓ మోహన్ బాబు తహసీల్దార్ అమీన్ సింగ్, ఎంపీడీవో హసీం, ఎంపివో ప్రియాంక, మండల వ్యవసాయ అధికారి దివ్య, ఆర్ ఐ ప్రదీప్ రెడ్డి ఏపీఎం ఈశ్వర్ సీఈవో పట్నం లక్ష్మారెడ్డి ఏ ఈ ఓ శివకుమార్ సర్పంచ్ గణిత రామ నర్సు సెంటర్ ఇన్చార్జ్ మల్లికార్జున్ సూర్యాపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ పచ్చిపాల వెంకన్న ఇతర అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# జాతీయ రహదారి సెట్ క్లీనింగ్ పనులు నిర్వహించిన సర్పంచ్



**మహాదేవపూర్ ఏప్రిల్ 18 మనం న్యూస్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారి సైడ్ క్లీనింగ్ పనులను శనివారం రోజున సర్పంచ్ హసీనబాన్ అక్బర్ ఖాన్ నిర్వహించారు. సీఎం పర్యటన సందర్భంగా జాతీయ రహదారిపై వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు మరియు అవాంఛనీయ సంఘటనలు కలగకుండా సైడ్ క్లీనింగ్ పనులను మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద గ్రామపంచాయతీ పాలకవర్గంతో కలిసి సర్పంచ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీజ సంతోష్, వార్డు సభ్యులు మరియు పార్టీ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ రూపొందించిన విధానం ప్రకారమే ధాన్యం సేకరణ చేయాలి



- రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదు
- రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాత ప్రభుత్వం
- రాష్ట్ర వ్యవసాయ ,రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎన్ .కోదండ రెడ్డి

**నల్లగొండ,ఏప్రిల్ 18( మనం ప్రతినిధి):** ప్రభుత్వం రూపొందించిన విధివిధానాల ప్రకారమే ధాన్యం సేకరణ చేయాలని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎన్. కోదండ రెడ్డి అన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులు ధాన్యం అమ్మిన తర్వాత మిల్లులకు వెళ్లాల్సిన అవసరం లేదని ,ఒకవేళ ఎవరైనా రైతులను రైస్ మిల్లులకు పంపిస్తే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. శనివారంరైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న ఆర్జాల బావి ,ఎస్ఎల్ బి సీ మార్కెట్ యార్డ్ లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత అధికారులతో కలిసి తనిఖీ చేశారు.

కొనుగోలు కేంద్రాలలోని ధాన్యపు రాశులు, తేమ, తాలు,తరుగు తదితర వివరాలను తెలుసుకోవడమే కాకుండా ధాన్యాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం రెండుచోట్ల రైతులు, హమాలీలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, అధికారులతో సమావేశాలు నిర్వహించారు. ధాన్యం సేకరణ పాలసీకి విరుద్ధంగా ఎవరు సేకరణ చేయకూడదని, ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని, ఇందుకు సంబంధిత శాఖల అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలులో మిల్లర్ల ప్రమేయం ఉండరాదని ,కొనుగోలు కేంద్రంలో రైతు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు మాత్రమే సంబంధం ఉంటుందని, ధాన్యం అమ్మిన వెంటనే రైతుకు పక్కా రశీదు ఇవ్వాలని, అనంతరం రైతు బ్యాంక్ అకౌంట్లో డబ్బులు జమ చేయాలని చెప్పారు. కొనుగోలు కేంద్రం నుండి మిల్లులకు ధాన్యాన్ని పంపించిన తర్వాత మీల్లులకు వెళ్లాల్సిన బాధ్యత అధికారులదేనని, ధాన్యం విషయంలో రైస్ మిల్లర్ల పెత్తనం కుదరదని, గతంలో పద్ధతి చెల్లదని ఆయన స్పష్టం చేశారు. తాలు ,తరుగు ,తేమకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే రైతులు కొనుగోలు కేంద్రంలోనే పరిష్కారం చేసుకోవాలని, మిల్లర్లకు ఏదైనా సమస్య ఉంటే ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం క్వింటాలకు 45 రూపాయలు మాత్రమే హమాలి చార్జీ తీసుకోవాలని, అంతకుమించి ఎక్కువ వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధాన్యం సేకరణలో ప్రజాప్రతినిధులు ,అధికారులు రైతులకు ప్రాధాన్యత ఇచ్చి పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు. ఎఫ్ సి ఐ గైడ్ లైన్స్ ప్రకారం రబీ ధాన్యం కొనుగోలు కు సంబంధించి తేమ, తరుగు వంటివి కొనుగోలు కేంద్రం లోనే ముందే చూసుకోవాలని, రైతుల సొంత ఖర్చులతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువస్తారని, తాలు, తరుగు పేరుతో వారిని ఇబ్బంది పెట్టడం భావ్యం కాదని, శాస్త్రీయంగా మద్దతు ధర వచ్చేలా చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కాంటా వేయకముందు తాలూ, తరుగు, తేమ హమాలీ పేరుతో కొనుగోలు కేంద్రాలలో అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇకపై ఇలాంటివన్నీ ఉండడానికి వీలులేదని, ధాన్యం సేకరణ విధానాల ప్రకారమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ఎవరైనా తేమ,తరుగు, తాలు పేరుతో రైతులను ఇబ్బందులు పెడితే సహించేది లేదని అన్నారు. ఇకపై ఇలాంటి అన్ని ఆపివేయాలని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వం అని, దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతుబంధు, రైతు రుణమాఫీ, ప్రభుత్వం ఇవ్వడం జరిగిందని తెలిపారు. కాగా పలువురు రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో మిల్లర్లు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తరుగు, తాలు, తూకం పేరిట అనవసరంగా మిల్లుల వద్ద లారీలను ఆపుతున్నారని, లారీకి 10 క్వింటాళ్ల చొప్పున తరుగు తీస్తున్నారని ,ప్రభుత్వం రైతుల గురించి ఆలోచించాలని కోరారు. రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న మాట్లాడారు. రైతు సంక్షేమ కమిషన్ మెంబెర్ సెక్రెటరీ గోపాల్, నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ ,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి ,మార్కెటింగ్ ఎడి ఛాయాదేవి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాంపతి నాయక్, డిఎస్ఓ, తహసిల్దార్ పరశురాం, మాజీ జెడ్పిటిసి గుమ్మలమోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, ఆదర్శ రైతు రామిరెడ్డి, తదితరులు ఉన్నారు.

# అభివృద్ధి సంక్షేమ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తాం

- **నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



**ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 18 (మనం బ్యూరో):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 20వ. తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ కార్యక్రమాల అమలును విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లు, సంక్షేమ శాఖల అధికారులకు శనివారం ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రూపొందించిన 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో ఈ నెల 20 నుంచి 26 వరకు నిర్వహించనున్న సంక్షేమ వారోత్సవాలును ప్రతీ జిల్లాలో సమగ్రంగా, ప్రజలకు చేరువగా నిర్వహించాలని స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం హైదరాబాద్లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సెక్రటేరియట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ సమావేశం ద్వారా జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ సంక్షేమ వారోత్సవాల సందర్భంగా వివిధ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న గురుకుల, సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పనకు కృషి చేయాలన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎటువంటి లోపాలు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాలను విజయవంతంగా అమలు చేయడానికి నాగర్ కర్నూల్ జిల్లా యంత్రాంగం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వెల్లడించారు. నాగర్ కర్నూల్ కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి అదనపు కలెక్టర్లు అమరేందర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ లతో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ....., సంక్షేమ వారోత్సవాల నిర్వహణకు ముందస్తుగా విస్తృత స్థాయి ప్రణాళికలు రూపొందించి, అన్ని సంబంధిత శాఖలను సమన్వయం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల జిల్లా అధికారులు, వసతి గృహాల వార్డెన్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమాల అమలు విధానం, బాధ్యతల విభజనపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించినట్లు చెప్పారు. ప్రతి శాఖ తమ పరిధిలోని కార్యక్రమాలను సమయపాలనతో అమలు చేయాలని ఆదేశించామని వెల్లడించారు. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. వివిధ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను వార్డెన్లతో నేరుగా చర్చించినట్లు తెలిపారు. కొన్ని చోట్ల విద్యార్థుల సంఖ్య సామర్థ్యాన్ని మించిపోవడం గమనించి, అదనపు వసతులు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వివరించారు. తాగునీరు, విద్యుత్, పరిశుభ్రత, భద్రత వంటి అంశాల్లో ఎటువంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సంక్షేమ వసతి గృహాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. సంక్షేమ వారోత్సవాల రోజువారీ కార్యక్రమాల వివరాలను తెలియజేస్తూ, ఈనెల 20న. జిల్లా స్థాయిలో సమావేశం నిర్వహించి వివిధ సంక్షేమ పథకాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. 21న. వసతి గృహాల్లో చదివి వెళ్లిన పూర్వ విద్యార్థులకు మండల స్థాయిలో కెరీర్ గైడెన్స్ కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్ దిశను స్పష్టంగా చూపించేలా నిపుణులతో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 22న. వసతి గృహాలలో మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామన్నారు. తాగునీటి సౌకర్యం, విద్యుత్, సీసీ కెమెరాల వ్యవస్థ, పెయింటింగ్, మరుగుదొడ్ల మరమ్మతులు వంటి పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. 2
3న. సంక్షేమ గురుకుల పాఠశాలల్లో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించి విద్యార్థుల ప్రగతి, సమస్యలపై చర్చించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇక 24న. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్మెంట్) కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు ఏటీసీలకు తీసుకెళ్లి ఉపాధి అవకాశాలపై మార్గదర్శనం అందించనున్నట్లు తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు విస్తరించేలా ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. 25న. జిల్లా స్థాయిలో అచ్చంపేట వద్ద వసతి గృహాల విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి ఆహార భద్రత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. సంక్షేమ వారోత్సవాల చివరి రోజు అయిన 26న. మండల స్థాయిలో పెద్ద గ్రామపంచాయతీలలో బడిబాటపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, విద్యార్థుల చేరికలు పెంపొందించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ మొత్తం కార్యక్రమాలను జిల్లా యంత్రాంగం సమన్వయంతో అమలు చేసి విజయవంతం చేస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రతి వర్గానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేరేలా కృషి చేయడమే లక్ష్యమన్నారు. ఈ వారోత్సవాలు ప్రజలలో విశ్వాసాన్ని పెంపొందించే వేదికగా నిలుస్తాయని కలెక్టర్ బాదావత్ సంతోష్ వీడియో కాన్ఫరెన్స్లో వివరించారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని రైతులు కేంద్ర రైతు పోర్టల్లో 67% నమోదు చేయించడం పూర్తయిందన్నారు. అదేవిధంగా 100% ఆన్లైన్ నమోదు ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖల అధికారులు కే ఉమాపతి, ఫిరంగి, యాదగిరి, డిఇఓ రమేష్ కుమార్, డిపిఓ శ్రీరాములు, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు సంబంధిత శాఖల అధికారులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సెన్సెస్ నిర్వహణపై శిక్షణ కార్యక్రమం



**దుగ్గొండి, ఏప్రిల్ 18 (మనం న్యూస్):** దుగ్గొండి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సెన్సెస్ నిర్వహణపై 45 మంది ఉపాధ్యాయులకు శనివారం శిక్షణ కార్యక్రమాన్ని ఇవ్వడం జరిగింది. ఈ సెన్సెస్ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహశీల్దార్ సమ్మక్క, ఆర్ ఐ రాంబాబు విచ్చేశారు. మూడు రోజులపాటుగా శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందని వారు అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు ఎలగొండ రామస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

- **జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
- **యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లపై సమీక్షలో కలెక్టర్**



**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ -18(మనం ప్రతినిధి ):** ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లపై వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. రైస్ మిల్లర్ల నుంచి ప్రభుత్వ నిబంధనల ప్రకారం బ్యాంక్ గ్యారంటీ తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో టెంట్లు, తాగునీరు, విద్యుత్ వసతి కల్పించాలని, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే యంత్రాలు అందుబాటులో పెట్టాలని ఆదేశించారు. నిర్దేశించిన విధంగా కొనుగోళ్లు చేయాలని సూచించారు. కూలీలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. రైతులు తాము కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని పిలుపునిచ్చారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా కేంద్రాలకు తరలించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల ఆన్లైన్ ప్రక్రియ, మిల్లుల కేటాయింపు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీఓ గీత, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ నరసింహ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, సహకార అధికారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



## మూడోవార్డ్ నీటి సమస్యను పరిశీలించిన గ్రామ సర్పంచ్

**మహాదేవపూర్ ఏప్రిల్ 18 మనం న్యూస్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో ని 3వ వార్డ్లో నీటి సమస్యను పరిశీలించిన గ్రామ సర్పంచ్ హసీనాభాను అక్బర్ ఖాన్ స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు పాడైన మోటార్ కారణంగా తాగునీటి సరఫరా అంతరాయం కలుగుతున్నదని గుర్తించిన సర్పంచ్ హసీనాబాను అక్బర్ ఖాన్ , సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు త్వరలోనే మోటార్ మరమ్మతులు పూర్తి చేసి, ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని సర్పంచ్ హసీనాబాను అక్బర్ ఖాన్ తెలిపారు, ఈ కార్యక్రమం లో మాజీ పాక్స్ చైర్మన్ వామన్ రావు, వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

## బహుజన విప్లవ కెరటం కన్నం రఘున్న ఇకలేరు


- **బహుజన సమాజానికి తీరని లోటు**



**బోయినపల్లి, ఏప్రిల్ 18:(మనం న్యూస్ ):** బహుజన సమాజ్ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలితరం నాయకుడు, బహుజన ఉద్యమ ధ్రువతార, రాళ్ల రామన్నపేట మాజీ సర్పంచ్ కన్నం రఘున్న స్వర్గస్థులయ్యారు. వారి మరణం బహుజన సమాజానికి,పార్టీకి కోలుకోలేని దెబ్బ అని బహుజన నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒంటిచేత్తో ఉద్యమాన్ని నడిపిన యోధుడు 1988వ సంవత్సరంలోనే బహుజన సమాజ్ పార్టీని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీసుకురావడంలో రఘున్న కీలక పాత్ర పోషించారు. బహుజన రాజ్య స్థాపన కోసం పరితపించిన ఆయన, పార్టీ వ్యవస్థాపకులు మాన్యవర్ కాన్షీరామ్ తో భుజం భుజం కలిపి నడిచిన అతికొద్ది మంది నాయకులలో ఒకరు. నాయకత్వ పటిమ: తన రాజకీయ ప్రస్థానంలో ఎందరో బహుజన ఉద్యమకారులను, నాయకులను ఆయన తీర్చిదిద్దారు. సేవా దృక్పథం: రాళ్ల రామన్నపేట సర్పంచ్ గా బాధ్యతలు నిర్వర్తించి, గ్రామాభివృద్ధికి, నిరుపేదల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేశారు. బహుజన ఉద్యమాలకు కర్త, కర్మ, క్రియగా వ్యవహరించి, బహుజనుల గొంతుకగా నిలిచారు. 'రఘున్న మరణం ఒక వ్యక్తి మరణం కాదు, ఒక ఉద్యమ స్ఫూర్తి ఆగిపోవడం. ఆయన చూపిన బాటలో నడవడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి. బోయినపల్లి మండలం నేడు అంత్యక్రియలు కన్నం రఘున్న అంత్యక్రియలు (ఆదివారం) ఉదయం వారి స్వగ్రామమైన రాళ్ల రామన్నపేటలో నిర్వహించబడతాయి. ఈ అంత్యక్రియలకు బహుజన ఉద్యమకారులు, పార్టీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి, ఆ మహానాయకుడికి అంతిమ వీడ్కోలు పలకాలని, ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని బిఎస్పీ బోయినపల్లి మండల కమిటీ కోరుతోంది.

## శనగ రైతులకు ఊరట

- **కేంద్రం అనుమతితో కొనుగోలు పెంపు**
- **మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో కేంద్రం గ్రీన్ సిగ్నల్**
- **కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్తో వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్న మంత్రి అచ్చెన్న**
- **క్రాప్ డైవర్షన్ వల్ల మొక్కజొన్నసాగు, దిగుబడి పెరిగిందని కేంద్రానికి వివరించిన మంత్రి అచ్చెన్న**
- **నిర్ణయం తీసుకుంటామని మంత్రి చౌహాన్ హామీ**



**అమరావతి/విజయవాడ, ఏప్రిల్ 18,(మనం ప్రతినిధి):** రాష్ట్రంలోని రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం దృఢసంకల్పంతో పనిచేస్తోందని, రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం కలగనీయబోమని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా మంత్రి అచ్చెన్నాయుడు చొరవ చూపి, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో శనివారం విజయవాడలోని క్యాంప్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో శనగలు, మొక్కజొన్న పంటల పరిస్థితిని సమగ్రంగా వివరించి, రైతులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఈ ఏడాది రాష్ట్రంలో శనగల సాగు గణనీయంగా పెరిగి, మొత్తం సుమారు 7,13,000 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నమోదైందని తెలిపారు. ఇప్పటివరకు 94,500 మెట్రిక్ టన్నుల శనగలు కొనుగోలు పూర్తయిందని, మిగిలిన పంటను రైతులకు నష్టం కలగకుండా కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందని కేంద్రానికి వివరించారు. అదనంగా 1,78,250 మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలని కేంద్రాన్ని కోరారు. మంత్రి విజ్ఞప్తికి స్పందించిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, పీఎస్ఎస్ స్కీం కింద అదనంగా 15,000 మెట్రిక్ టన్నుల శనగలు తక్షణమే కొనుగోలు చేయడానికి అనుమతి ఇస్తూ సానుకూల నిర్ణయం తీసుకున్నారు. మిగిలిన 68,750 మెట్రిక్ టన్నుల శనగలను కూడా త్వరలోనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. అలాగే మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ, ప్రస్తుతం కనీస మద్దతు ధర కంటే తక్కువకు పంట అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని మంత్రి కేంద్రానికి వివరించారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలవాలని కోరారు. మిర్చి, పొగాకు రైతులు క్రాప్ డైవర్షన్ చేసి మొక్కజొన్న సాగు విస్తీర్ణాన్ని పెంచారని, దీంతో దిగుబడులు అధికంగా వచ్చినట్లు మంత్రి తెలిపారు. అదేవిధంగా ఈ ఏడాది ఇరాన్ యుద్ధ ప్రభావం, ఈతనాల ఉత్పత్తిలో బ్రోకెన్ రైస్ వినియోగం పెరగడం వల్ల మొక్కజొన్నకు డిమాండ్ తగ్గిన పరిస్థితి ఏర్పడిందని వివరించారు. మొక్కజొన్న పంట కొనుగోలు పీడీఎస్ స్కీంలో లేకపోయినప్పటికీ, ప్రస్తుత ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై కేంద్ర ఆహారం, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ వెంకటేష్ జోషి తో వెంటనే మాట్లాడి, మొక్కజొన్న కొనుగోలు అంశంపై త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకునేలా చర్యలు చేపడతామని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, కేంద్రంతో సమన్వయం చేసుకుని రైతులకు పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతుల సంక్షేమం, పంటలకు గిట్టుబాటు ధరలు, మార్కెట్ సదుపాయాలు కల్పించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## రైతన్నల శ్రేయస్సు కోసం పాటు పడాలి

- **నాణ్యమైన ఎరువులు అందించాలి**
- **గోల్డెన్ మార్క్ ఫెర్ట్ చెమ్ ప్రవేట్ లిమిటెడ్ డీలర్ల సమావేశంలో**
- **తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు మాజీ మంత్రి రఘువీరారెడ్డిలు**




**మడకశిర,ఏప్రిల్ 18,మనంన్యూస్:** రైతన్నల శ్రేయస్సు కోసం పాటు పడుతూ నాణ్యమైన ఎరువులు అందించాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్ది ళ్ల శ్రీధర్ బాబు,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి,కాంగ్రెస్ వర్కింగ్ కమిటి సభ్యులు రఘువీరారెడ్డిలు తెలిపారు.హైదరాబాద్ లోని సెలబ్రేటి రీసార్ట్ లో గోల్డెన్ మార్క్ ఫెర్ట్ చెమ్ ప్రవేట్ లిమిటెడ్ వారి 2025,26వ ఆర్థిక సంవత్సరంలో భాగంగా తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,కర్నాటక మూడు రాష్ట్రాల కు చెందిన కంపెనీ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథుగా టీజీ మంత్రి,మాజీ మంత్రితో పాటు,మడకశిర మాజీ ఎమ్మెల్యే కరికెర సుధాకర్ తదితరులు హాజరయ్యారు.గోల్డెన్ మార్క్ ఫెర్ట్ చెమ్ కంపెనీ వ్యవస్థాపకుడు,సి సిఓ జిఎచ్ మోహన్ కుమార్ ముఖ్య అతిథులకు ఘన స్వాగతం పలికి ఆహ్వానించారు. మొదట రఘువీరా రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ,ఒక పరిశ్రమను స్థాపించడం నుంచి విజయవంతంగా నడపడం వరకు ఎంతో శ్రమ అవసరమన్నారు. కేవలం 5 సంవత్సరాలలోనే మూడు రాష్ట్రాలలో విస్తరించిన గోల్డెన్ మార్క్ సంస్థ వారి కృషి ఎంతో అభినందనీయమన్నారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని, రైతులకు నాణ్యమైన ఎరువులు అందించడం చాలా ముఖ్యమన్నారు. డీలర్లు కంపెనీ, రైతుల మధ్య వంతెనగా పనిచేస్తారన్నారు. వారు కూడా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలన్నారు. సంస్థ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు.తమ ఆహ్వానం మన్నించి మా కంపెనీ డీలర్ల వార్షికోత్సవ సమావేశంనకు హాజరైన అతిథులకు కంపెనీ ప్రతినిధులు శాలువా కప్పి,మెమోంట్ నందించి ఘనంగా సత్కరించారు. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవవసాయ శాఖ మాజీ మంత్రి రఘువీరారెడ్డి మాట్లాడుతూ గోల్డెన్ మార్క్ ఫెర్ట్ చెమ్ ప్రవేట్ లిమిటెడ్ ఒక ప్రముఖ వ్యవసాయ ఇన్పుట్ తయారీ సంస్థగా నిలుస్తోందన్నారు. ఈ సంస్థ మైక్రో న్యూట్రింట్స్, వాటర్ సొల్యూబ్లె ఫర్టిలైజర్స్, బయోస్టిములంట్స్ తయారీలో ప్రత్యేక గుర్తింపు సంపాదించడం హర్షించదగ్గ విషయమన్నారు. నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ, రైతులకు సమర్థవంతమైన ఉత్పత్తులు అందించడం ద్వారా మార్కెట్లో విశ్వసనీయ బ్రాండ్గా ఎదుగుతోందన్నారు. కంపెనీ వ్యవస్థాపకుడు,సి సిఓ మోహన్ కుమార్ చదివిన విద్యనే ఆధారంగా తీసుకుని అదే రంగంలో సంస్థను స్థాపించడం నిజంగా అభినందనీయమన్నారు. చదువు, అనుభవం అదే రంగంలో ప్రస్థానం అనేది యువ పారిశ్రామికవేత్తలకు ఒక మంచి దారి చూపే ఉదాహరణనన్నారు.తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,కర్నాటక మూడు రాష్ట్రాల నుంచి వచ్చిన డీలర్లందరినీ ఒకే వేదికపై కలవడం నాకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. గోల్డెన్ మార్క్ వంటి సంస్థలు రైతులకు నాణ్యమైన ఉత్పత్తులు అందించడం మాత్రమే కాకుండా, కొత్త శాస్త్ర సాంకేతికతలను పరిచయం చేస్తూ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ రైతులను బలోపేతం చేయాలన్నారు. రైతు బలంగా ఉంటేనే దేశం బలంగా ఉంటుంద అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మడకశిర మాజీ ఎమ్మెల్యే కరికెర సుధాకర్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి వ్యక్తిగత సహాయకుడు సుబ్బారెడ్డి, సంస్థ వ్యవస్థాపకులు సీఈఓ జిహెచ్ మోహన్ కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ వెల్మల శివకుమార్, డైరెక్టర్ ఈరన్న, ఆంధ్రప్రదేశ్ ఇన్చార్జ్ రోమకర్, కర్ణాటక రాష్ట్ర ఇన్చార్జ్ హనుమంత నాయక్, తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జ్ దేవేంద్ర రావు, అకౌంట్స్ అడ్మిన్ చిట్టిబాబు సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**ఏపి గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి**



**విజయవాడ, ఏప్రిల్,18,(మనం ప్రతినిధి):** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మహిళా సాధికారతపై తన అభిప్రాయాలను వెల్లడించారు. మహిళా బిల్లు పార్లమెంట్లో ఆమోదం పొందితే మహిళలకు రాజకీయంగా మరింత బలం చేకూరేదని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. శనివారం మంత్రి పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కి ఆలయ ఈవో వీకే శీనా నాయక్ స్వాగతం పలకగా ఆలయ పండితులు ఆశీర్వచనాలు అందించి ప్రత్యేక పూజలు అనంతరం ప్రసాదం అందజేశారు. అనంతరం మంత్రి కొలుసు పార్థ సారథి మీడియాతో మాట్లాడుతూ... తన పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సాధికారత దిశగా మహిళా బిల్లు కీలకమని, అది ఆమోదం పొందుతుందని ఆశించామని చెప్పారు. ఆ బిల్లు ఆమోదం పొందితే తన పుట్టినరోజు మరింత ఆనందంగా ఉండేదని అభిప్రాయపడ్డారు. అయితే కూటమి నాయకత్వంలో ఆ బిల్లు ఆమోదం పొందకపోవడం బాధాకరమని మంత్రి పేర్కొన్నారు. మహిళల రాజకీయ సాధికారతకు అడ్డంకులు కలగడం సమంజసం కాదని అన్నారు. మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మహిళల అభివృద్ధి, సాధికారతకు తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు.







# ఉత్కంఠ పోరులో దిల్లీదే గెలుపు

ఐపీఎల్ 2026లో భాగంగా ఆర్సీబీతో జరిగిన మ్యాచ్ లో దిల్లీ క్యాపిటల్స్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని దిల్లీ క్యాపిటల్స్ 19.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కేఎల్ రాహుల్ (57; 34 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సులు), ట్రిస్టన్ స్టబ్స్ (60₹; 47 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. అక్షర్ పటేల్ (26 రిటైర్డ్ హర్ట్; 19 బంతుల్లో 3 ఫోర్లు) అయ్యాడు. చివర్లో డేవిడ్ మిల్లర్ (22₹; 10 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సులు) దూకుడుగా ఆడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఆర్సీబీ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ 3, కృనాల్ పాండ్య ఒక వికెట్ పడగొట్టారు.

దిల్లీ విజయానికి చివరి ఓవర్లో 17 పరుగులు అవసరం కాగా.. తొలి రెండు బంతుల్లో (రొమారియో షెఫర్డ్ బౌలర్) రెండు రన్స్ వచ్చాయి. దీంతో ఉత్కంఠ మరింత పెరిగింది. తర్వాత డేవిడ్ మిల్లర్ వరుసగా రెండు సిక్స్ లు కొట్టడంతో స్కోర్లు సమయ్యాయి. ఐదో బాల్ కు బౌండరీ రావడంతో దిల్లీ విజయం సాధించింది. ఐదు మ్యాచ్ ల్లో దిల్లీకిది మూడో విజయం. ఆరు మ్యాచ్ ల్లో ఆర్సీబీకిది రెండో ఓటమి.

తొలుత ఆర్సీబీ బ్యాటర్లలో ఓపెనర్ ఫిల్ సాల్ట్ (63; 38 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు) రాణించాడు. సాల్ట్ మెరుపులతో 9 ఓవర్లకు 90/1తో బలమైన స్థితిలో కనిపించిన ఆర్సీబీ తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయి ఊహించిన దాని కన్నా తక్కువ స్కోరుకే పరిమితమైంది. టిమ్ డేవిడ్ (26; 17 బంతుల్లో), కోహ్లీ (19), పడిక్కల్ (18), జితేశ్ (14), కృనాల్ పాండ్య (12), రజత్ పటిదార్ (8) పరుగులు చేశారు. దిల్లీ బౌలర్లలో లుంగి ఎంగిడి, అక్షర్ పటేల్, కుల్ దీప్ యాదవ్ రెండేసి వికెట్లు పడగొట్టగా.. ముకేశ్ కుమార్ కు ఒక వికెట్ దక్కింది.

## కోహ్లీపై ట్రోలింగ్.. జర్మనీ మోడల్ రియాక్షన్



విరాట్ కోహ్లీ ఇన్ స్టాగ్రామ్ ఖాతా నుంచి కొట్టిన లైక్ తో జర్మనీ మోడల్ లిజ్లాజ్ ఒక్క రోజులో పాపులరైంది. దీనిపై నెటిజన్లు కోహ్లీని ట్రోల్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే లిజ్లాజ్ స్పందించింది. కోహ్లీపై విమర్శలు రావడం తనకు బాధగా అనిపించిందని పేర్కొంది.

''ముందు విరాట్ కోహ్లీ నా ఫొటోని లైక్ చేసినప్పుడు నేను ఎంతో సంతోషించాను. ఆ తర్వాత ఆ పోస్ట్ ని ఆయన అన్ లైక్ చేశారు. అనుకోకుండా నేను పాపులర్ అయినందుకు ఆనందమే కానీ, తర్వాత బాధగా అనిపించింది. ఈ ఒక్క లైక్ సోషల్ మీడియాలో ఇంత పెద్ద స్టోరీ అవుతుందని ఊహించలేదు. కోహ్లీని ఇంతగా ట్రోల్ చేస్తారనుకోలేదు. ఆ లైక్ వెనక అతనికి దురుద్దేశం లేకపోయినా నెటిజన్లు తప్పుగా అర్థం చేసుకున్నారు. ఏదేమైనా నా ఫొటోని స్టార్ క్రికెటర్ లైక్ చేసినందుకు గర్వంగా అనిపించింది'' అని లిజ్లాజ్ పేర్కొన్నారు. ఈ జర్మనీ మోడల్ ఐపీఎల్ మ్యాచ్ లను తెగ ఇష్టపడుతుందంట. అందులోనూ ఆర్సీబీకి వీరాభిమాని అని చెప్పింది. తాజాగా లిజ్లాజ్ ఆర్సీబీ జెర్సీ ధరించి పాటపాడుతున్న ఓ వీడియోని ఇన్ స్టాలో పోస్టు చేసింది. దీంతో నెటిజన్లు 'మీరు తర్వాత జరిగే ఆర్సీబీ మ్యాచ్ కి వస్తున్నారా' అంటూ ఆ వీడియోకి కామెంట్లు పెడుతున్నారు. 'అవును నాక్కూడా ఆర్సీబీ మ్యాచ్ ను స్టేడియంలో చూడాలనే ఉంది. కానీ జర్మనీలో ఉన్నా' అంటూ లిజ్లాజ్ ఆ కామెంట్లకు స్పందించారు.

## నటిపై పరువునష్టం దావా వేసిన చాహల్



క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ తనకు ఇన్ స్టాగ్రామ్ లో ప్రైవేట్ గా మెసేజ్లు పంపిస్తున్నాడంటూ బాలీవుడ్ నటి తాన్యా ఛటర్జీ ఇటీవల ఆరోపించింది. దీంతో చాహల్ పేరు నెట్టింట మార్మోగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే క్రికెటర్, తాన్యపై పరువునష్టం దావా వేసినట్టు తెలుస్తోంది.

ఇటీవల నటి తాన్య చాహల్ పై కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. 'క్యూట్ గా ఉన్నావు' అంటూ చాహల్ తనకు నేరుగా మెసేజ్ చేసినట్టు స్క్రీన్ షాట్ ను ఆమె మీడియాకు చూపించింది. అందుకు సంబంధించిన వీడియో నెట్టింట వేగంగా వైరలైంది. దీంతో నెటిజన్లు చాహల్ పై విమర్శల దాడికి దిగారు. చాహల్ పీఆర్ టీమ్ ఆ వీడియోని సోషల్ మీడియా నుంచి తొలగించాలని కోరినట్టు తాన్య పేర్కొంది. ఈ క్రమంలోనే యుజ్వేంద్ర నటిపై పరువు నష్టం దావా వేశాడు. ఈ విషయంపై తాజాగా మరోసారి స్పందించిన నటి తనను మాత్రమే ట్రోల్ చేస్తున్నారని, చాహల్ ని ఎవరూ ప్రశ్నించట్లేదని ఆవేదన వ్యక్తంచేసింది. ''ఈ విషయం ఇంతలా వైరల్ అవుతుందని నాకు తెలియదు. నన్నే ఎక్కువగా ట్రోల్ చేస్తున్నారు. పరువు పోయింది నాది. కానీ దానికి వ్యతిరేకంగా నా మీదే పరువు నష్టం దావా వేశారు. ఎందుకు యుజ్వేంద్రని ఎవరూ ప్రశ్నించట్లేదు. నేను అతని వ్యక్తిత్వాన్ని తప్పు పట్టాలని అనుకోలేదు. నాకు చాహల్ పై ఎంతో గౌరవం ఉంది '' అని తాన్య వెల్లడించింది.

## ఐపీఎల్ తరహాలో తెలంగాణ టీ20 లీగ్..




మొట్ట మొదటి తెలంగాణ టీ20 లీగ్ ఎడిషన్ ను నిర్వహించేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సన్నద్ధమైంది. జూన్ లో జరగనున్న ఈ టోర్నమెంట్ లో జట్ల యాజమాన్యం కోసం టెండర్ ప్రక్రియను హెచ్ సీఏ ప్రారంభించింది. జట్టు యాజమాన్య హక్కులు మొదటి 5 ఏళ్ల కాలానికి ఇవ్వబడతాయి. ఆ తర్వాత ప్రతి 3 ఏళ్లకు ఒకసారి రెన్యూవల్ చేస్తారు. ఒక్కో జట్టుకు కనీస బిడ్ ధర రూ. 3 కోట్లుగా నిర్ణయించారు. ఆటగాళ్ల జీతాలు, సిబ్బంది ఖర్చులు, వసతి, జెర్సీల ఖర్చులను ఫ్రాంచైజీ యజమానులే భరించాలి. కొత్త జట్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి ఉన్న సంస్థలు ఏప్రిల్ 28లోపు టెండర్ పత్రాలు సమర్పించాలి. ఏప్రిల్ 30న షార్ట్ లిస్ట్ చేసిన ఫ్రాంచైజీలను ప్రకటించనున్నారు. ఈ టోర్నీలో మొత్తం 8 ఫ్రాంచైజీలు పాల్గొనున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, నల్గొండ, మెదక్, ఆదిలాబాద్, మహబూబ్ నగర్ ప్రాంతాలను ప్రతిపాదించారు. ఆఖరికి బిడ్డింగ్ ద్వారా 8 జట్లను ఖరారు చేస్తారు. ఈ టోర్నీ 21 రోజులు పాటు ఉప్పల్ మైదానం వేదికగా జరగనుంది. మొత్తంగా 32 మ్యాచ్ లు జరుగుతాయి.



## 'హాయ్ నాన్న' దర్శకునితో విజయ్..

మన టాలీవుడ్ సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ ఇప్పుడు రూట్ మార్చి సాలిడ్ లైనప్ ని సిద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. క్రేజీ ప్రాజెక్ట్ లు రౌడీ జనార్ధన అలాగే రణబాలి అంటూ భారీ ప్రాజెక్ట్ లు చేస్తున్న విజయ్ దేవరకొండ నుంచి మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ ఇప్పుడు అనౌన్స్ అయ్యింది. తన మొదటి సినిమా హాయ్ నాన్న తోనే మంచి ఫేమ్ అందుకున్న దర్శకుడు శౌర్యువ్ తో ఇపుడు విజయ్ తన తదుపరి సినిమాని అనౌన్స్ చేయడం విశేషం. పైగా దీనిని ఒక స్ట్రైకింగ్ పోస్టర్ తో రివీల్ చేయడం విశేషం. విజయ్ అండ్ సినిమా గ్యాంగ్ అంతా తమ తమ ఆయుధాలతో కలిసి నడుస్తూ వస్తున్నట్టుగా ఇందులో కనిపిస్తున్నారు. ఇక ఇందులో ఇంట్రెస్టింగ్ లైన్ కూడా ఉంది. 'ఇప్పటి కోపం అంతా ఒకప్పటి ప్రేమ' అంటూ చెబుతున్నారు. దీనితో వీరి కాంబినేషన్ నుంచి ఓ ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ రాబోతుంది అని చెప్పవచ్చు. ఇక ఈ సినిమాకి కూడా హేశం అబ్దుల్ వాహాబ్ సంగీతం అందించనుండగా అదే హాయ్ నాన్న నిర్మాణ సంస్థ వైరా ఎంటర్టైన్మెంట్స్ నిర్మాణం వహిస్తున్నారు.

## రిపబ్లిక్ డే వేళ ప్రేమయుద్ధం

'బ్రహ్మాస్త్ర'లో ప్రేమికులుగా కనిపించి ప్రేక్షకుల్ని అలరించిన రణ్ బీర్ కపూర్, అలియా భట్ లను మరోసారి జంటగా చూపించబోతున్న చిత్రం 'లవ్ అండ్ వార్'. విక్కీ కౌశల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ ముక్కోణపు



ప్రేమకథను ప్రముఖ దర్శకనిర్మాత సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కిస్తున్నారు. 2025లోనే తెరపైకి రావాల్సిన ఈ చిత్రం కొన్ని కారణాలతో వాయిదా పడిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమాను గణతంత్ర దినోత్సవం సందర్భంగా వచ్చే ఏడాది జనవరి 21న థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించింది చిత్రబృందం. ప్రేమ, నమ్మకం, యుద్ధం.. లాంటి అంశాల మేళవింపుగా తీర్చిదిద్దుతున్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం 'ఆల్ఫా' చిత్రంతో అలియా, 'రామాయణ'తో రణ్ బీర్ బిజీగా గడుపుతున్నారు.



## బ్యాంకాక్‌లో రష్మిక యాక్షన్ అవతార్ చూస్తే షాకవ్వాల్సిందే!


నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఇటీవల పెళ్లి జీవితంలోకి అడుగు పెట్టిన సంగతి తెలిసిందే. ఇక ఆ చాప్టర్ తర్వాత మళ్ళీ తన ప్రొఫెషనల్ లైఫ్ లో బిజీగా మారింది. రష్మిక ఇది వరకు సినిమాలు అన్నీ ఒకెత్తు ఇప్పుడు చేస్తున్న 'మైసా' మరొక ఎత్తు. ఈ సినిమా కోసం ఎన్నడూ లేని విధమైన డెడికేషన్ ని రష్మిక చూపిస్తుంది. ఇలా రోజుకు 8 గంటల కఠిన శిక్షణ తీసుకుంటున్న రష్మిక విజువల్స్ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి.

కొత్త దర్శకుడు రవీంద్ర పుల్లె దర్శకత్వంలో అన్ ఫార్ములా ఫిలిమ్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో రష్మిక ఒక గోండు గిరిజన యువతిగా కనిపించనుంది. పాత్ర డిమాండ్ మేరకు అటు ఎమోషనల్ గా, ఇటు ఫిజికల్ గా తనను తాను పూర్తిగా మార్చుకునే పనిలో పడింది. ఇందులో భాగంగానే ప్రస్తుతం బ్యాంకాక్ లో ఒక కఠినమైన యాక్షన్ బూట్ క్యాంప్ లో పాల్గొంటోంది. రోజుకు దాదాపు 8 గంటల పాటు హ్యాండ్-టు-హ్యాండ్ కంబాట్, హై-స్పీడ్ యాక్షన్, స్టంట్స్ నేర్చుకుంటోంది. గ్లోబల్ ఎక్స్ పర్ట్స్ సమక్షంలో సాగుతున్న ఈ ట్రైనింగ్ లో రష్మిక డెడికేషన్ ఏ స్థాయిలో ఉందో అక్కడి నుంచి వస్తున్న ఫోటోలు స్పష్టం చేస్తున్నాయి. ఎప్పుడూ నవ్వుతూ, చాలా సాఫ్ట్ గా కనిపించే రష్మిక.. ఇప్పుడు పూర్తిగా కండలు తిరిగిన ఫైటర్ లా మారిపోతోంది.

**కేరళలో భారీ యాక్షన్ షెడ్యూల్**

త్వరలోనే కేరళలో 16 రోజుల పాటు సాగే ఒక కీలకమైన యాక్షన్ షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఈ షెడ్యూల్ కోసమే ఇంటర్నేషనల్ స్టంట్ డైరెక్టర్ ఆండీ లాంగ్ పర్యవేక్షణలో రష్మిక ఈ రేంజ్ లో చెమటోడుస్తోంది. లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ సినిమాల్లో 'మైసా' ఒక కొత్త బెంచ్ మార్క్ సెట్ చేస్తుందని చిత్ర యూనిట్ బలంగా నమ్ముతోంది. ఈ సినిమాలో ఈశ్వరీ రావు, గురు సోమసుందరం, రావు రమేష్ లాంటి సీనియర్ నటులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. జేక్స్ బిజోయ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా, శ్రేయాస్ పి కృష్ణ సినిమాటోగ్రాఫర్ గా పనిచేస్తున్నారు.

కేవలం గ్లామర్ కే పరిమితం కాకుండా తనలోని అసలైన నటిని, ఫైటర్ ని బయటికి తీసేందుకు రష్మిక చేస్తున్న ఈ ప్రయోగం కచ్చితంగా ఆమె కెరీర్ లో ఒక మైలురాయిగా నిలిచిపోవడం ఖాయంగా కనిపిస్తోంది.



## దిల్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించిన అల్లు అర్జున్



వివిధ మాధ్యమాల్లో తన పేరు, ఫొటోలు, గొంతు, వ్యక్తిగత లక్షణాల్ని అనుమతి లేకుండా వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. ప్రముఖ కథానాయకుడు అల్లు అర్జున్ ఇటీవల దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఆయన అభ్యర్థనను న్యాయస్థానం స్వీకరించింది. ఈ సందర్భంగా అల్లు అర్జున్ తరఫున సీనియర్ అడ్వకేట్ స్వాతి సుకుమార్ వాదనలు వినిపిస్తూ.. నిందితులు అర్జున్ ఫొటోలతో వస్తువుల్ని విక్రయించారని, అభ్యంతరకరమైన పోర్నోగ్రాఫిక్ మెటీరియల్ ను ప్రచారంలోకి తెచ్చారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా 'ఫేక్ కాల్ పుష్ప' అనే మొబైల్ యాప్ పై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ యాప్ ద్వారా అల్లు అర్జున్ ఏఐ రూపంతో వీడియో కాల్ మాట్లాడవచ్చని, దీనివల్ల ఎవరైనా మోసాలకు పాల్పడే అవకాశముందని, ఇది నటుడి ప్రతిష్ఠకు భంగం కలిగించడమే కాకుండా.. ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రమాదం ఉందని వివరించారు. దీనిపై ఫ్రాంక్లీ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున హాజరైన న్యాయవాది.. తమ సంస్థ కేవలం మధ్యవర్తి మాత్రమేనని.. దీనిపై ఫిర్యాదు అందిన వెంటనే ఆ లింక్ తొలగించినట్లు కోర్టుకు తెలిపారు. దీంతో మూడు రోజుల్లోగా కంప్లయన్స్ రిపోర్టు సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది.

## 'రేజర్' ఊచకోత..

### మోస్ట్ వయొలెంట్‌గా రవిబాబు

వైవిధ్యమైన చిత్రాలకు కేరాఫ్ అడ్రస్గా నిలిచే యాక్టర్ కమ్ డైరెక్టర్ రవిబాబు మళ్ళీ తన మార్క్ థ్రిల్లర్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'రేజర్'. సురేష్ ప్రొడక్షన్స్ సమర్పణలో ఫ్లయింగ్ ఫ్రాగ్స్ బ్యానర్ పై



రూపొందిన ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ ఈ సినిమాపై బజ్ క్రియేట్ చేశాయి. ఇక తాజాగా ఈ చిత్ర ట్రైలర్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ ట్రైలర్ చూసి అభిమానులు థ్రిల్ అవుతున్నారు.

ఈ ట్రైలర్ ఆద్యంతం హై వోల్టేజ్ వయొలెన్స్ అండ్ యాక్షన్ తో నింపేశారు. ఈ ట్రైలర్ లో రవిబాబు మునుపెన్నడూ లేని విధంగా మోస్ట్ వయెలెంట్ గా రా అవతారంలో కనిపించి అందరినీ సర్ ప్రైజ్ చేశాడు. ఒక చిన్న పాపను కాపాడే క్రమంలో రవిబాబు చేసే మారణహోమం మనకు ఈ చిత్ర మెయిన్ ప్లాట్ గా చూపెట్టబోతున్నారని ఈ ట్రైలర్ లోనే రివీల్ చేశారు. వయొలెన్స్ మరియు యాక్షన్ సీక్వెన్స్ చూస్తుంటే, రవిబాబు ఈసారి చాలా గ్రిప్పింగ్ గా ఇంటెన్స్ మర్డర్ మిస్టరీని ప్లాన్ చేసినట్లు అర్థమవుతోంది. ఇక టెక్నికల్ పరంగా కూడా ఈ సినిమా చాలా రిచ్ గా ఉంది. చరణ్ మాధవనేని సినిమాటోగ్రఫీ, ఎస్.ఎస్. రాజేష్ సంగీతం సినిమా మూడ్ ను ఎలివేట్ చేస్తున్నాయి. ఈ చిత్రాన్ని మే 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. మరి ఈ 'రేజర్' చిత్రంతో రవిబాబు మరోసారి తనదైన మార్క్ హిట్ అందుకుంటాడా అనేది వేచి చూడాలి.

## బాలయ్య, కొరటాల నిజమేనా?



ప్రస్తుతం నందమూరి నటసింహం బాలకృష్ణ ఫుల్ ఫామ్ లో ఉన్న సంగతి అందరికీ తెలిసిందే. అలాగే మన సీనియర్ హీరోస్ లో ది బెస్ట్ లైనప్ తో కూడా బాలయ్య దదూసుకెళ్తున్నారు. ఇలా ప్రస్తుతం బాలయ్య దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్లో సాలిడ్ ప్రాజెక్ట్ చేస్తున్నారు. ఆ తర్వాత పలువురు యువ దర్శకులు కూడా ఓకే అయ్యారు. మరి ఇది పక్కన పెడితే లేటెస్ట్ గా ఓ క్రేజీ బజ్ వైరల్ గా మారింది. ఈసారి బాలయ్య, కొరటాల శివ కాంబినేషన్ పడనుంది అని తెలుస్తోంది. దాదాపుగా ఈ సెన్సేషనల్ కలయిక ఖరారే అన్నట్లు టాక్. మరి ఈ కాంబినేషన్ పై అధికారిక క్లారిటీ రావాల్సి ఉంది. ప్రస్తుతం కొరటాల దేవర 2 పనుల్లో బిజీగా ఉన్నారు. కానీ ఈ సినిమా మొదలు కావడానికి సమయం పడుతుంది. సో ఈ గ్యాప్ లో బాలయ్యతో సినిమా ఉంటుందా ఏమో అనేది వేచి చూడాల్సిందే.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.